సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 257

గురువారం 8-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



సిరీస్ సమర్పయామి

బంగ్లాదేశ్ చేతిలో రెండో వన్డేలోనూ ఓడి సిరీస్ కోల్పోయిన భారత్ - 12లో



ఈఎంఐల మోత

0.35 శాతం పెరిగి 6.25 శాతానికి చేరిన రెపో రేటు - 13లో



విజయవాడలో జరిగిన జయహో బీసీ మహాసభ ప్రాంగణంలో ఓ భాగం

బీసీలే వెన్నెముక

మూడున్నరేళ్ల పాలనలో ఇదే అంశాన్ని చాటిచెప్పాం

జయహో బీసీ మహాసభలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్

- బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల కంటే అధికంగా అమలు చేశాం
- ఆర్థిక, రాజకీయ, సామాజిక, మహిళా, విద్యా సాధికారత సాధించే దిశగా అడుగులు వేశాం
- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా బీసీలకు రూ.1.63 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చాం.. కేవలం డీబీటీ రూపంలోనే నేరుగా బీసీల ఖాతాల్లో రూ.86 వేల కోట్లు
- మంత్రివర్గం నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే
- వివిధ పదవులకు ఎన్నికై ఇక్కడికొచ్చిన 85 వేల మందే రాజకీయ సాధికారతకు నిదర్శనం.. ఆసరా, చేయూతతో మహిళా సాధికారతకు బాటలు వేశాం
- అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నాం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా పేదలుగా మిగిలిపోవాలన్నదే బాబు అండ్ కో ఉద్దేశం
- నా వెంటే ఉన్న మీ అందరినీ అన్ని విధాలా అందలం ఎక్కించాలన్నది నా తాపత్రయం

2లో

ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

> మహాకవి శ్రీశ్రీ మహా ప్రస్థానంలో చెప్పినట్టు.. కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి ఇలా మన సహస్ర గ్రామీణ వృత్తుల సంగమం వేల సంవత్సరాలుగా మన కుటీర పరిశ్రమల సముదాయం మన బీసీ. నా మనసంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, నిరుపేద వర్గాల వారే. నా ఆచరణ కూడా మీరే. నా వెనకాల ఉన్న ఆ నలుగురూ కూడా మీరే. మీరిచ్చిన అధికారాన్ని మనసుతో మీ కోసం ఉపయోగించే విషయంలో మీ అన్న, మీ తమ్ముడు, మీ బిడ్డ అందరికంటే మిన్నగా ఉంటాడు.

> నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, నిరుపేద వర్గాలకు ఇస్తున్న రాష్ట్ర బడ్జెట్‌ను వారికి అందనివ్వకుండా 40 ఏళ్లుగా అడ్డంగా తిని, బొజ్జలు బాగా పెంచిన దుష్ట చతుష్టయంతో మనం యుద్ధం చేయబోతున్నాం. ఇదే విషయాన్ని గడప గడపలోనూ చెప్పండి. మనందరి ప్రభుత్వం ద్వారా లబ్ధి కలిగి ఉంటేనే జగనన్నకు తోడుగా నిలవాలని అడగండి.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఇది పేదలు, పెత్తందార్ల మధ్య యుద్ధం

2లో

- వాళ్లంతా పేదల శత్రువులని గడప గడపకూ వెళ్లి చెప్పండి
- జయహో బీసీ మహాసభలో ప్రజాప్రతినిధులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ఇంట్లో మంచి జరిగితేనే వచ్చే ఎన్నికల్లో జగనన్నకు తోడుగా ఉండమని అడగండి
- చంద్రబాబును ఒకసారి నమ్మాం.. అడుగులు వెనక్కు పడ్డాయి
- జగన్‌ని నమ్మాం.. మన బతుకులు మారాయా? లేదా? అని ఆలోచించమనండి
- చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని గట్టిగా చెప్పండి

కదనోత్సాహం

'జయహో బీసీ మహాసభ'కు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపే ప్రభంజనమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి బీసీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో కదలివచ్చారు. మంచుతెరలు తొలగకముందే.. సభ ప్రాంగణానికి పోటెత్తారు. జయహో బీసీ.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. బీసీ డిక్లరేషన్‌లో చెప్పినదాని కంటే సీఎం జగన్ మిన్నగా చేస్తున్నారని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

సీఎం భరోసా.. దొరికింది ఆసరా

- కాన్వాయ్‌లో వెళ్తూ నిస్సహాయ స్థితిలో ఉన్న యువకుడిని గమనించిన సీఎం
- తగిన వైద్యం, సహాయం అందించాలని కలెక్టర్‌కు ఆదేశాలు.. ఆస్పత్రిలో చికిత్స, రూ. లక్ష చెక్కు అందజేత

- మరిన్ని కథనాలు 2,3లో



వలంటీర్ మారినా ఫోన్ నంబర్ మారదు

- కొత్తగా వచ్చే వలంటీర్‌కు పాత నంబరే కేటాయింపు
- నంబర్ వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు
- ఈ నెల పదిలోగా సిమ్‌ల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

10లో



ఢిల్లీపై ఆప్ జెండా

- కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం
- 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెర
- 250 వార్డుల్లో 134 నెగ్గిన కేజ్రీవాల్ పార్టీ.. బీజేపీకి 104.. కాంగ్రెస్‌కు 9 వార్డులు

6లో

గుజరాత్, హిమాచల్ ఫలితాలు నేడే

ఏర్పాట్లు పూర్తి చేసిన ఈసీ

- వివరాలు 6లో

రైతుబజార్ల సిబ్బంది జీతాల పెంపు



- 23 శాతం పెంచిన ప్రభుత్వం.. ఎస్టేట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులకు వర్తింపు
- విశాఖ, విజయవాడ, గుంటూరు ఎస్టేట్ ఆఫీసర్లకు రూ.26 వేలకు పెరిగిన జీతం
- సూపర్‌వైజర్లకు రూ.18,500కు పెంపు
- మిగిలిన చోట్ల ఎస్టేట్ ఆఫీసర్లకు రూ.24 వేలకు, సూపర్‌వైజర్లకు రూ.15 వేలకు పెంపు..
- సెక్యూరిటీ గార్డుల వేతనం రూ.15 వేలకు పెంచుతూ ఉత్తర్వులు

10లో

నేడు తుపానుగా మారనున్న వాయుగుండం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం ఉదయం తుపానుగా మారనుంది. ప్రస్తుతం తీవ్ర వాయుగుండంగా కొనసాగుతోంది. బుధవారం రాత్రి చెన్నైకి 700 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ విభాగం తెలిపింది. 9వ తేదీ రాత్రి తమిళనాడులోని మహాబలిపురం సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో 8వ తేదీ నుంచి 3 రోజులపాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.



14లో





వేదికపై ఆశీనులైన సీఎం వైఎస్ జగన్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు

బీసీలే వెన్నెముక

జయహో బీసీ మహాసభ ప్రాంగణం నుంచి
'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి:

బీసీలు అంటే బ్యాక్ వర్డ్ క్లాసులు కాదు బ్యాక్ బోన్ క్లాసులని చాటిచెబుతూ మూడున్నరేళ్లుగా అడుగులు ముందుకు వేస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. 2019 ఫిబ్రవరి 17న ఏలూరులో నిర్వహించిన బీసీ గర్జనలో బీసీలను సమాజానికి వెన్నెముక కులాలుగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చానని.. ఆ దిశగా ప్రతి అడుగూ వేస్తున్నానని గుర్తు చేశారు. '2014 ఎన్నికల్లో బీసీలకు చంద్రబాబు ఏకంగా 114 వాగ్దానాలు ఇచ్చి, అందులో 10 శాతం కూడా అమలు చేయకుండా దగా చేస్తే.. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకున్న మా జగనన్న ప్రభుత్వానికి మేము ఇప్పుడు వెన్నెముక కులాలుగా మారామని, నేడు రాజ్యాధికారంలో మేమంతా భాగస్వాములమని ఆ చంద్రబాబుకు చెప్పండి' అని పిలుపునిచ్చారు. విజయవాడలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన జయహో బీసీ మహాసభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మహాసభకు వేలాదిగా కదలివచ్చిన బీసీ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో వార్డు మెంబర్ మొదలు ఎంపీ వరకు వివిధ పదవులకు ఎన్నికైన దాదాపు 85 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులు, అక్కచెల్లెమ్మలందరికీ నిండు మనస్సుతో చేతులు జోడించి పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఇవాళ ఇక్కడ కనిపిస్తున్న జన సంద్రం మన రాజకీయ సాధికారతకు నిదర్శనం అన్నారు. 'మీ హృదయంలో జగన్.. జగన్ హృదయంలో మీరు.. ఇది ఎప్పటికీ మన అనుబంధం' అని సగర్వంగా తెలియజేస్తున్నానని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

బీసీలే నాగరికతకు పట్టుకొమ్మలు

- ఒకనాటి పారిశ్రామిక విప్లవం, ఆధునిక విద్యకు దూరం చేయడం, రాజకీయంగా న్యాయబద్ధమైన వాటా ఇవ్వకపోవడం వల్ల బీసీలు వెనుకబాటుకు గురయ్యారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉన్న నా 139 బీసీ కులాల వారి కష్టాలను నా 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో స్వయంగా చూశాను.. విన్నాను. వారి ఆశలను, ఆకాంక్షలను తెలుసుకుని, 2019 ఫిబ్రవరిలో ఏలూరులో బీసీ గర్జన నిర్వహించాం. ఆ రోజు ఇచ్చిన మాట మేరకు బీసీలను వెన్నెముక కులాలుగా మార్చాను.



చంద్రబాబు మార్కు సామాజిక న్యాయం వేరు. మన మార్కు సామాజిక న్యాయం వేరు. తెలుగుదేశం పార్టీ సామాజిక అన్యాయాల పార్టీ అయితే, వైఎస్సార్‌సీపీ సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్న పార్టీ. మన పార్టీ మాత్రమే అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే, కొమరం భీమ్, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ల భావాలకు ప్రతీక.

- సీఎం వైఎస్ జగన్

తోకలు కత్తిరిస్తామని చంద్రబాబుకు చెప్పండి

- బీసీలంటే ఇస్త్రీ పెట్టెలు, కుట్టు మిషన్లు, షేవింగ్ కిట్లు, పనిముట్లు కాదని చంద్రబాబుకు చెప్పండి. వ్యవసాయ రుణమాఫీ, డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్.. కేజీ నుంచి పీజీ వరకు బీసీ పిల్లలందరికీ ఉచిత విద్య, కాలేజీ పిల్లలకు ఐప్యాడ్‌లు, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఏటా రూ.10 వేల కోట్లు.. ఇలా ఎన్నో వాగ్దానాలు చేసి.. బీసీలందరికీ నిలువెత్తు ద్రోహం చేసిన ఆ చంద్రబాబు మోసాన్ని గుర్తు చేయండి.
- మత్స్యకారుల అంతు చూస్తానని, నాయి బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానన్న బెదిరింపులను ఒక్కసారి అందరూ గుర్తుకు తెచ్చుకోండి. అయ్యా బాబూ.. మాకు తోకలు లేవు కానీ మీ తోకల్ని.. మీకు మొలిచిన కొమ్ముల్ని, మీకు కొమ్ము కాసేవారిని అందరినీ కత్తిరించే సామాజిక చైతన్యం మాకు ఉందని గట్టిగా చెప్పండి.

వెన్నెముక కులాలుగా మార్చడమంటే ఇదీ..

- మీ బిడ్డ జగన్ వయసు 49 ఏళ్లు. 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు 2024లో మన ప్రభుత్వం మీద ఒంటరి పోరాటం చేస్తానని మాత్రం చెప్పడం లేదు. ఎందుకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడి మీద ఆధారపడుతున్నారో తెలుసా? ఈ పెద్దమనిషి చేసింది చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్క పథకం లేదు.
- చంద్రబాబు ప్రభుత్వం రూ.10 వేల కోట్లు బీసీ సబ్‌ప్లాన్‌కు కేటాయిస్తామని చెప్పింది. చివరకు 5 ఏళ్లలో కనీసం రూ.20 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. మనం బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రతి ఏటా రూ.15 వేల కోట్లు, 5 సంవత్సరాలలో రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పాం. ఈ మూడున్నరేళ్లలో బీసీలకు మాత్రమే, డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఖర్చు చేసిన మొత్తం ఏకంగా రూ.1.63 లక్షల కోట్లు. ఇందులో డీబీటీ ద్వారా ఇచ్చిన సొమ్ము రూ.86 వేల కోట్లు. వెన్నెముక కులాలుగా మార్చడం అంటే ఇదీ.

నవరత్నాలు.. సామాజిక సాధికారత

- నవరత్నాల్లో మొదటిది ఆర్థిక సాధికారత, డీబీటీ, నాన్ డీబీటీ పరంగా అడుగులు వేశాం. రెండోది రాజకీయ సాధికారత, దీనికి అద్దం పట్టే విధంగా పదవులు, నియామకాలు. ఈ రెండింటి ద్వారా సామాజిక సాధికారత దిశగా పయనించాం. మహిళా సాధికారత నాలుగో విషయం. రేపటి తరాల భవిష్యత్ నిర్ణయించే విద్యా సాధికారత ఐదోది.
- గత మూడున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.3,19,228 కోట్లు లబ్ధి చేకూర్చాం. ఇందులో మొత్తంగా నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులు, అక్కచెల్లెమ్మలకు అందించింది అక్షరాలా రూ.2,50,358 కోట్లు. అంటే దాదాపు 80 శాతం.

దోచుకుతిన్న చంద్రబాబు, ఎల్లో బ్రదర్స్, దత్తపుత్రుడు

- 2018–19లో చంద్రబాబు హయాంలో బడ్జెట్ ఎంత ఉందో.. మన అందరి ప్రభుత్వానిది కూడా దాదాపు అంతే బడ్జెట్. అప్పుడు అప్పుల పెరుగుదల రేట్ 19 శాతం ఉంటే ఇప్పుడు 15 శాతం మాత్రమే. అదే రాష్ట్రం అదే బడ్జెట్, మీ బిడ్డ ప్రభుత్వంలోనే తక్కువ. మరి అప్పుడు ఈ పథకాలు ఎందుకు లేవని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. కారణం అప్పట్లో ఆ బడ్జెట్‌ను చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు.. మాత్రమే దోచుకో పంచుకో తినుకో (డీపీటీ) అనే పద్ధతిలో తినేసే పరిస్థితి.
- ఈ రోజు మీ బిడ్డ పాలనలో మీ బిడ్డ బటన్ నొక్కుతున్నాడు ఆ డబ్బు నేరుగా మీ ఇంటికి వస్తుంది. ఎక్కడా లంచాలు, వివక్ష లేవు. ప్రతి ఇంట్లో చిరునవ్వులు ఇవ్వగలిగాం.
- మన దేశంలో బీసీలకు మేలు చేయడానికి 1980లో వచ్చిన మండల్ కమిషన్ నాటి నుంచి అనేక కమిషన్లు, కమిటీలు ఏర్పాటైనా ఎక్కడా విద్య, ఉద్యోగాల విషయంలో అనేక అవరోధాలు ఎదురయ్యాయి. అలాంటిది మన రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం రాజకీయ సాధికారత విషయంలో చేతలతో ఒక విప్లవాన్ని తీసుకొచ్చింది.


సీఎంతో ఎంపీ విజయసాయిరెడ్డి మాటామంతీ

రాజకీయ సాధికారత అంటే ఇదీ..

- మంత్రి మండలిలో మొదటి విడతలో 56 శాతం నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్థానం కల్పిస్తే.. రెండో విడతలో దానిని ఏకంగా 70 శాతానికి తీసుకెళ్లాం. ఐదుగురికి ఉప ముఖ్యమంత్రులు పదవులు ఇస్తే అందులో నలుగురు ఈ వర్గాల వారే. 25 మంది మంత్రులలో 11 మంది ఈ రోజు బీసీలే ఉన్నారు.
- 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు కనీసం ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపిన పాపాన పోలేదు. మీ బిడ్డ రాజ్యసభకు 8 మందిని పంపితే అందులో నలుగురు మన బీసీలే.
- శాసనమండలిలో మన పార్టీ తరఫున 32 మంది ఎమ్మెల్సీలు ఉంటే అందులో 18 మంది నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే. శాసనసభ స్పీకర్‌గా ఇదే వేదికపై ఉన్న తమ్మినేని సీతారామ్ బీసీ. శాసనమండలి చైర్మన్‌గా ఎస్సీ వర్గానికి చెందిన మోషేన్, డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన నా అక్కను ఆ స్థానంలో కూర్చొబెట్టాం.

మహిళా సాధికారత దిశగా..

- ఏకంగా 30 లక్షల ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. అందులో ఇప్పటికే 21.20 లక్షల ఇళ్లు కూడా నిర్మాణంలో ఉన్నాయి. ఆ 30 లక్షల ఇళ్ల పట్టాలలో నా బీసీ అక్కచెల్లెమ్మలకు 16,70,286 ఇళ్లు ఇవ్వగలిగాం. అంటే 56 శాతం బీసీ అక్కచెల్లెమ్మలకు ఇచ్చి మేలు చేశాం. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అక్కచెల్లెమ్మలను కలుపుకుంటే.. 88 శాతం వీళ్లకే ఇళ్ల పట్టాలిచ్చాం. వీటిలో ఇళ్లు కట్టడం కూడా పూర్తయితే ప్రతి అక్కా, చెల్లెమ్మ చేతిలో రూ.5 లక్షల నుంచి 10 లక్షలు వారి చేతిలో పెట్టినట్లవుతుంది. రాష్ట్రం మొత్తంగా రూ.2..3 లక్షల కోట్లు వాళ్ల చేతుల్లో పెట్టినట్లవుతుంది.
- 79 లక్షల మంది పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.12,758 కోట్లు ఇచ్చాం. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.9,294 కోట్లు.. అంటే 73%. రేపు జనవరిలో మరో రూ.6,379 కోట్లు వారి చేతుల్లో పెట్టబోతున్నాం.
- దాదాపు కోటి రెండు లక్షల మంది ఉన్న నా పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ రూపంలో రూ.3,615 కోట్లు ఇచ్చాం. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు రూ.2,803 కోట్లు ఇచ్చాం. అంటే 78 శాతం నిరుపేద అక్కచెల్లెమ్మల చేతుల్లో పెట్టగలిగాం.
- 45 నుంచి 60 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న దాదాపు 26.40 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కలకు, చెల్లెమ్మలకు వైయస్సార్ చేయూత పథకం ద్వారా రూ.14,110 కోట్లు ఇచ్చాం.
- జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా దాదాపు 44.50 లక్షల మంది చెల్లెమ్మలకు రూ.19,617 కోట్లు ఇచ్చాం. ఇందులో రూ.15,378 కోట్లు అంటే 78 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ చెల్లెమ్మల చేతిలో పెట్టాం. మరో 25 లక్షల మంది పిల్లలకు, తల్లులకు మేలు చేస్తూ.. జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన డబ్బులన్నీ ఆ తల్లుల ఖాతాల్లో జమ చేశాం.

స్థానిక సంస్థలలో సింహభాగం వాటా

- స్థానిక సంస్థలకు మొత్తంగా 648 మండలాలకు ఎన్నికలు జరిగితే 637 మండలాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసింది. అందులో ఒక్క బీసీలకు మాత్రమే 237 ఎంపీపీ పదవులలో కూర్చోబెట్టాం. అంటే 38 శాతం. ఇక ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుంటే 67% ఇవ్వగలిగాం.
- 13 జిల్లా పరిషత్ చైర్మన్ పదవులలో బీసీలకు 6 పదవులు అంటే 46 శాతం ఇచ్చాం. మొత్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే 9 పదవులు అంటే 69 శాతం చైర్మన్ పదవులు.
- 14 నగర కార్పొరేషన్ మేయర్ పదవులలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తే.. బీసీలకు ఏకంగా 9 పదవులు అంటే 64 శాతం ఇచ్చాం. మొత్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుంటే 14కు గాను 12 పోస్టులు అంటే 86 శాతం మేయర్ పదవులు కట్టబెట్టాం.
- 87 మున్సిపాల్టీలకు గాను 84 చోట్ల వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసింది. ఇందులో 44 మున్సిపల్ చైర్మన్లుగా బీసీలు.. 53% కనిపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 58 స్థానాల్లో 69 శాతంగా వీరే రాజ్యాన్ని పాలిస్తున్నారు.

జయహో బీసీ అంటే ఇదీ..

- 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవుల్లో 76 అంటే 39 శాతం బీసీలకు ఇచ్చాం. మొత్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 117 అంటే 60 శాతం ఇచ్చాం.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 చైర్మన్ పదవులలో 53 పదవులు (39 శాతం) బీసీలకే ఇచ్చాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 79 అంటే 58 శాతం పదవులు ఇచ్చాం. వీటిలో 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవులుంటే అందులో 201 బీసీలకు 41 శాతం ఇచ్చాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 280 అంటే 58 శాతం ఇచ్చాం.
- బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు ప్రత్యేకంగా 3 కార్పొరేషన్లు, ఎస్టీలకు 1 కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. వీటిలో మరో 684 డైరెక్టర్ పదవులన్నీ వీరికే ఇచ్చాం. ఆలయ బోర్డులు, ఆలయ చైర్మన్ పదవులు తీసుకున్నా అందులో సగ భాగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే ఇచ్చాం.
- దాదాపుగా 7,006 ఆలయ బోర్డు మెంబర్ల పదవుల్లో 3,503 సగభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారే ఉన్నారు. ఇందులో బీసీలు ఒక్కరే 2,650 పదవుల్లో 38 శాతం ఉన్నారు. ఇది జయహో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అంటే.

ఉద్యోగాలలోనూ అధిక శాతం వాటా

- గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.30 లక్షల శాశ్వత ఉద్యోగాలిచ్చాం. ఇందులో 84% నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తమ్ముళ్లు, చెల్లెళ్లు పనిచేస్తున్నారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం ఇస్తామని లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు వాగ్దానం చేసి, మోసం చేశారు.
- మన ప్రభుత్వంలో 54 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో రెగ్యులరైజ్ అయ్యారు. ఆరోగ్య రంగంలో 46 వేల పోస్టులు.. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) ద్వారా మరో లక్ష మందికి ఎటువంటి దళారులు లేకుండా, లంచాలిచ్చే పరిస్థితి లేకుండా, కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా మెరుగైన జీతాలు కల్పిస్తున్నాం. కాంట్రాక్ట్‌లో పని చేస్తున్న వారికి తొలిసారిగా మినిమమ్ టైం స్కేల్ తీసుకొచ్చాం. 2.60 లక్షల మంది తమ్ముళ్లు, చెల్లెళ్లు వలంటీర్ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో 83% నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే. మొత్తంగా 6 లక్షల పై చిలుకు మంది చిరునవ్వుతో ఉద్యోగాలు చేస్తున్నారు.

వారు ఏ సామాజిక న్యాయానికి ప్రతినిధులో?

- ప్రభుత్వ బడులన్నింటినీ నాడు–నేడుతో రూపురేఖలు మార్చుతున్నాం. బైలింగ్యువల్ బుక్స్, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ తీసుకొచ్చాం. ఇన్ని చేస్తుంటే పెత్తందారీ చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 మొత్తంగా ఎల్లో బ్రదర్స్ వారితో పాటు దత్తపుత్రుడికి బాధ కలుగుతోంది. వీరంతా ఏ సామాజిక న్యాయానికి ప్రతినిధులో అందరూ ఆలోచించాలి.
- పేదలకు ఇళ్ల స్థలాలిస్తామంటే కోర్టులో కేసులు వేస్తారు. అమరావతిలో నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇళ్ల పట్టాలిస్తామంటే.. సామాజిక సమతుల్యం దెబ్బతింటుందని కోర్టుల్లో కేసులు వేయిస్తారు. చివరకి ప్రాంతాల వారీగా వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా 3 రాజధానులు చేస్తామని అంటే వీళ్లంతా అరిచి గీపెడుతున్నారు. వారు ఇలాగే పేదరికంలో మిగిలిపోవాలన్నది వారి ఆలోచన. వీళ్లను శాశ్వతంగా పేదరికంలోంచి ఎలా బయటకు తేవాలన్నది మీ బిడ్డ ప్రభుత్వం తాపత్రయం. మానవతావాదానికి ప్రతీక వైఎస్సార్‌సీపీ.

చెప్పినట్లుగా బీసీ డిక్లరేషన్ అమలు

- చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 139 కులాల పేర్లతో 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశాం. శాశ్వత బీసీ కమిషన్‌ను దేశంలో తొలిసారిగా నియమించాం. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేశాం.
- ఆలయ బోర్డులు మొదలు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల వరకు ఇతర నామినేటెడ్ పదవులన్నింటిలోనూ ఈ రోజు ఎక్కడ చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే కనిపిస్తున్నారు. ఇవాళ ఇక్కడ కనిపిస్తున్న 85 వేల మందే ఇందుకు సాక్ష్యం. నామినేషన్ పనుల్లో కూడా 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసి, అమలు చేస్తున్నాం.
- జగనన్న తోడు, జగనన్న చేదోడు ద్వారా షాపులు పెట్టుకుని సంప్రదాయ వృత్తులు చేసుకుంటున్న బీసీలకు, చిరు వ్యాపారులకు అండగా నిలిచాం. ఈ మూడున్నరేళ్లలో చేదోడు ద్వారా రూ.584 కోట్లు వారి చేతుల్లో పెట్టాం. జగనన్న తోడు ద్వారా రూ.2,059 కోట్లు సున్నా వడ్డీ రుణాలు అందించాం. తద్వారా దాదాపు 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయి.
- 45 ఏళ్లు నిండిన 26.40 లక్షల మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల కోసం చేయూత పథకం ద్వారా మేలు చేస్తున్నాం. ఈ మూడున్నరేళ్లలో రూ.14,110 కోట్లు ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక సాధికారతను బలోపేతం చేశాం. సన్నిధిగొల్లలకు తిరుమల ఆలయం తలుపులు తెరిచే సంప్రదాయ హక్కును పునరుద్ధరిస్తూ జీవో జారీ చేశాం.
- ఎంత పెద్ద చదువైనా సరే వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నాం. గత ప్రభుత్వం మిగిల్చిన బకాయిలూ చెల్లించాం. ఈ మూడున్నరేళ్లలో రూ.9,052 కోట్లు ఖర్చు చేశాం. హాస్టల్ ఖర్చుల కోసం వసతి దీవెన కింద రూ.20 వేల వరకు ఇస్తున్నాం. ఈ మూడున్నరేళ్లలో ఈ పథకానికి రూ.3,349 కోట్లు వెచ్చించాం.
- చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచాం. మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.418 కోట్లు అందించాం. సొంత మగ్గమున్న నేత కార్మికులకు ఏటా రూ.20 వేలు చొప్పున ఈ మూడున్నరేళ్లలో రూ.776 కోట్లు వారి చేతుల్లో పెట్టాం.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు


ఇందిరాగాంధీ స్టేడియం చుట్టూ ఉన్న గ్యాలరీలో ప్రతినిధులు ఇలా బారులు తీరారు

ఇది పేదలు, పెత్తందార్ల మధ్య యుద్ధం

జయహో బీసీ మహాసభ ప్రాంగణం నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి :

'మరో 18 నెలల్లో యుద్ధం జరగబోతోంది.. ఈ యుద్ధంలో నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, నిరుపేద వర్గాలు ఒకవైపు ఉంటే, మరో వైపు బీసీల తోకలను కత్తిరిస్తాను, ఎస్సీ కులాల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అనే దుర్మార్గమైన మనస్తత్వమున్న చంద్రబాబు ఉన్నారు. మంచికి, చెడుకు.. నిజాయితీకీ, వెన్నుపోటుకు.. పేదల భవిష్యత్‌కు, పెత్తందార్లకు.. మాట మీద నిలబడే నాయకత్వానికి, ప్రజలకు వెన్నుపోటు పొడిచే మనస్తత్వానికి మధ్య యుద్ధం జరగబోతోందని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండ'ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మీ ఇంట్లో మంచి జరిగితేనే జగనన్నకు తోడుగా ఉండండి. మంచి జరగకపోతే వద్దమ్మా.. జగనన్నే చెప్పాడు అని కూడా చెప్పండి.. ఎందుకంటే జగనన్న ఏదైతే చెప్పాడో అది చేస్తాడు' అని అన్నారు. 'వాళ్లంతా పేదల శత్రువులు. చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరి ఎన్నికలని తేల్చి చెప్పండి.. 2019కి మించి 2024 ఎన్నికల్లో మన గెలుపు ఖాయమని ఊరూరా.. ఇంటింటా చాటి చెప్పండి' అని 85 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ మహాసభలో సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ ఇంకా ఏమన్నారంటే..



గడప, గడపకూ మీరు కూడా వెళ్లాలి. ఇక నుంచి బూత్ కమిటీలు మొదలు కావాలి. ప్రతి 50 ఇళ్లకు ఒక అక్కచెల్లెమ్మ, ఒక అన్నదమ్ముడు మేపింగ్ జరగాలి. ప్రతి 50 ఇళ్లకు మనం ఓనర్‌షిప్ తీసుకోవాలి. మరో 18 నెలల్లో జరగబోయే ఎన్నికల్లో ఈ సారి మన టార్గెట్ 175కు 175 సీట్లు అని గుర్తుపెట్టుకోవాలి.

- సీఎం వైఎస్ జగన్

మారీచులతో యుద్ధం తప్పదు

- ఈ రోజు ఇక్కడకు వచ్చినవారంతా ప్రజాప్రతినిధులే. మీ మీ గ్రామాల్లో.. ప్రతి గడపకూ వెళ్లి 2024లో కూడా ఇంతకు మించిన గెలుపు ఖాయమని చెప్పండి. ఆ ఎన్నికల్లో కూడా మనమంతా మారీచులతోనూ, పెత్తందార్లతోనూ యుద్ధం చేయకతప్పదని చెప్పండి.
- పేదవాడి ఇంటింటికీ, మనిషి మనిషికీ మన ప్రభుత్వంలో పథకాలు అందితే.. రాష్ట్రం శ్రీలంక అవుతుంది అని ఈ పేదల శత్రువులు మాట్లాడుతున్నారని ప్రతి ఇంట్లో చెప్పండి. వీళ్లంతా రైతులకు, అవ్వాతాతలకు, అక్కచెల్లెమ్మలకు, చదువుకుంటున్న పేదపిల్లలకు శత్రువులు అని, ఇలాంటి మారీచులతో మనమంతా యుద్ధం చేయక తప్పదని గట్టిగా చెప్పండి.
- చంద్రబాబు పేరు చెబితే ఏ ఒక్క సంక్షేమ పథకం పేరు కూడా గుర్తుకు రాదు. అలాంటి బాబుతో, ఆయన ఎల్లో మీడియాతో, దత్తపుత్రుడితో... మూడున్నర సంవత్సరాలలో ఇన్ని విప్లవాత్మక సంక్షేమ పథకాలు, ఇంత డీబీటీ ఇచ్చిన మనం యుద్ధం చేస్తున్నామని చెప్పండి. ఈ యుద్ధం సామాజిక న్యాయానికి, సామాజిక అన్యాయానికి మధ్య జరగబోతుందని చెప్పండి. పేదల భవిష్యత్తుకు, పేదలు పేదలుగానే మిగిలిపోవాలని ఆరాటపడే పెత్తందార్లకు మధ్య యుద్ధం జరగబోతుందని చెప్పండి.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పార్టీ నేతలు

చంద్రబాబును నమ్మొద్దు..

- చంద్రబాబు ఆగడాలు, నిర్వాకాలనూ.. మనం చేస్తున్న మంచిని ప్రతి జిల్లాలోనూ, ప్రతి నియోజకవర్గంలోనూ, ప్రతి గడపకూ తీసుకుపోవాలి. తేడా గమనించమని అందరినీ అడగండి. చంద్రబాబును మాత్రం నమ్మొద్దమ్మా.. ఎన్నికలప్పుడు మాత్రం రంగురంగుల స్వప్నాలను చూపిస్తాడు. బ్యాంకుల్లో పెట్టే బంగారం ఇంటికి రావాలంటే.. బాబునే ముఖ్యమంత్రి కావాలంటాడు. రైతులకు రుణమాఫీ కావాలంటే బాబే ముఖ్యమంత్రి కావాలంటాడు.
- తాను ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాన్ని అమెరికా చేస్తాను అని కూడా అంటాడు. కానీ నమ్మొద్దు. ఒక్కసారి నమ్మాం.. అడుగులు వెనక్కి పడ్డాయి. జగన్‌ని నమ్మాం, మన ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాం. మన బిడ్డని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చొబెట్టుకున్నాం. మన బతుకులు మారాయా?లేదా? అన్నది ఒక్కసారి గుండెల మీద ఆలోచన చేయండి అని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పండి.

బ్యాక్‌బోన్‌లా బీసీలు..

సాక్షి, అమరావతి: పద్నాలుగేళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదని, ఓటు బ్యాంకుగానే చూశారని.. అదే గత మూడున్నరేళ్లలోనే సీఎం వైఎస్ జగన్ బీసీలకు ఎంతో చేశారని ఆ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు కొనియాడారు. 'జయహో బీసీ' కార్యక్రమం సందర్భంగా బుధవారం విజయవాడ మున్సిపల్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో అనేకమంది ప్రజాప్రతినిధులు ప్రసంగించారు.

తోకలు కత్తిరిస్తానన్నందుకే బాబు పిలక కత్తిరించారు



తోకలు కత్తిరిస్తాను అన్నందుకే చంద్రబాబు పిలక కత్తిరించి, గుండుకు సున్నం రాశారు. బీసీల దెబ్బ ఏంటో 2019లో చంద్రబాబుకు తెలిసింది. ఇప్పుడు బీసీలంతా జగన్ తమ వాడంటున్నారు.

– తమ్మినేని సీతారాం, అసెంబ్లీ స్పీకర్

వచ్చే ఎన్నికల్లో బీసీలంతా జగన్‌ను బలపరచాలి...



బీసీలకు పెద్దపీట వేసిన జగన్‌ను బీసీలంతా బలపరచాలి. మోసపు మాటలు చెప్పే చంద్రబాబు లాంటి వారిని నమ్మొద్దని ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి.

– బూడి ముత్యాలనాయుడు, మంత్రి

చంద్రబాబు వెంట తోక నేతలే మిగిలారు



చంద్రబాబు.. ఎప్పుడైనా 85వేల మంది బీసీ ప్రజాప్రతినిధులను చూపించాడా? బీసీలను అవమానకరంగా తోకలు కత్తిరిస్తా అని మాట్లాడిన చంద్రబాబు వెంట.. తోక నాయకులే మిగిలారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మంత్రి

ఒకే తాటిపైకి 139 బీసీ కులాలు



నా మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో 139 బీసీ కులాలను ఒక వేదికపై చూడాలనే ఆశ ఉండేది. గొప్ప సామాజిక విప్లవకారుడిగా సీఎం వైఎస్ జగన్ కారణంగా ఈ రోజు నా కల నిజమైంది.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మంత్రి

సీఎం జగన్ బీసీల బాంధవుడు



సీఎం వైఎస్ జగన్ బీసీ బాంధవుడైతే చంద్రబాబు బీసీలపట్ల రాబందు. బీసీలే టీడీపీకి సమాధి కడతారు. బీసీలకు ఏం చేశామో ధైర్యంగా మేం చెప్పుకోగలం. చంద్రబాబుకు ఆ ధైర్యం ఉందా?

– విడదల రజిని, మంత్రి

జగనన్న సీఎంగా ఉంటే ఏపీకి స్వర్ణయుగం



ఇది బీసీల పండుగ. 85వేల మంది బీసీల తలరాతలను మార్చిన బ్రహ్మ జగన్. మూడున్నరేళ్ల జగనన్న పాలనలో ఇది సాధ్యమైంది. 30 ఏళ్లపాటు జగనన్న సీఎంగా ఉంటే ఏపీ స్వర్ణయుగం కావడం తథ్యం.

– గుమ్మనూరి జయరాం, మంత్రి

బీసీలను చంద్రబాబు బలహీనం చేశారు..



వెనుకబడిన వర్గాల నుంచి 85 వేల మంది ప్రజా ప్రతినిధులను తయారుచేసిన నేత జగన్. చంద్రబాబు బీసీలను బలహీనులుగా మారిస్తే సీఎం జగన్ వారిని బలవంతులుగా సమాజానికి పరిచయం చేశారు.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

బీసీల కలలు సాకారం



చంద్రబాబు పాలనలో తోలుతీస్తా.. బీసీలు జడ్జీలుగా పనికిరారని అన్న రోజులు చూశాం. ఈ రోజు జగనన్న అక్కున చేర్చుకుని, 85 వేల మంది బీసీలను వివిధ హోదాల్లో రాజ్యాధికారం ఇచ్చి పక్కన కూర్చోబెట్టుకున్నారు. బీసీల కలలను సాకారం చేశారు.

– సీదిరి అప్పలరాజు, మంత్రి

చంద్రబాబుకు దిమ్మతిరిగేలా తీర్పు ఇవ్వాలి



దేశంలో బీసీల పల్లకి మోస్తున్న ఏకైక నేత సీఎం జగన్. ఇంతటి సాహసం దేశంలోని ఏ ముఖ్యమంత్రి చేయలేదు. బీసీలు జడ్జీలుగా పనికిరారన్న బాబును ఈసారి దిమ్మతిరిగే జడ్జిమెంట్‌తో ఓడించాలి.

– ఉషశ్రీ చరణ్, మంత్రి

మన నినాదం.. 'వై నాట్ 175'



తన డీఎన్‌ఏలో కుళ్లు, కుట్ర, కుతంత్రాన్ని పెట్టుకుని బీసీలంటే బర్రెలు, గొర్రెలు కాసుకునేవారని.. మత్స్యకారులను తోలుతీస్తా అని బాబు అవమానిస్తే.. సీఎం జగన్ వారినే రాజ్యసభ్యకు పంపించారు. 'వై నాట్ 175' నినాదంతో ముందుకుసాగుదాం.

– అనిల్‌కుమార్ యాదవ్, మాజీమంత్రి

బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టిన ఏకైక సీఎం జగన్



బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టిన ఏకైక సీఎం జగన్. చంద్రబాబు పేదల ఇళ్ల కోసం అర ఎకరం భూమి కూడా కొనలేదు. అదే జగన్ రూ.55 వేల కోట్లతో 31లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారు.

– కొలుసు పార్థసారథి, మాజీమంత్రి

దమ్మున్న సీఎం జగన్



ఏపీలో బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి తద్వారా చరిత్రను మలుపు తిప్పిన దమ్మున్న సీఎం జగన్. అందుకే తమిళనాడు, కర్ణాటక బీసీ నేతలు ఏపీలో కలిసిపోతామని అడుగుతున్నారు.

– ఆర్.కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ ఎంపీ,

బీసీలకు సముచిత స్థానం



చంద్రబాబు బీసీలను చిన్నచూపు చూస్తే.. జగన్ సముచిత స్థానం కల్పించారు. ప్రతి బీసీ కుటుంబానికి జగన్‌తో విడదీయరాని బంధం ఏర్పడడంతో టీడీపీ రగిలిపోతోంది. – మోపిదేవి వెంకట రమణారావు, ఎంపీ

బీసీలంతా టీడీపీకి దూరం



రాష్ట్రంలోని బీసీలంతా ఎప్పుడో టీడీపీకి దూరమయ్యారు. ఇప్పుడా పార్టీలో ఉన్నది చంద్రబాబు సామాజికవర్గంలోని కొద్దిమందే తప్ప ఎవరూలేరు.

– మార్గాని భరత్, రాజమహేంద్రవరం ఎంపీ

జగన్.. సామాజిక విప్లవ సారథి



ఒక సంస్కర్తలా సీఎం జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవం తెస్తున్నారు. గతంలో బీసీ డిక్లరేషన్‌లో ఏమైతే చెప్పామో, అందులో అన్నింటినీ అమలుచేసిన ఘనత సీఎంకే దక్కుతుంది. – బీద మస్తాన్‌రావు, ఎంపీ

బీసీల స్థితిగతులను మార్చేశారు



సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల పక్షపాతి. రాష్ట్రంలో బీసీల స్థితిగతులను ఆయన మార్చేశారు. దేశంలో సంచార జాతులను గుర్తించిన ఏకైక సీఎం కూడా ఈయనే. – జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ

మళ్లీ జగన్‌నే గెలిపించుకుందాం..



వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించుకుందాం. 2024లో టీడీపీని భూస్థాపితం చేసేది మన బీసీలే. మనకిన్ని పదవులిచ్చిన జగనన్నకు మనం రుణపడి ఉండాలి.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

కదనోత్సాహం

'మేమంతా కాలర్ ఎగరేసుకుని తిరిగేలా మన సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు.. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కానేకాదు.. బ్యాక్ బోన్ అని చేతల్లో నిరూపించారు. అందువల్లే మేమంతా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నాం.. అందువల్లే పార్టీ ఇచ్చిన ఒక్క పిలుపునకు ఇంత స్పందన.. సీఎం జగన్ మాట్లాడిన ప్రతి మాటకూ ప్రతిస్పందన.. ఈ జన సునామీని చూసిన చంద్రబాబుకు, దుష్టచతుష్టయానికి ఇక నిద్ర కరువే' అని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరోత్సాహంతో బల్లగుద్ది చెబుతున్నాయి.

జయహో బీసీ.. జయహో జగన్

- జగన్నినాదాలతో ప్రతిధ్వనించిన మహాసభ ప్రాంగణం
- బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన దాని కంటే సీఎం మిన్నగా చేస్తున్నారని హర్షాతిరేకాలు
- ఇందిరాగాంధీ స్టేడియం నలువైపులా రోడ్లపైనే నిలిచిపోయిన వేలాది మంది ప్రతినిధులు
- చంద్రబాబు ద్రోహాన్ని ఇంటింటికీ వెళ్లి చాటి చెబుతామన్న బీసీలు
- జయహో బీసీ మహాసభ గ్రాండ్ సక్సెస్.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం

జయహో బీసీ మహాసభ ప్రాంగణం నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి: వెనుకబడిన కులాలే వెన్నెముక అనే నినాదంతో నిర్వహిస్తున్న 'జయహో బీసీ మహాసభ'కు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపే ప్రభంజనమైంది.. దూరాభారాన్ని లెక్క చేయక ఒడిశా సరిహద్దులోని ఇచ్ఛాపురం, తమిళనాడు సరిహద్దులోని కుప్పం, కర్ణాటక సరిహద్దులోని హిందూపురం, తెలంగాణ సరిహద్దులోని మంత్రాలయం.. ఇలా రాష్ట్రం నలుమూలల నుంచి పోటాపోటీగా బీసీ ప్రజాప్రతినిధులు మంగళవారం రాత్రి నుంచే విజయవాడకు తరలివచ్చారు. బుధవారం ఉదయం 5 గంటలకే ఎముకలు కొరుకుతున్న చలిని ఖాతరు చేయకుండా.. మంచు తెరలను చీల్చుకుంటూ.. సూర్యోదయానికి ముందే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న మహాసభ ప్రాంగణానికి కడలి తరంగంలా పోటెత్తారు. ఉదయం 9 గంటలకు మహాసభ ప్రాంగణం జన సంద్రంగా మారింది. ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో బందరు రోడ్డుతోపాటు ఇందిరాగాంధీ స్టేడియంకు నలువైపులా వేలాది మంది ప్రతినిధులు రహదారులపైనే ఉండిపోయారు. దాంతో మహాసభ ప్రారంభం కావాల్సిన షెడ్యూల్ సమయం ఉదయం 10 గంటల కన్నా 45 నిముషాల ముందే.. 9.15 గంటలకే ఆరంభమైంది. జ్యోతి ప్రజ్వలన చేసి.. మహాత్మా జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి.. సభను ప్రారంభించారు.



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహాసభ ప్రాంగణానికి 12 గంటలకు చేరుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్.. 1.35 గంటల వరకు కొనసాగించారు. అప్పటి వరకు మహాసభ ప్రాంగణం నుంచి ఏ ఒక్కరూ కట్టు కదలలేదు. నేతలందరి ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. రహదారులపై గంటల తరబడి నిలబడిన వారూ అడుగు కదపకుండా ఎల్‌ఈడీ తెరలపై మహాసభను వీక్షిస్తూ ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు.

తలెత్తుకు తిరిగేలా సమున్నత గౌరవం

ఏలూరులో 2019 ఫిబ్రవరి 17న బీసీ గర్జనలో బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన దాని కంటే మిన్నగా సీఎం వైఎస్ జగన్ చేస్తుండటం.. కాలరెగరేసుకుని సగర్వంగా తలెత్తుకునే రీతిలో సమున్నత గౌరవం ఇస్తూ పరిపాలిస్తుండటం వల్లే బీసీ ప్రజాప్రతినిధులు, ప్రతినిధులు కదనోత్సాహంతో మహాసభకు కదలి వచ్చారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరిన నాయీ బ్రాహ్మణులను తాత్కాలిక సచివాలయం సాక్షిగా తోకలు కత్తిరిస్తా అంటూ చంద్రబాబు బెదిరించడం.. హామీలను నిలబెట్టుకోవాలని అడిగిన మత్స్యకారులను అంతుచూస్తానని భయపెట్టడం.. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని దళితుల పుట్టుకనే అవహేళన చేయడాన్ని సీఎం వైఎస్ జగన్ గుర్తు చేసినపుడు ప్రతినిధుల నుంచి విశేష స్పందన లభించింది. ఐదేళ్లలో చంద్రబాబు ఒక్క బీసీని రాజ్యసభకు పంపకుండా మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే.. మూడున్నరేళ్లలో రాష్ట్ర కోటాలో 8 స్థానాలు ఖాళీ అయితే అందులో నలుగురు బీసీలను రాజ్యసభకు సీఎం వైఎస్ జగన్ పంపి తమకు సమున్నత గౌరవం ఇచ్చారని అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన వీరన్న 'సాక్షి'కి చెప్పారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, మహిళా, విద్యా సాధికారత సాధించేలా చేస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తాము నడుస్తామని స్పష్టం చేశారు.

శ్రేణుల్లో మరింత రగిలిన సమరోత్సాహం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత జూలై 8–9న నిర్వహించిన ప్లీనరీ గ్రాండ్ సక్సెస్ కావడంతో నూతనోత్సాహంతో శ్రేణులు కదం తొక్కుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ చేసిన దిశానిర్దేశం మేరకు గడప గడపకూ వెళ్లి.. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించి చెబుతూ ఆశీస్సులు తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో నిర్వహించిన జయహో బీసీ మహాసభకూ బీసీ ప్రతినిధులు పోటెత్తారు. ఏడాదికి బీసీ సబ్ ప్లాన్ కింద రూ.పది వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి దగా చేస్తే.. సీఎం వైఎస్ జగన్ ఏడాదికి రూ.15 వేల కోట్లు చొప్పున రూ.75 వేల కోట్లు ఇస్తానని మాట ఇచ్చి మూడున్నరేళ్లలోనే అంతకంటే అధికంగా రూ.1.63 లక్షల కోట్ల ప్రయోజనాన్ని తమకు చేకూర్చారని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తిరుమాను ధనుంజయ్ చెప్పారు. చంద్రబాబు చేసిన మోసాన్ని.. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న న్యాయాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించి.. 175కు 175 శాసన సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. జయహో బీసీ మహాసభ అంచనాలకు మించి గ్రాండ్ సక్సెస్ కావడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహాన్ని మరింతగా రగిల్చింది.



లక్ష మందితో సభ.. ఎక్కడా స్తంభించని ట్రాఫిక్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ మహాసభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి లక్ష మందికి పైగా ప్రతినిధులు హాజరైనప్పటికీ నగరంలో ఎక్కడా ట్రాఫిక్ స్తంభించడం అంటూ జరగలేదు. పోలీసు, ఇతర శాఖల పక్కా ప్రణాళిక, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు.. ప్రజల సహకారంతో ఎక్కడా ఇబ్బంది ఎదురు కాలేదు. వందల సంఖ్యలో వాహనాలకు పార్కింగ్ స్థలాలు వేర్వేరుగా కేటాయించడం.. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులో ఒక వైపున, బీఆర్‌టీఎస్ రోడ్డునకు ఇరువైపులా, ఏఎస్.రామారావు రోడ్డు, ఐదో నెంబరు బస్సు రూట్‌లలో వాహనాలను అనుమతించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తలేదు.

ఆహా ఏమి రుచి.. తిన్నారు మైమరచి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): 'జయహో బీసీ మహాసభ'లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారి కోసం నిర్వాహకులు పసందైన వంటకాలతో ఏర్పాటు చేసిన కమ్మని భోజనాలు అదరగొట్టాయి. చికెన్, మటన్, చేపలు, రొయ్యలు, కోడిగుడ్లతో పాటు వివిధ రకాల శాఖాహార వంటకాలు, స్వీట్లతో ఆహూతులు సంతృప్తిగా పసందైన భోజనం చేశారు. స్టేడియంలో ఇరువైపులా మూడు భారీ భోజనశాలలతో పాటు కూతవేటు దూరంలోని బిషప్ అజరయ్య హైస్కూల్ ప్రాంగణంలోనూ భారీ



భోజనశాలలను ఏర్పాటు చేయడం, పదుల సంఖ్యలో కౌంటర్లు పెట్టడంతో సభకు వచ్చిన వారంతా ప్రశాంతంగా భోజనాలు ఆరగించారు.

వడ్డించిన వంటకాలు: ఇడ్లీ, గారె, మసాలా ఉప్మా, పొంగలి, సాంబారు, కొబ్బరి చట్నీ, టమోటా చట్నీ, రవ్వ కేసరి, కాఫీ, టీ భోజనం– నాన్‌వెజ్: మటన్ బిర్యానీ, చికెన్ ఫ్రై, చికెన్ కర్రీ, ఫిష్ ఫ్రై, రొయ్యలు–ఎగ్ కర్రీ, చేపల పులుసు, కట్టా, ఉల్లి చట్నీ, వైట్ రైస్, పెరుగు, చక్కెర పొంగలితో పాటు వెజ్ బిర్యానీ, పనసకాయ ధమ్, పన్నీర్ గ్రీన్‌పీస్ కర్రీ, డబుల్ బీన్స్ జీడిపప్పు కర్రీ, ఉల్లి చట్నీ, టమోటా పప్పు, గోంగూర పచ్చడి, వైట్‌రైస్, సాంబారు, పెరుగుతో పాటు అందరికీ తాపేశ్వరం కాజా, మంచినీటి బాటిళ్లను అందించారు.

సీఎం భరోసా.. దొరికింది ఆసరా

- కాన్వాయ్‌లో వెళ్తూ నిస్సహాయ స్థితిలో యువకుడిని గమనించిన సీఎం వైఎస్ జగన్
- వెంటనే సెక్యూరిటీకి చెప్పి అతడి గురించి ఆరా తీయాలని ఆదేశం
- తగిన వైద్యం, సహాయం అందించాలని కలెక్టర్‌కు ఆదేశాలు
- తక్షణమే స్పందించిన కలెక్టర్ ఢిల్లీ రావు
- యువకుడికి ఆస్పత్రిలో చికిత్స.. తక్షణ సాయం కింద రూ.లక్ష చెక్కు అందజేత

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మంచి మనసు చాటుకున్నారు. విజయవాడలో బుధవారం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సభ ముగించుకొని సీఎం తన కాన్వాయ్‌లో వెళ్తుండగా.. రోడ్డుపైన నిస్సహాయ స్థితిలో వీల్‌చైర్‌లో కూర్చున్న ఒక యువకుడిని గమనించారు. వెంటనే అతడి వైపు సీఎం తన చేయి చూపుతూ తాను ఉన్నాననే భరోసాను కల్పించారు. వెంటనే అతడి సమస్య ఏమిటో ఆరా తీయాలని తన



వీల్‌చైర్‌లో బాధిత యువకుడు. లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్

సెక్యూరిటీ సిబ్బందిని సీఎం ఆదేశించారు. అలాగే అతడి వివరాలను తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. అంతటితో ఆగకుండా గన్నవరం విమానాశ్రయానికి వెళ్తూ కూడా ఆ యువకుడి విషయం ఎంతవరకు వచ్చిందని సీఎం జగన్ మరోసారి ఆరా తీశారు. యువకుడికి అవసరమైన సాయం అందేలా.. వైద్యానికి అవసరమైన ఖర్చును అంచనా వేసి తనకు వివరాలు పంపాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో తక్షణమే స్పందించిన విజయవాడ కలెక్టర్ ఢిల్లీ రావు స్వయంగా తన వాహనాన్ని యువకుడి ఉన్న చోటుకు పంపి అతడిని తన కార్యాలయానికి రప్పించారు. అతడి పరిస్థితిని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. వెంటనే డీఎంహెచ్‌ఓను పిలిపించి చికిత్స నిమిత్తం యువకుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అంతేకాకుండా తక్షణ సహాయం కింద రూ.లక్ష చెక్కును సైతం కలెక్టర్ ఢిల్లీ రావు అందజేశారు.

సీఎం అండ.. తీరింది బెంగ..

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన ఏసుబాబు, శివగంగల దంపతుల కుమారుడు లక్ష్మణ్ (20)కు రెండేళ్ల క్రితం ఓ ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. అప్పట్లో 71 రోజులు ఆస్పత్రిలోనే వైద్యం పొందినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. లక్ష్మణ్ కాలు చచ్చుపడిపోయింది. కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు తమకు శక్తికి మించి వైద్యం చేయించారు. అయితే ప్రతి నెలా మందులకు రూ.10 వేలు వెచ్చించడం భారంగా మారింది. మరోవైపు అతడిని చూసుకునేందుకు పనులకు వెళ్లకుండా తల్లిదండ్రుల్లో ఒకరు ఇంటి వద్దే ఉండాల్సి వస్తోంది. దీంతో మిగిలిన ఇద్దరు కుమారులు కుటుంబ పోషణ కోసం చదువు మానేసి పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌ను కలిస్తే తమకు న్యాయం జరుగుతుందని బుధవారం బాధితుడు లక్ష్మణ్ తన తల్లిదండ్రులతో విజయవాడ వచ్చాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అండతో అతడి సమస్య పరిష్కారమైంది.

కన్నబిడ్డలను తగలబెట్టిన తల్లి

- ఇద్దరు ఆడపిల్లలను చంపి తానూ ఆత్మహత్య చేసుకోవాలని భావించిన యువతి
- ఒక పాప మృతి... మరో బాలిక పరిస్థితి విషమం
- పలమనేరు సమీపంలోని ముళబాగిలులో ఘటన

పలమనేరు(చిత్తూరు)/శ్రీనివాసపురం: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తతో గొడవల కారణంగా ఓ యువతి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. ముందుగా తన ఇద్దరు పిల్లలను చంపి, ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు తన ఇద్దరు కుమార్తెలపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఒక పాప మృతిచెందగా, మరొక బాలిక తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతోంది. ఆ యువతి మాత్రం పిల్లల వద్దే కూర్చుండిపోయింది. ఈ ఘటన పలమనేరుకు 35 కిలోమీటర్ల దూరంలోని కర్ణాటక రాష్ట్రం ముళబాగిలు అంజనాద్రి కొండపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూసాని కురప్పల్లికి చెందిన జ్యోతి (25), అదే గ్రామానికి చెందిన తిరుమలేష్ ప్రేమించుకుని తొమ్మిదేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు అక్షయ (7), ఉదయశ్రీ (5) ఉన్నారు. కొద్దికాలంగా జ్యోతి, తిరుమలేష్ మధ్య గొడవలు



గాయపడిన బిడ్డతో తల్లి


జరుగుతున్నాయి. దీంతో జ్యోతి చనిపోవాలని నిర్ణయించుకుంది. ఆమె మంగళవారం మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఓ బ్యాగుతో స్వగ్రామం నుంచి ముళబాగిలుకు ఆటోలో చేరుకుంది. అక్కడ పెట్రోల్ బంకులో ఓ క్యానులో పది లీటర్ల పెట్రోలు కొనుక్కుంది. అనంతరం పిల్లలను తీసుకుని సమీపంలోని అంజనాద్రి కొండపైకి చేరుకుంది. కొండపైన రాత్రికి పిల్లలు నిద్రపోయాక వారిపై పెట్రోలు పోసి నిప్పంటించింది. మంటల్లో కాలిపోయి చిన్నారి అక్షయ అక్కడికక్కడే చనిపోయింది. ఉదయశ్రీ కూడా తీవ్రగాయాలతో చలనం లేకుండా పడి ఉంది. అంజనాద్రి కొండకు సమీపాన తమిళులు నివాసం ఉండే పల్లిగారపాళ్య యువకులు బుధవారం ఉదయం అటువైపు వెళ్లగా, కాలిపోయిన పిల్లల పక్కన మహిళ కూర్చుని ఉండటం కనిపించింది. వారు ఆమె నుంచి వివరాలు తెలుసుకుంటుండగా ఉదయశ్రీ స్వల్పంగా కదిలింది. దీంతో తమిళ యువకులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముళబాగిలు ఎస్‌ఐ వచ్చి అక్షయ మృతిచెందినట్లు గుర్తించి, చావుబతుకుల మధ్య ఉన్న ఉదయశ్రీని తన చేతులపై మోసుకుంటూ కొండ కిందకు తీసుకువచ్చి అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించారు. స్థానిక ఆస్పత్రిలో ఉదయశ్రీకి ప్రథమ చికిత్స చేసిన అనంతరం బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జ్యోతిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నా బిడ్డలకు దిక్కెవరనే కాల్చేశా...

'చిన్నారులు ఏం పాపం చేశారని చంపేశావు' అని జ్యోతిని స్థానికులు నిలదీయగా... 'నేను ఆత్మహత్య చేసుకుంటే నా బిడ్డలకు దిక్కెవరు. ముందు వాళ్లను చంపి, ఆ తర్వాత నేను చావాలనుకున్నాను..' అని జ్యోతి బదులిచ్చింది. 'అయితే నువ్వెందుకు చావలేదు..' అని స్థానికులు ప్రశ్నించడంతో దానికి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయింది.

బీసీలు దూరమవడంతో చంద్రబాబుకు ఫ్రస్టేషన్

రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: బీసీలు దూరమవడంతో చంద్రబాబులో ఫ్రస్టేషన్ పెరిగిపోతున్నదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. బీసీల్లో వైఎస్సార్ సీపీకి వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నాలు, విధ్వంసాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేశ్‌కు ఇవే చివరి ఎన్నికలు అవడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉండి చంద్రబాబు బీసీలకు ఏం చేశారని ప్రశ్నించారు. సీఎం జగన్ కేబినెట్‌లో 11 మంది బీసీ మంత్రులే ఉన్నారన్నారు. చంద్రబాబు ఎప్పుడూ సొంత కులానికే ప్రయోజనం చేకూర్చుకున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రలో టీడీపీ నాయకులు చేసిన అక్రమాలను ఆధారాలతో సహా నిరూపిస్తామన్నారు. ప్రభుత్వ భూములను టీడీపీ నేతలు ఆక్రమించుకుంటే తానే స్వయంగా విడిపించి ప్రభుత్వానికి అప్పగించామని వివరించారు. చంద్రబాబు డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు.

టీచర్ల సూచనలే విద్యార్థులకు దిక్సూచి

సాక్షి, అమరావతి: టీచర్లు ఇచ్చే సూచనలు విద్యార్థుల్లో ఎంత మార్పు తెస్తాయో అనడానికిదో మంచి ఉదాహరణ. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మంగళవారం మంగళగిరిలోని ఆత్మకూరు జెడ్పీ హైస్కూలును సందర్శించారు. అక్కడి ఏడో తరగతి బి సెక్షన్‌ను సందర్శించారు. తరగతి గదిలో 15 మంది విద్యార్థులుండగా ఒక్కరు కూడా బూట్లు, సాక్సులు ధరించి రాలేదు. దీంతో 'జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు బూట్లు సాక్సులు సహా స్టూడెంట్ కిట్లను అందించారు. అయినా ఎవరూ బూట్లు వేసుకు రాలేదు. వాటిని ధరించి వచ్చేలా మంచి అలవాట్లను నేర్పించాల్సిన బాధ్యత టీచర్లకు ఉండాలి. ఏ కొద్దిమందో బూట్లు వేసుకుని రాలేదంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఒక్కరూ వేసుకోలేదంటే ఏమనాలి? ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో పిల్లలకు ఈ వస్తువులను ఇస్తున్నా వాటిని సక్రమంగా వినియోగించేలా క్షేత్రస్థాయిలో డీఈవోలు, టీచర్లు సూచనలు ఇవ్వడం లేదు. ఇకపై అయినా రాష్ట్రంలోని టీచర్లంతా పిల్లలకు ఈ దిశగా మంచి సూచనలు అందించేలా డీఈవోలు చర్యలు చేపట్టాలి. జగనన్న విద్యాకానుక కింద ప్రభుత్వం రూ.వేయి కోట్లు ఖర్చు చేస్తున్నది.ఇంత అత్యధిక పెట్టుబడి ప్రపంచంలో ఎక్కడా చేయడం లేదు.' అని ప్రవీణ్ ప్రకాశ్ సోషల్ మీడియా గ్రూపు ద్వారా సందేశాన్ని పంపారు.కాగా, బుధవారం మళ్లీ అదే స్కూలును ప్రవీణ్ ప్రకాశ్ సందర్శించి అక్కడి మార్పును గమనించి ఆశ్చర్యపోయారు. ఆ మేరకు స్కూలు పిల్లలతో కూడిన ఫొటోను షేర్ చేస్తూ సోషల్ మీడియా గ్రూపు ద్వారా తన అభిప్రాయాన్ని ఆయన పంచుకున్నారు. 'టీచర్ల సూచనల వల్ల విద్యార్థుల్లో ఎంత మార్పు వచ్చిందో చూడండి. నిన్న నేను ఇదే స్కూలును సందర్శించినప్పుడు ఒక్క విద్యార్థి బూట్లు వేసుకోలేదు. టీచర్లు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సూచన ఇవ్వడంతో ఈరోజు 100 శాతం మంది పిల్లలు బూట్లు ధరించి, పరిశుభ్రమైన యూనిఫాం ధరించి వచ్చారు. పిల్లలంతా డ్రెస్‌కోడ్‌ను అనుసరించారు. టీచర్ ఇచ్చిన సూచనలతో విద్యార్థుల్లో సున్నా నుంచి 100 శాతం మార్పు వచ్చిందనడానికిదే సాక్ష్యం. ఇదే పద్ధతిని విద్యార్థి 21 రోజులు కొనసాగిస్తే అది మంచి అలవాటుగా మారుతుంది. 90 రోజుల తరువాత ఇలాంటి మంచి అలవాట్లు ఆ విద్యార్థి లైఫ్‌స్టయిల్‌ను మార్చి జీవితాన్ని బంగారుమయం చేస్తుంది. ఆ తరువాత విద్యార్థికి ఎవరి మార్గదర్శనం అక్కర్లేకుండానే ముందుకు సాగగలుగుతాడు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబయి
ఫోన్: 022-22820427

రెగ్యులర్ / కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగం కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

క్ర. సం	పోస్ట్	కాంట్రాక్చువల్ /రెగ్యులర్ (ఈక్వివాలెంట్ గ్రేడ్/ స్కేల్)	ఖాళీ	ప్రకటన నం.
1	సర్కిల్ అడ్వైజర్ (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్)	కాంట్రాక్టు	01	CRPD/SCO/ 2022-23/26
2	మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్	రెగ్యులర్ (MMGS-III)	55	CRPD/SCO/ 2022-23/25
3	మేనేజర్ (ప్రొడక్ట్- డిజిటల్ చెల్లింపులు)	రెగ్యులర్ (MMGS-III)	05	CRPD/SCO/ 2022-23/23
4	మేనేజర్ (ప్రొడక్ట్- డిజిటల్ చెల్లింపులు/ కార్డులు)	రెగ్యులర్ (MMGS-III)	02	
5	మేనేజర్ (ప్రొడక్ట్ - డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు)	రెగ్యులర్ (MMGS-III)	02	

అర్హతలు ప్రమాణాలు (వయసు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://bank.sbi/web/careers లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 22.11.2022 నుండి 12.12.2022 వరకు

ఏదైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – "CONTACT US"—> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ లో లభించును.

స్థలం: ముంబయి
తేదీ: 22.11.2022
మహానిర్వహణాధికారి (ఆర్పీ & పీఎం)



“మానవజాతి ఎక్కువ భౌతిక వస్తువుల అవసరం అనే స్పృహ నుంచి బయటపడే సమయం వస్తుంది. సాధారణ జీవితంలో మరింత భద్రత, శాంతిని పొందుతారు.

– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, డిసెంబర్, 8

ఆప్ విజయకేతనం

గుజరాత్ తీర్పు వెల్లడికావడానికి 24 గంటలముందు దేశంలోని అతి పెద్ద కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. బలమైన విపక్షమన్న విశ్వాసం ఏర్పడితే ఆదరించటానికి సిద్ధంగా ఉన్నామని ఢిల్లీ ఓటర్లు సంకేతం పంపారు. ఉత్తర, దక్షిణ, తూర్పు ఢిల్లీ కార్పొరేషన్లు మూడూ విలీనమై 70 లక్షలమంది ఓటర్లు, 250 వార్డులతో మళ్లీ విస్తృతమైన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)గా ఆవిర్భవించాక జరిగిన తొలి ఎన్నికల్లో ఆప్ 134 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 104 దక్కించుకుంది. దివంగత నేత షీలా దీక్షిత్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో అత్యంత శక్తిమంతమైన పార్టీగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు కేవలం తొమ్మిది స్థానాలకు పరిమితమై దయనీయమైన స్థితిలో పడింది. ఢిల్లీ స్థానిక సంస్థల్లో తొలిసారి 2007లో అధికారం చేజిక్కించుకున్న బీజేపీని ఎలాగైనా బలహీనపరచాలని కాంగ్రెస్ పదిహేనేళ్లుగా ఆపసోపాలు పడుతుంటే ఆప్ చాలా స్వల్పకాలంలోనే ఆ పనిని సునాయాసంగా పూర్తిచేసి.... లక్ష్యం ఉంటే సరిపోదని, అందుకు తగ్గ ఆచరణ, చిత్తశుద్ధి అవసరమని తేటతెల్లం చేసింది. 2007లో ఎంసీడీ చేజారటం ఖాయమని గ్రహించిన అప్పటి సీఎం షీలా దీక్షిత్ గండం గట్టెక్కటానికి దాన్ని మూడు కార్పొరేషన్లుగా విడగొట్టారు. అయినా ఫలితం దక్కలేదు. దేశంలో ఇతర ప్రాంతాల మాటేమోగానీ ఢిల్లీలో ఇప్పటికీ ద్విధ్రువ రాజకీయాలే నడుస్తున్నాయని, కాంగ్రెస్ స్థానాన్ని ఆప్ భర్తీ చేసిందని ఈ ఎన్నికలు నిరూపించాయి.

ఢిల్లీలో ఎన్నికల ఫలితాల గురించి జోస్యం చెప్పటానికి పెద్దగా నైపుణ్యం అవసరం లేదు. అక్కడి జనం ఏ విషయంపైనైనా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడతారు. ఎక్కడ ఎవరి అవసరం ఉంటుందో, ఎవరిని గెలిపించాలో వారికి తెలిసినంతగా మరో ప్రాంతంవారికి తెలియదు. మూడు దఫాలుగా మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీని అవిచ్ఛిన్నంగా గెలిపిస్తూ వస్తున్న ఓటర్లు అనంతర కాలంలో అసెంబ్లీ విషయానికొచ్చేసరికి ఆప్‌నే ఎంచుకున్నారు. అలాగని లోక్‌సభ ఎన్నికలొచ్చేసరికి బీజేపీవైపే మొగ్గుతున్నారు. అందుకే ఈ ఎన్నికల తీరు చూసి ఎవరేం చెప్పినా తొందరపాటే అవుతుంది. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఓటర్లు విలక్షణమైనవారైనా ఢిల్లీ రాజకీయ గణం, అధికార యంత్రాంగం మాత్రం అన్నిచోట్లా ఉన్నట్టే ఉన్నారు. దాన్నొక సుందర నగరంగా తీర్చిదిద్దుతామని, సకల సౌకర్యాలతో స్వర్గంగా మారుస్తామని చెప్పిన నేతలే తప్ప చేసినవారు లేరు. దేశ రాజధానిగా ఉన్నందుకైనా అక్కడ పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎవరికీ అనిపించలేదు. ఆప్ వచ్చాక బస్తీ క్లినిక్‌లు కొంతమేరకు ఉపయోగపడిన మాట వాస్తవమే అయినా ఇంకా తగినంతగా వైద్య సౌకర్యాలు మెరుగుపడలేదనే చెప్పాలి. ఎంసీడీ వార్షిక బడ్జెట్ రూ. 15,200 కోట్లు. అందులో దాదాపు లక్షన్నరమంది సిబ్బంది ఉన్నారు. 2 కోట్ల మంది నగర జనాభాకు కావలసిన జనన, మరణాల ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ మొదలుకొని వాణిజ్య లైసెన్సుల జారీ, చెత్త తొలగింపు, ప్రాథమిక విద్య పర్యవేక్షణ, ఆరోగ్య సర్వీసులు, కాలనీ రోడ్ల నిర్వహణ తదితరాలన్నీ చూసుకునే బాధ్యత ఎంసీడీదే. ఇన్నాళ్లూ కార్పొరేషన్లు బీజేపీ చేతుల్లోనూ, ప్రభుత్వం ఆప్ అధీనంలోనూ, అత్యధిక సర్వీసులన్నీ కేంద్రం చేతుల్లోనూ ఉండటంతో తరచు సమస్యలు తలెత్తేవి. కార్పొరేషన్ల వైఫల్యాల గురించి ఆప్ సర్కారు ఏకరువు పెట్టడం, సమస్య ప్రభుత్వం చేతిలోనే ఉన్నదని ఆ కార్పొరేషన్ల చైర్మన్‌లు ఎదురుదాడికి దిగటం రివాజుగా సాగేది. ముఖ్యంగా ఘాజీపూర్, భలాస్వా, జహంగీర్‌పూర్, ఓఖ్లాలలో కొండల్లా పెరిగిన డంపింగ్ యార్డులు బీజేపీ వైఫల్యాన్ని పట్టిచూపాయి. అన్ని రాజకీయ పక్షాల మాదిరే ఆప్ కూడా మున్సిపల్ పాలన అత్యద్భుతంగా ఉంటుందని ఊరించింది. అదెంతవరకూ నిలబెట్టుకుంటుందో చూడాలి. అందరి మాదిరే ఆప్ కూడా అనిపించేలా వ్యవహరిస్తే ఆ పార్టీని జనం క్షమించరు. ఈ ఎన్నికల్లో నెగ్గి ఎప్పటిలానే పాగా వేయటానికి బీజేపీ చేయనిదంటూ లేదు. అవినీతి అభియోగాల కేసులో అరెస్టయిన ఆప్ నేత, మంత్రి సత్యేందర్ జైన్ తిహార్ జైల్లో రాజవైభోగాలు అందుకుంటున్నట్టు నిరూపించే సీసీ టీవీ ఫుటేజ్‌లను చానెళ్లలో ఒకటికి పదిసార్లు ప్రసారమయ్యేలా చూసి లబ్ధి పొందుదామని బీజేపీ ప్రయత్నించింది. కానీ జైన్ అసెంబ్లీ స్థానం పరిధిలోని మూడు మున్సిపల్ స్థానాలూ ఆప్‌కే దక్కాయి. ఓటర్లు జైన్‌పై అభియోగాలను పట్టించుకోలేదని ఫలితాలు నిరూపించాయి.

ఈ నెల్లాళ్ల ప్రచారంలో 15 మంది కేంద్ర మంత్రులు, ఆరుగురు ముఖ్యమంత్రులు ఢిల్లీ వీధుల్లో కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగారు. మూడు కార్పొరేషన్ల వల్ల ఆచరణలో పెద్దగా లాభం లేకపోగా అందువల్ల అనవసర వ్యయం పెరిగిందని, వాటి పనితీరు మందగించిందని చెప్పి మూడింటినీ విలీనం చేయాలని కేంద్రం గత మే నెల 22న వాటిని రద్దు చేసింది. ఈ ప్రక్రియలో 272 వార్డులు కాస్తా 250కి తగ్గిపోయాయి. ఫలితాల సరళి చూస్తే పూర్వపు తూర్పు ఢిల్లీ కార్పొరేషన్ పరిధిలోని 77 స్థానాల్లో బీజేపీకి 42 వచ్చాయి. విలీనం లేకుంటే ఆ ఒక్కటయినా బీజేపీ ఖాతాలో పడి పరువు దక్కేది. ఫిరాయింపుల చట్టం ఉండీ లేనట్టే మిగిలిపోయిందని వివిధ రాష్ట్రాల్లో గోడ దూకుళ్లు రుజువు చేశాయి. స్థానిక సంస్థల్లో కనీసం ఆ అడ్డు కూడా లేదు. ఢిల్లీలో బీజేపీ ఆ పని చేయదని ఆశించాలి. అధికారాన్ని ఖరీదు చేయటం ద్వారా ఎవరూ జనం మెప్పు పొందలేరు. ఈ ఫలితాలతో ఆప్ బాధ్యత మరిన్ని రెట్లు పెరిగింది. దాన్ని నిలబెట్టుకోవటమా లేదా అనేది ఆ పార్టీ చేతుల్లో ఉంది.

కళకూ ప్రచారానికీ మధ్య...

విశ్లేషణ



కేసీ సింగ్

భావాలను వ్యాప్తి చేయడంలో, ప్రజలను చైతన్య పర్చడంలో రచనల స్థానాన్ని సినిమా దురాక్రమించిందని రాశారు జాకబ్ డ్రకెర్. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చెందించడానికి లేదా చారిత్రక దృక్పథాన్ని వక్రమార్గం పట్టించడానికి కూడా సినిమా సాధనంగా మారవచ్చు. ఈ నేపథ్యంలో చూస్తే 'ద కశ్మీర్ ఫైల్స్' మీద ఇజ్రాయిల్ దర్శకుడు నదావ్ లపీడ్ వ్యాఖ్యలు మరింత బాగా అర్థమవుతాయి. అంతర్జాతీయ ఘటనలపై తమ దృక్పథాన్ని వివరిస్తూ అన్ని దేశాలూ సినిమాలు తీస్తుంటాయి. అయితే ప్రచారం నుంచి కళను వేరు చేసే; రెచ్చగొట్టే మెజారిటీ వాదం నుంచి ఉదారవాద ప్రజాస్వామ్య విలువలను వేరు చేసే విభజన రేఖ తప్పకుండా ఉండాలి. 'ద కశ్మీర్ ఫైల్స్' ఆ రేఖను ఉల్లంఘించింది.

గోవాలో ఇటీవల ముగిసిన 53వ భారత అంతర్జాతీయ చిత్రోత్సవంలో జ్యూరీ అధ్యక్షుడిగా వ్యవహరించిన ఇజ్రాయిల్ దర్శకుడు నదావ్ లపీడ్ 'ద కశ్మీర్ ఫైల్స్'పై చేసిన అవమానకర వ్యాఖ్యలు ఇప్పటికీ దేశంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. వివాదం రేగిన తర్వాత ఆయన క్షమాపణను 'ఎన్డీటీవీ' పతాక వార్తగా ప్రసారం చేయగా, మరోవైపున 'ద వైర్' కోసం నదావ్ లపీడ్ ఇంటర్వ్యూ చేసిన పాత్రికేయుడు కరణ్ థాపర్ ఆ వార్తను ఖండించారు. తన వ్యాఖ్యను వెనక్కు తీసుకోవడానికి లేదా విరమించుకోవడానికి తిరస్కరించిన ఇజ్రాయిల్ దర్శకుడు ఆ ఇంటర్వ్యూలో తానెందుకలా అనవలసి వచ్చిందో స్పష్టం చేశారు. ''అది నా కర్తవ్యం, నా విధి కూడా. వ్యర్థ ప్రసంగం చేయకుండా నిజాయితీగా ఉండటానికి నన్ను జ్యూరీకి ఆహ్వానించారు.'' అయితే భారత్‌లోని ఇజ్రాయిల్ రాయబారి నష్టనివారణకు ప్రయత్నించారు. కశ్మీర్ పండిట్లు కశ్మీర్‌లోని తమ నివాసాలను బలవంతంగా వదిలివేయవలసి వచ్చిన అంశంపై దృక్పథానికి సంబంధించినంత వరకూ, ఈ సినిమా బీజేపీకి ఒక పాక్షిక అధికారిక స్వరంగా ఉపయోగపడిందని ఇజ్రాయిల్ రాయబారి గుర్తించారు కనుకే తమ దేశస్థుడైన దర్శకుడి వ్యాఖ్యలను ఖండించారు.

కశ్మీర్ ఫైల్స్ సినిమాను చిత్రోత్సవంలో వీక్షించిన జ్యూరీ సభ్యులను అది ఇబ్బంది పెట్టిందనీ, షాక్‌కు గురిచేసిందనీ నదావ్ లపీడ్ పేర్కొన్నారు. ఈ చిత్రం అసభ్యకరంగా ఉందనీ, వట్టి ప్రచార సినిమాలా ఉందనీ అన్నారు. కశ్మీర్ ఫైల్స్ చిత్ర రచయిత, దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి ఒక సున్నితమైన విషయాన్ని మలిచిన విధానంపై లపీడ్ చేసిన వ్యాఖ్యలు అసలు జరిగిన విషాదం వెనుక వాస్తవాలకు సంబంధించి గందరగోళాన్ని రేకెత్తించాయి. రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానంలో ప్రధాని వీపీ సింగ్ నేతృత్వంలోని జనతాదళ్ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిన కాలంలో – 1990ల మొదట్లో గవర్నర్ జగ్‌మోహన్ జమ్మూ కశ్మీర్ పాలనలో భాగమయ్యారు. అది కశ్మీర్ నుంచి ఉన్నట్టుండి హిందూ వలసలు ప్రారంభమైన కాలం. శతాబ్దాలుగా తమతో కలిసి మెలిసి జీవిస్తున్న ఇరుగు పొరుగు హిందువులతో సంబంధాలను తెంచుకోవాలని మిలిటెంట్లు ముస్లిం మెజారిటీని ఒత్తిడికి గురిచేశారు. కశ్మీర్ నుంచి వలసల వెల్లువ మొదలైన ఇతివృత్తంతో తీసిన కశ్మీర్ ఫైల్స్ సినిమాకు బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు పన్ను రాయితీ కల్పించాయి. ఆ రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు థియేటర్లలో సినిమా విడుదల కాకముందే ప్రశంసలు గుప్పించడం, ప్రజలను విభజించే అభిప్రాయాలు వెల్లడించడం మొదలుపెట్టారు.

సుప్రసిద్ధ 'టైమ్ మ్యాగజైన్' ఒక విశేష కథనాన్ని ప్రచురిస్తూ– 'ద కశ్మీర్ ఫైల్స్: బాలీవుడ్ కొత్త సినిమా భారత్‌ని మరింతగా మత దురభిమానంలోకి ఎలా నెడుతోంది?' అనే శీర్షిక పెట్టింది.



'న్యూయార్క్ టైమ్స్' సైతం 'కశ్మీర్ హిందువుల బహిష్కరణపై వచ్చిన సినిమా భారత్‌ను వేరుచేస్తూ ప్రజాదరణ పొందుతోందా?' అనే శీర్షికతో తన ఆలోచనలను ప్రతిధ్వనించింది. ఇక సింగపూర్ అయితే రెచ్చగొట్టేలా ముస్లింల గురించి ఏకపక్షంగా చిత్రించిందని పేర్కొంటూ సినిమా విడుదలపై నిషేధం విధించింది. వివిధ మతాల మధ్య ఇది శత్రుత్వాన్ని ప్రేరేపించేలా ఉందని పేర్కొంది. ఇదే ప్రాతిపదికన భారతదేశంలో అనేక చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ సినిమా ప్రకటించే భావాలు స్వల్ప స్థాయిలో అయినా సరే దాడులకు ప్రేరేపించే అవకాశమిస్తున్నప్పుడు, బీజేపీ, దాని భక్తులు దీన్ని ఎందుకు పనిగట్టుకుని ప్రోత్సహించినట్లు? కాబట్టి ఇప్పుడు ఈ సినిమాపై ఇజ్రాయిల్ దర్శకుడు నదావ్ లపీడ్ వ్యాఖ్యల్లో కొత్త విషయమూ లేదు, ఆశ్చర్యం కలిగించేదీ లేదు.

అలాంటప్పుడు దీంట్లో సమస్య ఏంటి? చర్చ పాతదే. సాహిత్యం లేదా సినిమా ప్రజలకు వినోదం కలిగించాలా, చైతన్యం కలిగించాలా లేదా ఒకే సమయంలో రెండింటికీ అవకాశం కల్పించాలా? 'ద హార్వర్డ్ క్రిమ్సన్' పుస్తకంలో జాకబ్ ఆర్ డ్రకెర్... భావాలను వ్యాప్తి చేసే, ప్రజలను చైతన్య పర్చే రచనల స్థానాన్ని సినిమా దురాక్రమించిందని రాశారు. కాబట్టి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చెందించడానికి లేదా చారిత్రక దృక్పథాన్ని వక్రమార్గం పట్టించడానికి కూడా సినిమాలు సాధనంగా మారవచ్చు. ఈ కోణంలో చూస్తే చారిత్రక దిద్దుబాటు పట్ల బీజేపీ జాగ్రత్తగా ఉన్నట్టు కనిపించదు. 'టైటానిక్' మునకను మరోసారి గుర్తు చేయడానికి లియోనార్డో డికాప్రియో, కేట్ విన్‌స్లెట్ నటించిన లాంటి మానవ జ్ఞాపకాన్ని తిరిగి మల్చగలిగిన చిత్రాల ఉదాహరణలు మనకు అనేకం ఉన్నాయి. స్టీవెన్ స్పీల్‌బర్గ్ తీసిన 'లింకన్' లేదా కెనడీపై అలివర్ స్టోన్ తీసిన 'జేకేఎఫ్' వంటివి వీక్షకుల దృష్టికోణంలోంచి గతంలోని చారిత్రక ఘటనలు, వ్యక్తులను సినిమా రూపంలో మలిచినవి.

విషాదకరమైన ఉపద్రవాలతో కూడిన ఘటనలను ఇతివృత్తంగా తీసుకున్నప్పుడు వాటి చిత్రీకరణ నిజంగానే సవాలు విసురుతుంది. ప్రత్యేకించి వీక్షకులు అలాంటి ఘటనలకు మరీ దూరమైన కాలంలో లేనప్పుడు, వాటిపట్ల నిర్మమకారంతో తమ అభిప్రాయాలు పంచుకోలేనప్పుడు ఇది మరింత సవాలుగా ఉంటుంది. అందుకే, కశ్మీర్ ఫైల్స్ సినిమాను విడుదల చేసి ఉండకూడదని శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుడు పేర్కొన్నారు. ఎందుకు చేయకూడదని చాలా మంది ప్రశ్నిస్తారు. దీనికి సమాధానంగా కౌంటర్ ప్రశ్నను సంధించాల్సిన అవసరం ఉంది. గోద్రా అల్లర్లు లేదా బాబ్రీ మసీదు విధ్వంసం వంటి ఘటనలపై అన్ని కోణాల్లో సత్యాన్ని చిత్రించే సినిమా తీసినట్లయితే దాని విడుదలకు బీజేపీ అనుమతిస్తుందా?

అంతర్జాతీయ ఘటనలపై తమ దృక్పథాన్ని, లేదా ప్రపంచంలో తమ పాత్ర గురించి వివరిస్తూ అన్ని దేశాలూ సినిమాలు తీస్తుంటాయన్నది నిజం. 1968లో వియత్నాం యుద్ధంపై అమెరికాలో యుద్ధ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తుతున్న కాలంలో, నాటి అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ ఇచ్చిన ప్రోత్సాహంతో 'ద గ్రీన్ బెరెట్స్' సినిమాను జాన్ వేయిన్ తీశారు. అమెరికా అసాధారణ వాదం నుంచి, అంతర్జాతీయ సుస్థిరతకు హామీ ఇవ్వడానికి, ప్రపంచ ఆధిపత్య శక్తిగా స్వీయ ప్రకటిత పాత్ర పోషించే నేపథ్యంలోంచి అనేక సూపర్ హీరో సినిమాలు వెల్లువెత్తాయి. అయితే ప్రచారం నుంచి కళను వేరు చేసే, రెచ్చగొట్టే మెజారిటీ వాదం నుంచి ఉదారవాద ప్రజాస్వామ్య విలువలను వేరు చేసే విభజన రేఖ తప్పకుండా ఉంటుంది. ఈ లక్ష్మణ రేఖను 'ద కశ్మీర్ ఫైల్స్' స్పష్టంగా మీరింది.

ఇజ్రాయిల్ దర్శకుడు నదావ్ లపీడ్ ఒక మూడో ప్రపంచ దేశాన్ని అవమానపర్చడంలో భాగంగా ఈ 'ఈకలు పీకలేదు'. ఇదే రకమైన విమర్శలను ఆయన తన స్వదేశంలో కూడా చేశారు. వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సెటిలర్లకు విరాళాలను పొడిగించడానికి లేదా వారి ఆక్రమణను సమర్థించే చిత్రాలను ప్రోత్సహిస్తున్న షోమ్రోన్ ఫిల్మ్ ఫండ్‌ను ఖండించడానికి ఆయన 250 మంది ఇజ్రాయిలీ ఫిలింమేకర్స్‌తో చేతులు కలిపారు. ఘటనల యథార్థాన్ని ప్రశ్నించకుండానే కశ్మీర్ ఫైల్స్ చిత్రించిన తరహా విషాదాన్ని విమర్శించవచ్చని లపీడ్ అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ నోరు విప్పి మాట్లాడటానికి భయపడుతున్న చోట నివసించడానికి ఎవరైనా ఇష్టపడతారా అని ఆయన ప్రశ్నించారు. వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వ సామర్థ్యాలు లేదా సోషల్ మీడియాలో ట్రోల్స్ రూపంలోని ఉన్మాద ప్రకటనలు లేక ప్రభుత్వ ప్రతినిధి వెర్రి చేష్టల కంటే మనం చూడాల్సిన నిజమైన సమస్య ఇదే మరి. నిజాలను నిర్ధారించడానికీ, లేదా ప్రభుత్వం నిర్దేశిస్తున్న వాస్తవికతను ప్రశ్నించడానికీ భారతదేశంలో ఇప్పటికీ చోటుందా?

వ్యాసకర్త మాజీ కార్యదర్శి, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇంకోలా అమలవుతుంది



ఇరానేతరులు అర్థం చేసుకోవాల్సింది ఏమంటే, 'ఒకవేళ' మొరాలిటీ పోలీసు వ్యవస్థను తొలగించినా, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ డ్రెస్ కోడ్ చట్టాలు అలాగే ఉంటాయి, అవి అమలవుతాయి. ఇంకోలా చెప్పాలంటే, 'కథ అదే ఉంటుంది, నటులు మారతారు'. కాబట్టి, కొన్ని వర్గాల నుంచి వస్తున్న సమాచారంతో తప్పుదోవ పట్టవద్దు.

– నజానిన్ నౌర్, నటి

నిజం ఎంత?



చివరకు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి 134, బీజేపీకి 104 సీట్లు వచ్చాయి. ఏ ఎగ్జిట్ పోల్ అయినా ఈ తీర్పుకు కనీసం దగ్గరగా వచ్చిందా? అలాంటప్పుడు టీవీ ఛానల్స్ ఈ ఎగ్జిట్ పోల్స్ ఫలితాల మీద అంత సమయం ఎందుకు వృథా చేస్తాయి?

– సునంద వశిష్ట్, పొలిటికల్ కామెంటేటర్

అందరం సమానం



ముంబయి గాలి నాణ్యత ఏమీ బాగాలేదని వార్త. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 303 దగ్గరుంది. అంటే ఇప్పుడు ఢిల్లీ ఒక్కటే న్యూనతగా ఫీల్ కావాల్సిన పనిలేదు. ప్రతి నగరం సమానంగా కలుషితమైంది. ఒక దేశం– ఒక కాలుష్యం!

– అనురాగ్ మైనస్ వర్మ, మల్టీమీడియా ఆర్టిస్ట్

అదీ చేస్తారేమో!



అహ్మదాబాద్ వాల్ ఆర్ట్ చిత్రాల్లో బాపు బొమ్మల స్థానంలో సావర్కర్‌వి వచ్చాయి. గ్రేట్! కరెన్సీ నోట్ల మీద కూడా బాపు స్థానంలో సావర్కర్‌ను మార్చండి.

– తుషార్ గాంధీ, రచయిత

అదే దారి




లాయర్లు కానివాళ్లకు కూడా అర్థమయ్యేట్టు లాయర్లు రాయలేకపోతే, వాళ్లు లాటిన్ భాషలో రాయడం మొదలుపెట్టవచ్చు.

– మైథిలీ మిశ్రా, న్యాయవాది

ఒంటరి గానాలాపన

నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఏ) 2013 అక్టోబర్ నెలలో మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నాడనే నెపంతో ఢిల్లీ విశ్వవిద్యాలయ ఆచార్యుడు, కవి, రచయిత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను అరెస్ట్ చేసింది. ఆయన జైలుశిక్షకు ఎనిమిదేళ్ళు నిండాయి. బాంబే హైకోర్టు ఈ కుట్రకేసును కొట్టివేసినా, సుప్రీంకోర్టు ఆ తీర్పును సస్పెండ్ చేసింది. ఇవ్వాళ ఈ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ. సాయిబాబా ఈ కేసు నుండి బయట పడతారు, ఎనిమిదేళ్ళ సాయి జైలు జీవితం పరిసమాప్తి అవుతుందని ప్రజాస్వామిక వాదులు ఆశగా చూస్తున్నారు.

ఇవాళ్టి కోనసీమ జిల్లాలోని అమలాపురం పక్కన చిన్న గ్రామంలో జన్మించారు సాయిబాబా. కొబ్బరి చెట్ల ఆకుల ఆవాసంలో, కిరోసిన్ దీపం వెలుగులో చదువుకొని, తన జ్ఞానపరిధిని ఢిల్లీ వరకు విస్తరించుకున్నారు. ఆదివాసులపై జరుగుతున్న దాడినీ, మధ్య భారతంలోని వనరుల దోపిడీనీ, బహుళజాతి సంస్థలు నిర్వహిస్తున్న మైనింగ్ అక్రమ దోపిడీనీ, ప్రపంచం దృష్టికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేశాడు. 2013లో అరెస్టు అయిన నాటికే సాయిబాబా ప్రజల గొంతుగా ఉన్నాడు. వికలాంగుడైనా ఆయన దృఢచిత్తుడు. జైలు జీవితమంటే జ్ఞాపకాల మధ్య జీవించడమే. ఈ ఎనిమిదేళ్ళ నిర్బంధంలో సాయిబాబా కవిగా రూపొందిన క్రమం చాలా చిత్రమైనది. జైలు కవిగా 'నేను చావును ధిక్కరిస్తున్నాను', 'కబీరు కవితలు', 'ఫైజ్ అహ్మద్ ఫైజ్ అనువాదం'... అనేవి ఆయన కవిగా వ్యక్తీకరించుకున్న రచనలు.



'నేను చావును ధిక్కరిస్తున్నాను' విరసం ప్రచురణగా వచ్చింది. దీని ఆంగ్ల పుస్తకాన్ని స్పీకింగ్ టైగర్ బుక్స్, న్యూఢిల్లీ వారు ప్రచురించారు. సుదీర్ఘ కాలం జైలు జీవితంలోని అనుభవాన్ని సాయి కవిత్వం ద్వారా వ్యక్తీకరించాడు. జైలు, జైలు అధికారులు, సిబ్బంది నాలుగు గోడల మధ్య ఒక స్వాప్నికుని నిర్బంధం. క్లాసులో పాఠాలు చెప్పిన ప్రొఫెసర్ జైలు వంటి తరగతి గదిలో తన వంటి ఖైదీలతో జీవితాన్ని పంచుకునే విధానం... తన సహచరి, తోబుట్టువులు, తను పాఠాలు చెప్పే పిల్లలు... ఇవన్నీ సాయిబాబా కవితా వస్తువులు. తన రాజకీయ విశ్వాసాల కారణంగా తను ఎంచుకున్న వస్తువు కవితాత్మకంగా మలిచిన తీరు, కవిత్వ పరిభాషలో పరిణతి. విప్లవం, ప్రేమ, దిగాలు పడిన రాత్రులు, నూతన ఉదయాలు, జైలు గది కిటికీపై వాలిన ఒంటరి పిచ్చుక. ఈ కవిత్వం నిర్బంధితుని ఒంటరి గానాలాపన!

సాయిబాబా విడుదల కావాలని ఢిల్లీలో విద్యార్థులు ప్రదర్శన చేస్తే ఏబీవీపీ ఆ విద్యార్థులపై దాడిచేసింది. ఆయన చేసిన నేరం మనుషులందరికీ ఒకే విలువ ఉండాలని ఘోషించడం.

– అరసవిల్లి కృష్ణ, విరసం అధ్యక్షులు । 92472 53884

భారత్‌కు అందివచ్చిన అవకాశం

సందర్భం



సి. రామచంద్రయ్య

ఈ డిసెంబర్ 1 నుంచి జీ20 దేశాల కూటమికి నాయకత్వం వహించే బాధ్యత భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ భుజస్కంధాలపై పడింది. ప్రపంచంలోని 20 అగ్రదేశాల కూటమికి భారత్ నేతృత్వం వహించే అవకాశం లభించడం గౌరవమే కాదు... ఓ గొప్ప అవకాశం కూడా! 1999లో జీ20 దేశాల కూటమి ఏర్పాటయింది. బలమైన ఆర్థిక వ్యవస్థల్ని అనుసంధానించి పరస్పర సహకారం, ప్రోత్సాహంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నది కూటమి ప్రధాన లక్ష్యం. జీ20 కూటమిలో 19 దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ భాగస్వామిగా ఉంది. కూటమి ఏర్పడింది 1999లో అయినా తొలి శిఖరాగ్ర సదస్సు జరిగింది మాత్రం 2008లో వాషింగ్టన్ డీసీలో. ఆ సమయంలోనే చోటుచేసుకొన్న 'ఆసియా ఆర్థిక సంక్షోభం' నుంచి బయటపడడానికి జీ20 దేశాల కూటమి కృషి చేసింది. అప్పటి నుంచి అంతర్జాతీయ స్థాయిలో శక్తిమంతమైన సంస్థలలో ఒకటిగా జీ20 అవతరించింది.

2016లో చైనాలో జరిగిన జీ20 కూటమి శిఖరాగ్ర సభలలో 'సమ్మిళిత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ' కోసం కృషి చేయాలని నిర్ణయం తీసుకున్న తర్వాత జీ20 కూటమిలో సభ్యత్వం లేని దేశాలతో కూడా వర్తక, వాణిజ్య సంబంధాలు ముమ్మరం అయ్యాయి. గత ఏడెనిమిది సంవత్సరాలలో భారత్ 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడంలో జీ20 కూటమి దేశాలతో భారత్ నెరపిన దౌత్య, వర్తక, వాణిజ్య సంబంధాలు కీలకంగా దోహదం చేశాయి.

ఇటీవల, ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధాన్ని విరమింపజేయడంలో అగ్రరాజ్యాలు విఫలం అయ్యాయి. రష్యాపై పలు ఆంక్షలు విధించినా భారత్ తన చమురు అవసరాల కోసం ఇప్పటికీ రష్యాపైనే ఆధారపడుతూ పెద్ద ఎత్తున చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ పరిణామాల దృష్ట్యా జీ20 కూటమికి భారత్ నేతృత్వం వహించడంవల్ల ఒరిగేదేమిటన్న ప్రశ్నలు అనివార్యంగా ఎదురవుతున్నాయి. ఇండోనేసియాలోని బాలిలో జరిగిన 2022 జీ20 శిఖరాగ్ర సదస్సులో, ఉక్రెయిన్ భూభాగం నుంచి రష్యా వైదొలగాలన్న పిలుపును కొన్ని దేశాలు గట్టిగానే వినిపించాయి. అంతకుముందే రష్యా అధినేత పుతిన్‌కు 'నేటి యుగం యుద్ధాలది కాదు' అంటూ భారత ప్రధాని నరేంద్రమోదీ ఎటువంటి శషభిషలు లేకుండా కుండబద్దలు కొట్టినట్లు చెప్పడంతో భారత్ తన వాణిజ్య అవసరాల కోసం మాత్రమే రష్యాతో సంబంధాలు నెరపుతున్నదే తప్ప, ఆ దేశం ప్రదర్శిస్తున్న యుద్ధోన్మాదాన్ని ఏమాత్రం ఉపేక్షించడం లేదన్న సంకేతం బలంగానే వెళ్లింది. అంతేకాదు... అంతర్జాతీయ సదస్సులలో చేసిన తీర్మానాలకు కట్టుబడటంలో భారత్ చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్న వాస్తవం కూడా తేటతెల్లం అయింది. ఉదాహరణకు క్యోటో ప్రోటోకాల్, పారిస్ కాప్ 21, అంతకుముందు రియో, కోపెన్ హెగన్ సదస్సులలో చేసిన తీర్మానాలకు అనుగుణమైన చర్యలు తీసుకోవడంతో పర్యావరణ పరిరక్షణ, భూతాప నియంత్రణలలో 63 దేశాల పనితీరుపై వెలువడ్డ నివేదికలో భారత్‌కు 8వ స్థానం లభించగా... చైనాకు 51, అమెరికాకు 52వ స్థానాలు లభించాయి.

భారతదేశం తను అనాదిగా నమ్మే 'వసుధైక కుటుంబం' (ప్రపంచం మొత్తం ఒకే కుటుంబం) అనే భావనను ముందుకు తెచ్చి పరస్పర సహకారం, భాగస్వామ్యం అత్యంత అవశ్యం అని చాటి చెబుతోంది. కలిసికట్టుగా సమస్యలను ఎదుర్కోనట్లయితే... కుటుంబంలో ఎవరో ఒకరికి ఇబ్బంది కలుగుతుందనేది భారత్ చెప్పే మాట. కానీ, చైనా వంటి కొన్ని దేశాలు 'నేను నా దేశం' (గ్రూప్ జీరో) ముఖ్యం అనే ధోరణిలోనే సొంత ప్రయోజనాల కోసం ఇతర దేశాల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగానూ, అంతిమంగా ప్రపంచ మానవాళికి ముప్పు కలిగించే విధంగానూ ముందుకు సాగుతున్నాయి.

జీ20 కూటమికి నేతృత్వం వహించడం వల్ల భారత్‌కు సమీప భవిష్యత్తులో కొన్ని సానుకూలతలు అందివస్తాయి. అందులో ప్రధానమైనది అంతర్జాతీయ ఉగ్రవాదానికి అందుతున్న ఆర్థిక సాయాన్ని నిలిపివేయించగలగడం లేదా తగ్గించగలగడం. అలాగే దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్, చైనా నుంచి అక్రమ చొరబాట్లు, ఆక్రమణలను నివారించడం; హిందూ మహా సముద్రంలో చైనా సైనిక పాటవ వ్యాప్తిని తగ్గించగలగడం, ముడిచమురు చౌకగా లభించే దేశాల నుండి దిగుమతి చేసుకోవడం. డిజిటల్ రంగంలో తను సాధించిన ప్రగతినీ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ ఇతర దేశాలకు అందించడం; ఆహార భద్రత, పోషకాహార పంపిణీలకు సంబంధించి పేద దేశాలకు బాసటగా నిలవడం... తదితర రంగాలలో భారత్ కీలకమైన పాత్ర పోషించబోతోంది. కోవిడ్ టీకాతో సహా వివిధ రకాల టీకాలను విస్తృతంగా అభివృద్ధి పరుస్తున్న భారత్ నుంచి సహాయ సహకారాలు ఆశిస్తున్న దేశాల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. ఈ రంగంలో తాను సాధించిన



ప్రగతిని ఆసియాలోని ఇతర దేశాలతోపాటు ఆఫ్రికా దేశాలతో పంచుకోవడంతో అంతర్జాతీయంగా భారత్ పేరు ప్రతిష్ఠలు గణనీయంగా పెరిగాయి. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభ నివారణలో భారత్ పోషించిన పాత్ర, ఆ దేశానికి అందించిన ఆర్థిక సాయం ఐక్యరాజ్యసమితి ప్రశంసలకు నోచుకొంది.

సాధిస్తున్న అభివృద్ధికి సమాంతరంగా పాత, కొత్త సవాళ్లు ఉమ్మడిగా భారత్‌కు ఎదురవుతున్నాయి. 'ఇది యుద్ధాల శకం' కాదని నరేంద్ర మోదీ రష్యా–ఉక్రెయిన్‌ల యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాఖ్యానించినప్పటికీ... యుద్ధం అన్నది అనేక రూపాలలో భారత్‌ను అస్థిరపరుస్తూనే ఉంది. తూర్పున అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులలో చైనా దురాక్రమణ నిరాఘాటంగా జరుగుతూనే ఉంది. కశ్మీర్ బోర్డర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం చేస్తున్న యుద్ధం ఆగలేదు. ఇంకా, కంటికి కనిపించని సైబర్‌వార్, ఇన్ఫర్మేషన్ వార్ వంటివి ఎటూ ఉండనే ఉన్నాయి. వీటికితోడు వాతా వరణ మార్పుల వల్ల ఏర్పడే విపత్తులు, మానవాళి మనుగడను ప్రశ్నిస్తున్న కొత్తకొత్త వైరస్‌ల విజృంభణ తదితర సవాళ్లు ఉన్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కొంటూ ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయమైన మార్గదర్శనం చేయాల్సిన అవసరం భారత్‌పై ఉంది.

నూతన పదబంధాలను సృష్టించడంలో మన ప్రధాని నరేంద్ర మోదీని మించిన వారెవరున్నారు? ఆయన సృష్టించిన పదబంధమే 'ఎకానమీ విజన్'. జీ20 కూటమి దేశాల మధ్య పరస్పర అనుసంధానత, బాధ్యతల భాగస్వామ్య విధానమే ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'ఎకానమీ విజన్ విధానం. 'నేను నా దేశం' (గ్రౌండ్ జీరో) అనే విధానానికి పూర్తిగా విరుద్ధమైనదే ఇది. ప్రపంచం అంతా ఒకే భూమి. ప్రపంచ జనాభా అంతా ఒకటే కుటుంబం. ఒకప్పుడు దీనిని 'యుటోపియన్ థియరీ'గా అభివర్ణించేవారు. 'అందరూ బాగుండాలి. అందులో నేనుండాలి' అనే భారత ప్రాచీన ధర్మం ఇమిడి ఉన్న విధానాలతో నరేంద్ర మోదీ జీ20 దేశాల కూటమికి దిశానిర్దేశం చేయనున్నారు. శిలాజాల ఇంధనాల వాడకాన్ని నిరోధించి హరిత ఇంధనాలను పెద్దఎత్తున వినియోగంలోకి తీసుకురావడం, సూర్యరశ్మి (సోలార్ ఎనర్జీ)ని విరివిగా ఉపయోగించుకోవడం; పవన విద్యుత్ వినియోగం పెంచడం వంటి చర్యల ద్వారా పటిష్ఠ కార్యాచరణకు ప్రధాని సమాయత్తం అవుతున్నారు.

నరేంద్ర మోదీ తన నాయకత్వ పటిమను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించే ఓ మహత్తర అవకాశం నేడు లభించింది. గతంలో ప్రధానమంత్రులుగా పనిచేసిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయిలకు ఏవిధంగానైతే వారి విశిష్ట నాయకత్వానికి వివిధ సందర్భాలలో అంతర్జాతీయ ఖ్యాతి లభించిందో... అలాగే నేడు ప్రధాని నరేంద్ర మోదీకి మరింత ఖ్యాతి దక్కడానికి జీ20 దేశాల నాయకత్వం అందివచ్చిన ఓ చక్కటి అవకాశం. దానిని ఆయన ఫలప్రదం చేసి దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తారని ఆశించవచ్చు.

వ్యాసకర్త శాసన మండలి సభ్యులు, ఏపీ

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.8.10 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** రోహిణి ఉ.11.55 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.5.56 నుండి 7.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.01 నుండి 10.44 వరకు తదుపరి ప.2.25 నుండి 3.10 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.27 నుండి 10.10 వరకు : **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు : **సూర్యోదయం** 6.22 : **సూర్యాస్తమయం** 5.22.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-2లో రికార్డు ఉత్పత్తి



బ్లాస్ట్‌ఫర్నేస్-2 ముఖచిత్రం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-2లో మంగళవారం రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరిగింది. ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా మూడు షిఫ్టులలో అత్యధికంగా 8,030 మెట్రిక్ టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి అయింది. బ్లాస్ట్‌ఫర్నేస్-2లో ఇప్పటివరకు ఇదే అత్యధికం కావడం విశేషం. అదేవిధంగా నవంబర్‌లో అత్యధికంగా వైర్‌రాడ్ మిల్-2లో 55 వేల టన్నులు, స్ట్రక్చరల్ మిల్‌లో 49 వేల టన్నులు, ఫినిష్డ్ స్టీల్ 1.35 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి సాధించాయి. ఈ ఉత్పత్తి గతంలో ఏ నవంబర్ నెలలోనూ సాధించని ఉత్పత్తి కంటే అధికం కావడం విశేషం. ఈ సందర్భంగా కార్మికులను ఆయా విభాగాల ఉన్నతాధికారులు అభినందించారు.

అధికార భాషా సంఘం నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మారెడ్డి, లక్ష్మీ పార్వతి, విజయ్‌బాబు తదితరులు

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రైమ్ హిల్ క్రెస్ట్ భవనంలోని రెండో అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ అధికార భాషా సంఘం కార్యాలయాన్ని బుధవారం శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర తెలుగు అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి ప్రారంభించారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ కార్యాలయం సచివాలయంలో ఉందని, అందరికీ అందుబాటులో ఉండే విధంగా జాతీయ రహదారి వెంట నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్రికా భాషలో సంస్కరణలు తీసుకువచ్చేందుకు సీనియర్ పాత్రికేయులతో తరగతులను నిర్వహిస్తామన్నారు. న్యాయ స్థానాల్లో తెలుగును అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సెక్రటరీ బాల గంగాధర్ తిలక్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో గరుడ లైటిక్స్ ఎంవోయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఏయూ, గరుడ లైటిక్స్ సంస్థ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో గరుడ లైటిక్స్ సంస్థ పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం ఉదయం వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గరుడ లైటిక్స్ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ వీఎస్‌ఎస్ కిరణ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ డ్రోన్స్‌తో పనిచేసే పరిజ్ఞానానికి సంబంధించిన కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న గరుడ లైటిక్స్ సంస్థతో ఎంవోయూ చేసుకోవడం వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. పర్యవేక్షణ, నిర్వహణ, సర్వే, ప్రమాదకర పరిస్థితుల్లో పని చేయడం వంటి అంశాల్లో డ్రోన్స్ వినియోగం పెరుగుతోందన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న రెండు సంస్థలతో ఇటీవల ఎంవోయూలు చేసుకున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వరాహ వాత్సల్యం

ఓ వరాహం తల్లి ప్రేమను పంచింది. శునకం పిల్లలకు పాలిచ్చి అమ్మ ప్రేమను చాటింది. విజయనగరం జిల్లా వేపాడ మండలం బానాది గ్రామ సమీపంలో బుధవారం కనిపించిన ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా చూశారు.

- వేపాడ

యువకుడికి పునర్జన్మనిచ్చిన జీజీహెచ్ వైద్యులు

- నెలరోజులు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు
- న్యూరాలజీ వార్డు అభివృద్ధికి రూ.50వేలు విరాళం ఇచ్చిన యువకుడి తల్లిదండ్రులు



న్యూరాలజీ వైద్యులకు విరాళం అందిస్తున్న యశ్వంత్ తండ్రి బ్రహ్మానందబాబు, పక్కన పలువురు పీజీ వైద్యులు

గుంటూరు మెడికల్: వెంటిలేటర్‌పై చికిత్స కోసం వచ్చిన ఓ యువకుడికి గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగం వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. లక్షలాది రూపాయలు ఖరీదు చేసే వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించి కోమాలో ఉన్న అతను నడిచి ఇంటికి వెళ్లేలా చేసి ప్రభుత్వాస్పత్రి సత్తాను మరోసారి చాటారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన చెరుకూరి యశ్వంత్(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతను అక్టోబర్ 10వ తేదీన మచిలీపట్నంలో రోడ్డు ప్రమాదానికి గురికాగా, విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బ్రెయిన్ బాగా దెబ్బతినడం, కాళ్లు, చేతులు, శరీరంలోని ఇతర భాగాలకు సైతం దెబ్బలు తగిలి కోమాలోకి వెళ్లాడు. కార్పొరేట్ ఆస్పత్రిలో తొమ్మిది రోజులు చికిత్స అందించినా ఆరోగ్యం మరింత క్షీణించింది. రూ.ఐదు లక్షలకు పైగా ఖర్చయ్యాయి. దీంతో యశ్వంత్‌ను అతని బంధువులు అక్టోబర్ 19వ తేదీన గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగానికి తీసుకువచ్చారు. బ్రెయిన్, బ్రెయిన్‌స్టమ్ దెబ్బతినడం, కళ్లు తెరవకపోవడం, మాట్లాడలేకపోవడం, శరీరంలో కదలికలు లేకపోవడంతో బ్రెయిన్ డెడ్ స్టేజీలో జీజీహెచ్‌కు వచ్చిన యశ్వంత్‌ను పరీక్షించిన వైద్యులు 24గంటలు పర్యవేక్షిస్తూ అత్యాధునిక వైద్య సదుపాయాలతో చికిత్స అందించారు. అతను కోలుకుని నవంబరు 14వ తేదీన ఇంటికి నడిచివెళ్లేలా చేశారు. యశ్వంత్ బుధవారం ఫాలో అప్ చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చాడు. అతనితో కలిసి న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి మీడియాకు వివరాలు వెల్లడించారు. న్యూరాలజీ వైద్యులు చేసిన సేవలకు కృతజ్ఞతగా వార్డు అభివృద్ధికి యశ్వంత్ తండ్రి బ్రహ్మానందబాబు రూ.50వేలు విరాళం అందించారు. న్యూరాలజీ వైద్య సేవలు కార్పొరేట్ ఆస్పత్రుల కంటే చాలా బాగున్నాయని ఆయన తెలిపారు. యువకుడి తండ్రి అందించిన విరాళంతో ఆక్సిజన్ కాన్సంట్రేటర్ కొనుగోలు చేసి న్యూరాలజీ వార్డుకు వచ్చే రోగులకు వినియోగిస్తామని డాక్టర్ సుందరాచారి ప్రకటించారు. తక్షణమే సదరు వార్డులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అరుణకుమారి స్పందించి కాన్సంట్రేటర్‌ను తాను విరాళంగా అందిస్తానని ప్రకటించడంతో ఆమెను పలువురు వైద్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీజీ వైద్యులు డాక్టర్ యమున, డాక్టర్ నజ్మా, డాక్టర్ కాంతిమా, డాక్టర్ కార్తీక్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా కలశజ్యోతి మహోత్సవం

- వేలాదిగా వచ్చిన భక్తులు



పార్వతీ, గంగా సమేత పరమేశ్వర్లు ఊరేగింపు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు భవానీలు బుధవారం కలశ జ్యోతులను సమర్పించారు. కలశ జ్యోతుల ఉత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీగంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దుర్గగుడి ఈవో భ్రమరాంబ, సత్యనారాయణపురం సీఐ బాలమురళీకృష్ణ పూజలు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చారు. ప్రత్యేక వాహనంతో పాటు దేవస్థాన ప్రచార రథాన్ని సప్తవర్ణాలు కలిగిన పుష్పాలతో అలంకరించగా ఆది దంపతులు కొలువుతీరారు. రథాలకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఈవో భ్రమరాంబ ఊరేగింపును ప్రారంభించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ గుమ్మడి కాయ కొట్టి వాహనాన్ని ముందుకు నడిపించారు. ఊరేగింపు సత్యనారాయణపురం నుంచి ప్రారంభమైంది. భవానీలు జ్యోతులను చేతపట్టుకుని నగర పుర వీధుల మీదగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. కనకదుర్గనగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రాంగణంలో భవానీలు కలశజ్యోతులను సమర్పించారు. మహా మండపం మీదగా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి 11 గంటల వరకు భవానీలను దర్శనానికి అనుమతించారు.

పరిపాలన రాజధానికి విశాఖ అనువైనది

- ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్

తగరపువలస: ప్రపంచంలోని వంద మహా నగరాల్లో విశాఖ ఒకటని, ఇక్కడ పరిపాలన రాజధానికి అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. విశాఖకు రోడ్డు, వాయు, రైలు, జల రవాణా మార్గాలతో పాటు ఇక్కడ ఫిషింగ్ హార్బర్, షిప్ యార్డు, ఉక్కు, ఐటీ పరిశ్రమలు, ఇంధన కంపెనీలు, ఇతర భారీ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఆనందపురం హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో 'వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 26 జిల్లాలు అభివృద్ధి చెందడానికిగాను విశాఖ, కర్నూలు, అమరావతిలో మూడు రాజధానులు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతి రాజధానికి ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. ముందుచూపుతో సీఎం జగన్ వికేంద్రీకరణ వైపు అడుగులు వేశారన్నారు. దీనిని రాష్ట్ర ప్రజలంతా సానుకూలంగా తీసుకుంటున్నారన్నారు. ఏపీ రాష్ట్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు పప్పల రామ్మోహనరావు మాట్లాడుతూ.. పరిపాలన కేంద్రీకరణతో వలసలు వెళ్లిన ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలు అందరికీ తెలుసన్నారు. ఉత్తరాంధ్రలో నాగావళి, వంశధార, జంజావతి, చంపావతి, గోస్తనీ నదులను అభివృద్ధి చేసుకుంటే ఉత్తరాంధ్ర సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ సందర్భంగా పరిపాలన వికేంద్రీకరణ గురించి అవగాహన కలిగిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, అధ్యాపకురాలు నిర్మల పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితులకు రిమాండ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై బాజిరెడ్డి

దుత్తలూరు (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): స్కూల్ నుంచి బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితులకు కావలి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ వివరాలను శ్రీపొట్టిశ్రీరాములు జిల్లా దుత్తలూరు ఎస్ఐ బాజిరెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. దుత్తలూరు ఏసీ కాలనీ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న ఏలూరు శ్రావ్య కిడ్నాప్ అవ్వడంతో.. ఎస్పీ ఆదేశాల మేరకు వెంటనే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులు శీనయ్య, వెంకటరమణమ్మను పల్నాడు జిల్లా దాచేపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. నిందితులను జిల్లా కేంద్ర కారాగారానికి తరలించినట్లు చెప్పారు.

ఏవోబీలో తగ్గిన మావోయిస్టుల ప్రభావం

- 1.30 లక్షల కిలోల గంజాయి పట్టివేత
- 2 వేలమంది అరెస్టు
- 7,500 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం
- విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ వెల్లడి



డీఐజీ హరికృష్ణ

నక్కపల్లి(అనకాపల్లి జిల్లా): ఆంధ్రా, ఒడిశా బోర్డర్ (ఏవోబీ) పరిధిలో నక్సల్స్ ప్రభావం తగ్గిందని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన అడ్డరోడ్డులోని సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాల పునర్విభజనతో గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు, తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం, వై.రామవరం, చింతూరు, మోతుగూడెం, అడ్డతీగల, రాజవొమ్మంగి తదితర ప్రాంతాల పరిధిలో ఉండే నక్సల్స్ ప్రభావ ప్రాంతం మొత్తం ఇప్పుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ తీసుకున్న కఠిన చర్యలు, పునరావాస కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాల కల్పన వల్ల మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలుస్తున్నారని తెలిపారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గంజాయి సాగు, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఐజీ హరికృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు 1.30లక్షల కిలోల గంజాయిని పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రెండు వేలమందిని అరెస్టు చేశామని తెలిపారు. గతేడాది డిసెంబర్ వరకు అల్లూరి జిల్లాలో 7,500 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ

ఏరియా కమిటీ సభ్యురాలు భారతి సహా 34 మంది లొంగుబాటు



లొంగిపోయిన భారతి, ఆర్మ్‌డ్ మిలీషియా సభ్యులు

పాడేరు రూరల్ (అల్లూరి సీతారామరాజు) : ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ (అడ్మిన్) తుహిన్‌సిన్హా, సీఆర్పీఎఫ్-198 సెకెండ్ బెటాలియన్ సెకెండ్ కమాండెంట్ నోవెల్ కిషోర్ సమక్షంలో మావోయిస్టు పార్టీ పెదబయలు ఏరియా కమిటీ సభ్యురాలు కిల్లో ఇందు అలియాస్ భారతి అలియాస్ గెమ్మెలి భారతి సహా మరో 34 మంది ఆర్మ్‌డ్ మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. పెదబయలు మండలం మారుమూల జామిగూడ పంచాయతీ జడిగూడ గ్రామానికి చెందిన మావోయిస్టు సభ్యురాలు కిల్లో భారతి 2014లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యురాలిగా, జననాట్య మండలి సభ్యురాలిగా చేరి చురుగ్గా పనిచేసింది. 2017లో మావోయిస్టు డిప్యూటీ కమాండర్ సుధీర్ ప్రోద్బలంతో పెదబయలు దళంలో పార్టీ మెంబర్‌గా చేరింది. అప్పటి నుంచి మావోయిస్టు పార్టీలో చురుగ్గా పని చేస్తూ గిరిజనులను పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో హత్యలు చేయడం, గిరిజనుల ఇళ్లపై కరువు దాడులకు పాల్పడడం తదితర ఘటనల్లో ఆమె పాల్గొనేది. ఆమెపై ప్రభుత్వం రూ.లక్ష రివార్డు కూడా ప్రకటించింది. మిగిలిన 34 మంది సభ్యులు జడిగూడ, ఇంజరి, గబ్బరమామిడి, సుల్తాన్‌పుట్టు, మాలసీతకోట, పిట్టలబొర్రా గ్రామాలతో పాటు ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ మండలం డబల్ పహార్, చీకటిపల్లి, కొక్కుగెడ్డ, రోళ్ళగెడ్డ, గాజులమామిడి, కొండసువ్వాపల్లి, దూదుపల్లి గ్రామాలకు చెందిన వారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలు భారతికి ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రివార్డు అందజేస్తామని ఎస్పీ వివరించారు. లొంగిపోయిన మిలీషియా సభ్యులకు కూడా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు, సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలితో పాటు మిలీషియా సభ్యుల నుంచి పలు రకాల పేలుడు పదార్థాలు, పరికరాలు, దుస్తులు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'లో టీడీపీ ప్రజాప్రతినిధులు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో పాటు ప్రభుత్వ పథకాలపై ప్రచారం
- సీఎం జగన్ ఫొటోలతో కూడిన బ్రోచర్ల పంపిణీ
- ప్రభుత్వ పథకాలను గిరిజనులకు వివరించిన టీడీపీ నేతలు



చొంపిలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గుణతో పాటు టీడీపీ కండువాలతో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యురాలు సామెలి జానకి, ఆమె భర్త

సాక్షి, పాడేరు: ప్రజల సమస్యలను ఎమ్మెల్యేలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి అరకులోయ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా ఆదరణ వస్తోంది. ప్రధానంగా తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. అరకు లోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అరకు మండలంలో రెండు రోజుల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో దూసుకుపోతున్నారు. పెదలబుడు పంచాయతీ పానిరంగిని గ్రామంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో టీడీపీకి చెందిన పెదలబుడు మేజర్ పంచాయతీ(గతంలో చంద్రబాబునాయుడు దత్తత పంచాయతీ) సర్పంచ్ పేటెలి దాసుబాబు ఎమ్మెల్యేతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు గిరిజనుల ఇళ్లకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో కూడిన ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసుబాబు కోరారు. అలాగే బుధవారం చొంపి పంచాయతీ కేంద్రంలోనూ టీడీపీకి చెందిన చొంపి ఎంపీటీసీ సభ్యురాలు సామెలి జానకి, ఆమె భర్త టీడీపీ కండువాలు కప్పుకుని తరలివచ్చారు. ఎమ్మెల్యేతో పాటు వారు కూడా ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ పథకాల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరిజనులకు ఎమ్మెల్యే పంపిణీ చేసిన ప్రభుత్వ పథకాల బ్రోచర్లను టీడీపీ ఎంపీటీసీ జానకి స్వయంగా చదివి వినిపించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలను, పార్టీలను కూడా ఆకట్టుకుంటున్నాయనడానికి ఇదే నిదర్శనమని పలువురు వ్యాఖ్యానించారు.

విమ్స్‌లో పీఆర్‌పీ సేవలు ప్రారంభం



విమ్స్‌లో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు, డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ(విశాఖ తూర్పు): దీర్ఘకాలిక కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి కోసం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ(పీఆర్‌పీ) అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ ఆర్థోపెడిక్ విభాగంలో బుధవారం ఈ సేవలను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. వైద్యులు రోగులను పరీక్షించి థెరపీ చేశారు. ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన రాష్ట్రంలోనే తొలి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్ కావడం విశేషం. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ఈ చికిత్సను రోగులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ లేని వారికి నామమాత్రంగా రుసుం తీసుకొని సేవలు అందిస్తామన్నారు. ఇటీవల ఇక్కడ పెయిన్ క్లినిక్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విమ్స్ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ పీఆర్‌పీ చికిత్స ద్వారా దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే రోగులకు తక్షణ ఉపశమనం కలుగుతుందన్నారు. 60 ఏళ్లు దాటిన వారికి కీళ్ల నొప్పులు సహజంగా వస్తుంటాయని, వ్యాధి తీవ్రతను బట్టి ఈ చికిత్స ఒకటి, రెండు సార్లు అందించాల్సి ఉంటుందన్నారు.

తల్లీబిడ్డ వాహనంలో జాయింట్ కలెక్టర్ భార్య..

- ప్రసవానంతరం సురక్షితంగా ఇంటికి..



తల్లీబిడ్డ వాహనంలో ఇంటికి చేరుకున్న జేసీ ఆనంద్ దంపతులు

పార్వతీపురంటౌన్ : పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆనంద్ భార్య కార్తీకకు సోమవారం పురిటినొప్పులు వచ్చాయి. ప్రసవం కోసం పార్వతీపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేరారు. వైద్యులు సుఖప్రసవం చేయడంతో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆస్పత్రికి ప్రభుత్వం సమకూర్చిన తల్లీబిడ్డ వాహనంలో ఆమె జేసీ బంగ్లాకు చేరుకున్నారు. సురక్షితంగా ఇంటికి చేర్చిన వాహన సిబ్బందిని జేసీ అభినందిస్తూ.. తల్లీబిడ్డ వాహన సేవలు బాగున్నాయంటూ కితాబిచ్చారు. గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన కోర్సులతో ఉజ్వల భవిష్యత్

తాడేపల్లిగూడెం: ఉద్యాన కోర్సులతో ఉజ్వల భవిష్యత్ ఉందని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ అన్నారు. బీఎస్సీ హార్టీకల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలోనే ఉద్యాన విశ్వవిద్యాలయాల కేటగిరీలో నంబర్ వన్ స్థానంలో ఉన్న ఉద్యాన వర్సిటీలో చేరిన విద్యార్థులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. బీఎస్సీ హార్టీకల్చర్‌లో మొత్తం సీట్లు 527 ఉండగా 1,450 దరఖాస్తులు వచ్చాయి. ఏపీఈఏపీసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పించారు. గురువారం కూడా కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఎ.ఎస్.పద్మావతమ్మ, అంబాజీపేట హెచ్ఆర్ఎస్ సీనియర్ సైంటిస్టు బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.వెంకటస్వామి, పరిశోధనా సంచాలకులు ఎల్.నారం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ - మత్స్యశాఖ
టెండర్ ప్రకటన
జిల్లా మత్స్యశాఖ అధికారి, అనకాపల్లి వారికి 80-100 మిల్లీ మీటర్ల సైజు గల మేజర్ కార్ప్ చేప పిల్లలు, TVS XL-100 HD i touch Mopeds, 50 లీటర్ల కెపాసిటీ గల ఐస్ బాక్సులు, FRP బోట్స్, ఓ.బి.ఎమ్. నెట్ సరఫరాకై ఉత్పత్తిదారులు / డీలర్ల నుండి సీల్డ్ కొటేషన్లు కోరడమైనది. పూర్తి వివరాలకై కార్యాలయపు పని వేళలలో పొందవచ్చును. నోటీసు ప్రచురణ తేదీ నుండి ప్రభుత్వ 07 పని దినముల లోపల కొటేషన్స్ పంపవలెను. సంప్రదించు ఫోన్ నెం : 9440371845
జిల్లా మత్స్యశాఖ అధికారి
(ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ రూమ్ నెం.36),
శంకరం గ్రామం, రేబాక పోస్ట్, అనకాపల్లి జిల్లా

శ్రీ ఆంజనేయస్వామి దేవాలయము, ఐ.లింగాపురం (గ్రా), బండిఆత్మకూరు (మం), నంద్యాల జిల్లా
e-Procurement Tender NIT NO. COE/759/2022-16, Dt: 20.10.2022
దేవాలయ పునర్నిర్మాణము కొరకు e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నం. 25/2022-23/ఎ.ఇ./ తేది : 03.12.2022
విజయనగరం జిల్లా పరిధిలో గల 70 టిబిటిలకు శాశ్వత మంచి నీటి, ఇంటింటికి కుళాయి ద్వారా గ్రామీణ నీటి సరఫరా కల్పించు పనులకు అంచనా విలువ : రూ. 1099.44 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్ లభించు తేది : 13.12.2022 సా. 5.00 గం. నుండి. ఇతర వివరాలు : www.shorttenders.apeprocurement.gov.in. ఫోన్ : 949-274-7574.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స. మరియు పారిశుద్ధ్య విభాగం, విజయనగరం
DIPR RO No. 6997/CL/Advt/1/1/2021-22, Dt : 07.12.2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 23/RCPLWE/SEPRVSP/2022-23 తేది : 01.12.2022
విశాఖపట్నం జిల్లాలోని ముంచింగ్‌పుట్టు మండలంలో PMGSY (RCPLWE) గ్రాంట్ క్రింద రూ. 1014.00 లక్షల అంచనా వ్యయంతో 3 బ్రిడ్జి నిర్మాణ పనులు. బిడ్ డౌన్‌లోడ్ : 08.12.2022 తర్వాత, పూర్తి వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ pmgsytendersap.gov.in చూడండి. ఫోన్ నం. 0891 2521739.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, PR సర్కిల్, విశాఖపట్నం
DIPR RO No. 6982/CL/Advt/1/1/2021-22, Dt : 07.12.2022

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LIMITED
Corporate office: H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati-517503
Tender Notice (e-procurement)
Bids through ape-procurement are invited from the eligible bidders for Distribution Network Strengthening Works for reinforcement of existing 100 sqmm AAA Conductor of 33KV Network in Kadapa & Proddatur Town, Kurnool Town and Anantapuram Town with 157 sqmm AL59 Conductor on semi-turnkey basis (SP No. 14/2022-23). The tender will be made available from 23:00Hrs on 08.12.2022 onwards in the website: www.apeprocurement.gov.in CHIEF GENERAL MANAGER/PROJECTS
Bids through ape-procurement are invited from the eligible bidders for construction of compound wall around the premises of 33/11KV SS, Veerabali & 33/11KV SS, Lakkireddy Palli in Operation Circle, Kadapa. For further details: www.apeprocurement.gov.in CHIEF GENERAL MANAGER/P&MM & CIVIL

A.P. TOURISM DEVELOPMENT CORPORATION LTD
5TH Floor, Stalin Corporate, Industrial Estate, Autonagar, Vijayawada -07
Tender Notice No. APTDC/O&M/4/2002 Dt. : 06.12.2022
E-TENDER NOTIFICATION
APTDC Ltd inviting Bids for Selection of O&M Operator for following Projects. 1) Selection of Agency for the following works at Blue Flag Beach, Rushikonda, Visakhapatnam in Andhra Pradesh (3rd Call). a) Operation & Maintenance of Infrastructure facilities, b) Collection of Revenue, c) Project Monitoring. 2) Pilgrim Tourism, 3) Eco Tents, 4) Floating Restaurant at Berm Park, Vijayawada, 5) Amrut Kiosk(s). For further details visit our website www.tourism.ap.gov.in and https://www.apeprocurement.gov.in.
Sd/- K KANNA BABU, IAS, Managing Director
DIPR RO No.1411PP/CL/ADVT/1/1/2021-22, Dt. : 07.12.2022

ANDHRA PRADESH SCHEDULED CASTES COOPERATIVE FINANCE CORPORATION LIMITED, TADEPALLI, AMARAVATHI
TENDER NOTICE
Eprocurement Notice NIT No. 01/APSCCFC/Desludging Vehicles 2022-23, Dated 06.12.2022
The APSCCFC ltd, Tadepalli is inviting tenders through AP eprocurement Portal for procurement of 138 Vaccum Suction Desludging Vehicles with an estimated cost of around Rs. 38.00 Crores under NSKDC Scheme for the year 2022-23 for supply to all the Districts in the State of Andhra Pradesh. For Details please visit www.apeprocurement.gov.in from 07.12.2022 Tender / RFP form can be downloaded from website. Eligible firms are requested to upload the prescribed format as per the schedules given in the portal.
Sd/- S.Chinna Ramudu VC & Managing Director
DIPR RO No. 1410PP/CL/ADVT/1/1/2021-22, Dt.: 07.12.2022

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
Administrative Office : LAM : Guntur - 522509 : A.P.
NOTIFICATION
NRI/NRI Sponsored quota and Self Finance Quota (Agribusiness Management) for the AY2022-23
Applications are invited from eligible candidates for admission into NRI/NRI Sponsored quota (PG Programmes) and SFQ (Agribusiness Management-PG Programme) for the AY2022-23. Filled in application along with required enclosures and online payment receipt should reach THE REGISTRAR, ANGRAU, Administrative Office, Lam, Guntur-522034 A.P. on or before 12.01.2023 (4.00PM). Application form and Information broucher of both NRI & SFQ can download from University website from 08.12.2022 onwards. For any other information and the latest updates, candidates are requested to visit university website www.angrau.ac.in regularly.
Sd/- G. RAMA RAO, REGISTRAR
DIPR RO No. 1413PP/CL/ADVT/1/1/2021-22, Dt. : 07.12.2022

ఈస్ట్ కోస్ట్ రైల్వే
రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల పునఃనియామకం
నెం. WPS/5/Rectt/Re-engagement/GSU/Vol.1, తేదీ 02.12.2022
ఈ క్రింది సూచించిన విభాగాలలో నిర్దిష్ట కాలవ్యవధికి ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయుటకు 23.12.2022 నాటికి 65 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చును.

డిపార్ట్‌మెంట్	క్యాటగిరీ	లెవెల్	నియమించు పోస్టుల సంఖ్య
ఇంజనీరింగ్	సీనియర్ సెక్షన్ ఇంజనీర్/వర్క్స్	7	03
	సీనియర్ సెక్షన్ ఇంజనీర్/పి.వే	7	01
	సీనియర్ సెక్షన్ ఇంజనీర్/డ్రాయింగ్	7	01

దరఖాస్తులను ఇ-మెయిల్ recruitment.rrb.wat@gmail.com ద్వారా 23.12.2022 తేదీలోగా పంపవలెను.
పూర్తి వివరముల కొరకు దయచేసి చూడండి: ఈస్ట్ కోస్ట్ రైల్వే వెబ్‌సైట్: www.eastcoastrail.indianrailways.gov.in → మా గురించి → డివిజన్ → వాల్తేరు డివిజన్ → వాల్ అప్ అనౌన్స్‌మెంట్
PR-781/N/22-23
డివిజనల్ రైల్వే మేనేజర్ (P)/వాల్తేరు

'నోట్ల రద్దు'పై రికార్డులు సమర్పించండి

కేంద్రం, ఆర్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: పెద్ద నోట్లను రద్దు చేస్తూ(డిమానిటైజేషన్) 2016లో తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన రికార్డులు సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. వాటిని తాము పరిశీలిస్తామని తెలిపింది. నోట్ల రద్దు నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 58 పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎస్‌ఏ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం కొంతకాలంగా విచారణ కొనసాగిస్తోంది. ఆర్‌బీఐ తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వొకేట్లు పి.చిదంబరం, శ్యామ్ దివాన్ బుధవారం వాదనలు వినిపించారు. ఈ నెల 10వ తేదీ నాటికి లిఖితపూర్వకంగా వాదనలు తెలియజేయాలని ధర్మాసనం సూచించింది. తీర్పును రిజర్వు చేసింది.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టు మొబైల్ యాప్ 2.0 ప్రారంభం

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ వెర్షన్ 2.0 మొబైల్ అప్లికేషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా కోర్టు కార్యకలాపాలను న్యాయమూర్తులు, న్యాయవాదులు, కేంద్ర శాఖల నోడల్ అధికారులు రియల్ టైమ్‌లో వీక్షించవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచించారు. ఐఓఎస్ వెర్షన్ మరో వారం రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. యాప్‌లో లాగిన్ కావడం ద్వారా సుప్రీంకోర్టు ప్రొసీడింగ్స్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలిపారు. కేసులు, ఉత్తర్వులు, తీర్పులు, పెండింగ్ కేసుల స్థితిగతులను తెలుసుకొనేందుకు వీలవుతుందని చెప్పారు.

ఇద్దరు టీనేజర్లను కాల్చి చంపిన ఉత్తర కొరియా

సియోల్: ఉత్తర కొరియా అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. దక్షిణ కొరియాకు చెందిన సినిమాలు చూశారన్న అక్కసుతో కిమ్ జాంగ్ ఉన్ ప్రభుత్వం ఇద్దరు టీనేజర్లకి మరణ శిక్ష అమలు చేసినట్టుగా ది మిర్రర్ పత్రిక వెల్లడించింది. ఈ ఏడాది మొదట్లోనే దారుణం జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని పేర్కొంది. 16, 17 సంవత్సరాలు వయసున్న ఇద్దరు అబ్బాయిల్ని స్థానికుల సమక్షంలోనే అధికారులు కాల్చిచంపారు. మరెవరూ దక్షిణ కొరియా సినిమాలు చూడకుండా ఉండడానికి శిక్ష అమలు చేయడం స్థానికులకు బలవంతంగా చూపించారు. ఇక సవితి తల్లిని చంపిన నేరానికి మరో అబ్బాయికి కూడా మరణ శిక్ష విధించారు.

ఆర్‌ఆర్‌ఆర్, కేజీఎఫ్-2, కశ్మీర్ ఫైల్స్.. గూగుల్‌లో సెర్చ్‌లో టాప్

న్యూఢిల్లీ: ఈ సంవత్సరం భారత్‌లో జనం గూగుల్ సెర్చ్ ఇంజన్‌లో అత్యంత ఎక్కువగా వెతికిన సినిమాల జాబితాలో.. ఘన విజయం సాధించిన ఆర్‌ఆర్‌ఆర్, కాంతారా, కేజీఎఫ్-2, ది కశ్మీర్ ఫైల్స్ చలనచిత్రాలు చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో తొలి స్థానంలో బ్రహ్మాస్త్ర:తొలిభాగం-శివ సినిమా నిలిచింది. జాబితాలో టాప్ టెన్ సినిమాలు ఇవే..

1. బ్రహ్మాస్త్ర:తొలిభాగం-శివ
2. కేజీఎఫ్-2
3. ది కశ్మీర్ ఫైల్స్
4. ఆర్‌ఆర్‌ఆర్
5. కాంతారా
6. పుష్పా: ది రైజ్
7. విక్రమ్
8. లాల్ సింగ్ ఛద్దా
9. దృశ్యం-2
10. థోర్: లవ్ అండ్ థండర్

'ఫోర్బ్స్' శక్తివంతమైన మహిళ నిర్మలా సీతారామన్

న్యూయార్క్: అమెరికా బిజినెస్ మేగజైన్ ఫోర్బ్స్ విడుదల చేసిన 'ప్రపంచంలో 100 మంది అత్యంత శక్తివంతమైన మహిళల' వార్షిక జాబితాలో ఆరుగురు భారతీయులకు స్థానం దక్కింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్(36), బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా(ర్యాంకు 72), నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణి నాయర్(ర్యాంకు 89), హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా (ర్యాంకు 53), సెబీ చైర్‌పర్సన్ మాధవీ పూరి (ర్యాంకు 54), స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ సోమా మోండాల్ (ర్యాంకు 67) ఈ జాబితాలో చోటు సాధించారు.



'పర్సన్ ఆఫ్ ది ఇయర్' -2022గా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఎంపికచేస్తూ ఆయన ముఖచిత్రంతో టైమ్ మేగజైన్ తాజా సంచికను ప్రచురించింది.



అభిమానులకు కేజ్రీవాల్ విజయాభివాదం


ఆప్ కార్యకర్తల గెలుపు సంబరం


ఎంసీడీ చరిత్రలో తొలి ట్రాన్స్‌జెండర్ కార్పొరేటర్‌గా చరిత్ర సృష్టించిన బాబీ కిన్నర్

ఢిల్లీపై ఆప్ జెండా

కార్పొరేషన్ ఎన్నికల్లో ఘనవిజయం
కమలం పార్టీపై ఆప్‌కు తొలి గెలుపు



- హస్తినలో 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెర
- 250 వార్డుల్లో కేజ్రీవాల్ పార్టీకి 134
- బీజేపీ గట్టి పోటీ, 104 సీట్లలో విజయం
- కాంగ్రెస్‌కు మరో ఘోర పరాజయం

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ దుమ్ము రేపింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయంతో రాజకీయ అరంగేట్రం చేసిన ఆ పార్టీ తొలిసారిగా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లోనూ (ఎంసీడీ) పాగా వేసింది. 15 ఏళ్ల బీజేపీ పాలనకు తెర దించుతూ ఎంసీడీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. కమలం పార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి రాణించినా విజయానికి దూరంలో 20 స్థానాల దూరంలో ఆగిపోయింది. మొత్తం 250 వార్డుల్లో మెజారిటీకి 126 సీట్లు కావాల్సి ఉండగా ఆప్ 134 దక్కించుకుంది. బీజేపీ 104 చోట్ల గెలిచింది. ఇక కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాల పరంపరను కొనసాగిస్తూ కేవలం 9 వార్డులకు పరిమితమైంది. స్వతంత్రులు మూడు స్థానాల్లో నెగ్గారు. ఏ ఎన్నికల్లోనైనా బీజేపీని ఓడించడం ఆప్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం! ఆప్ తొలిసారిగా 2015లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో, తాజాగా పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గినప్పుడు రెండు చోట్లా అధికారంలో ఉన్నది కాంగ్రెసే. 2020లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ తిరుగులేని విజయంతో అధికారాన్ని నిలబెట్టుకుంది. ఢిల్లీపై ఏడేళ్ల ఆప్ పట్టును బలహీనపరచాలన్న బీజేపీ ప్రయత్నాలకు ఈ ఫలితాలు ఎదురుదెబ్బేనని భావిస్తున్నారు. ఆప్ విజయంతో ఆ పార్టీ కార్యకర్తలు మద్దతుదారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. బాజాలు మోగిస్తూ, ప్రధాన కార్యాలయంతో పాటు నగరమంతటా మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. 'ఎంసీడీలోనూ కేజ్రీవాల్ పాలన. వచ్చే ఐదేళ్లూ మంచి రోజులే' అంటూ ఢిల్లీ అంతటా హోర్డింగులు వెలిశాయి. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కార్పొరేషన్‌ను అవినీతి, లంచాల జాడ్యం నుంచి విముక్తం చేసి దేశ రాజధానిలో సదుపాయాలు, సౌకర్యాలను పూర్తిస్థాయిలో మెరుగు పరుస్తామని ప్రకటించారు. అందుకు కేంద్రం, ప్రధాని మోదీ ఆశీస్సులు కోరారు! ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా మాట్లాడుతూ, 15 ఏళ్ల పాలన నేపథ్యంలో సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకత నేపథ్యంలో తాము మెరుగైన ఫలితాలే సాధించామన్నారు. ఓట్ల శాతాన్ని యథాతథంగా నిలుపుకోవడం తమ విజయమేనని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అభిప్రాయపడ్డారు.

తొలుత బీజేపీదే హవా...

ఢిల్లీలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లను విలీనం చేస్తూ ఈ ఏడాది మొదట్లో 250 వార్డులతో ఎంసీడీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జరిగిన తొలి ఎన్నికలివి. డిసెంబర్ 4న పోలింగ్ జరిగింది. బుధవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైంది. తొలుత ఆప్, బీజేపీ నువ్వా నేనా అన్నట్టుగా సాగినా క్రమంగా కమలం పార్టీ దూసుకెళ్లింది. మధ్యాహ్నానికల్లా ఆప్ 95, బీజేపీ 107 స్థానాల్లో ఆధిక్యంలో నిలిచాయి. తర్వాత క్రమంగా ఆప్ స్థిరంగా పుంజుకుని మెజారిటీ మార్కును దాటేసింది. 2017లో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో 272 వార్డుల్లో బీజేపీ ఏకంగా 181 స్థానాలు గెలిచింది. ఆప్ 48, కాంగ్రెస్ 30 స్థానాలకు పరిమితమయ్యాయి.

బీజేపీకి పెరిగిన ఓట్ల శాతం

ఎంసీడీ ఎన్నికల్లో ఆప్‌కు 42 శాతం ఓట్లు రాగా బీజేపీ 2017తో (36) పోలిస్తే 3 శాతం ఎక్కువగా 39.1 శాతం ఓట్లు సాధించింది. కాంగ్రెస్‌కు 11.7 శాతంతో సరిపెట్టుకుంది. 2017లో ఆప్, కాంగ్రెస్ చెరో 21 శాతం ఓట్లు సాధించాయి. అంతేకాదు, 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కూడా బీజేపీ ఓట్ల శాతం పెరగ్గా ఆప్‌కు మాత్రం తగ్గడం మరో విశేషం! ఆ ఎన్నికల్లో ఆప్ 54 శాతం ఓట్లతో మొత్తం 70 సీట్లకు గాను ఏకంగా 62 చోట్ల గెలిచింది. బీజేపీ 38.5 శాతం ఓట్లతో మిగతా 8 సీట్లు దక్కించుకుంది.

సిసోడియా, జైన్ ఇలాకాల్లో ఓటమి

ఎంసీడీపై ఆప్ జెండా ఎగిరినా అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన ఆ పార్టీ మంత్రుల ఇలాకాల్లో పరాజయమే ఎదురైంది. ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న మనీశ్ సిసోడియా అసెంబ్లీ నియోజకవర్గమైన పత్పర్‌గంజ్ పరిధిలోని నాలుగు వార్డులకు గాను ఏకంగా మూడింట్లో ఆప్ పరాజయం పాలైంది! అవినీతి ఆరోపణలకు సంబంధించి ఈడీ కేసులో మూణ్నెల్లకు పైగా జైల్లో గడుపుతున్న ఢిల్లీ మరో మంత్రి సత్యేంద్ర జైన్ నియోజకవర్గం శకూర్ బస్తీ పరిధిలోని మూడు వార్డులూ ఆప్ చేజారాయి.

అందరి దృష్టీ మేయర్ ఎన్నికపైనే!

ఎంసీడీ ఎన్నికల్లో గెలిచినా మేయర్ ఎన్నిక విషయంలో ఆప్‌కు బీజేపీ పెద్ద ట్విస్టిచ్చే ఆస్కారం లేకపోలేదు. కేంద్రం చెప్పుచేతల్లో ఉండే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు 12 మంది కౌన్సిలర్లను నియమించే అధికారముంది. ఆయన గనక 12 మందీ బీజేపీ వాళ్లనే నియమిస్తారనుకుంటే మేయర్ ఎన్నిక రసకందాయంలో పడ్డట్టే. వారు మేయర్ ఎన్నికలో భాగస్వాములు అవుతారా, లేదా అన్నదానిపై ప్రస్తుతానికైతే స్పష్టత లేదు. ఒకవేళ వారు పాల్గొనే పక్షంలో ఆప్ మెజారిటీ బాగా తగ్గిపోతుంది. ప్రస్తుతం బీజేపీకి 104 మంది కౌన్సిలర్లున్నారు. 12 నామినేటెడ్ సభ్యులతో కలిపి వారి సంఖ్య 116కు పెరుగుతుంది. అప్పుడు కూడా ఆప్‌కున్న 134 మంది సభ్యులు మేయర్‌ను ఎన్నుకునేందుకు సరిపోతారు. కాకపోతే ఇక్కడా మరో ట్విస్టుంది. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా మేయర్ ఎన్నికకు ఫిరాయింపుల చట్టం వర్తించదు. పార్టీలు విప్ జారీ చేయడానికి కూడా వీల్లేదు. కాంగ్రెస్‌కు 9 మంది కౌన్సిలర్లన్నారు. మరో ముగ్గురు స్వతంత్రులు గెలుపొందారు. వీరితో పాటు ఆప్ నుంచి ఎంతో కొంతమంది గనక బీజేపీ బేరసారాలకు లొంగే పక్షంలో మేయర్ ఎన్నిక హోరాహోరీగా జరగడం ఖాయమని భావిస్తున్నారు. చట్టం ప్రకారం ఢిల్లీ మేయర్‌ను ఏటా ఒకసారి చొప్పున ఐదేళ్లలో ఐదుసార్లు ఎన్నుకోవాల్సి ఉంటుంది. తొలి ఏడాది మహిళకు, మూడో ఏడాది ఎస్సీకి అవకాశమివ్వాలి.

అప్పుడే మాటల యుద్ధం

ఢిల్లీ మేయర్ ఎన్నిక విషయమై బీజేపీ, ఆప్ అప్పుడే మాటల యుద్ధానికి దిగాయి. మేయర్ ఎన్నిక ఇప్పటికైతే 'ఓపెన్ గేమే'నంటూ బీజేపీ ఐటీ విభాగం హెడ్ అమిత్ మాలవీయ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. తమ కౌన్సిలర్లను లాక్కునేందుకు బీజేపీ అప్పుడే మైండ్ గేమ్‌కు తెర తీసిందని సిసోడియా ఆరోపించారు.

ఎంసీడీ.. మరో వేడి!

ఆప్, బీజేపీ మధ్య అధికార పోరుకు కొత్త వేదిక

ఎస్.రాజమహేంద్రారెడ్డి



ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికల ఫలితాలు వచ్చేశాయ్! పదిహేనేళ్ల బీజేపీ అధికారాన్ని కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీపురుతో ఊడ్చేసింది. ఢిల్లీ దేశ రాజధాని మాత్రమే కాదు, ఓ చిన్న రాష్ట్రం కూడా. అక్కడా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి, గెలిచిన పార్టీ నేత సీఎం అవుతాడు. అయితే ఇతర రాష్ట్రాల సీఎంలకున్న అధికారాల్లో కొన్ని ఢిల్లీ సీఎంకు ఉండవు. దేశ రాజధాని కావడంతో ఢిల్లీపై కేంద్ర ప్రభుత్వానికి కొన్ని విశేషాధికారాలు అనివార్యంగా దఖలు పడతాయి. దేశ పాలనకు, విదేశాంగ కార్యకలాపాలకు రాజధాని కీలకం గనుక ఇలా కొన్ని విషయాల్లో కేంద్రం మాట, లేదా అధికారం చెల్లుబాటవడం అనివార్యం, ఆమోదనీయం కూడా. కేంద్రంలో, ఢిల్లీలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే డబుల్ ఇంజన్ పనితీరుకు ఆస్కారముంటుంది. ఏ విషయంలోనూ సమస్యకు చాన్సుండదు. చిక్కల్లా అక్కడో పార్టీ, ఇక్కడో పార్టీ అధికారంలో ఉంటేనే! ఇది ఒక్కోసారి రాజ్యాంగ సంక్షోభానికీ దారి తీస్తుంది. ఢిల్లీలో అధికారంలో ఉన్న కేజ్రీవాల్ ఆప్‌కూ కేంద్రంలో అధికారం చలాయిస్తున్న మోదీ బీజేపీకీ మధ్య ప్రస్తుతం జరుగుతున్నదదే! ఎంసీడీపై పట్టు బిగించడంతో కేజ్రీవాల్ ఇక మరిన్ని అధికారాల కోసం కేంద్రంపై మరింత దూకుడుగా పోరాడే అవకాశముంటుంది. ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీజేపీ కేంద్రం ఏజెంటైన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను కేజ్రీవాల్ ప్రభుత్వంపైకి మరింతగా ఉసిగొల్పే అవకాశం లేకపోలేదు.

ఎల్జీ, సీఎం ఆధిపత్య పోరు

ప్రక్షాళన నినాదంతో చీపురు చేతపట్టి రాజకీయ కదనరంగంలోకి దిగిన కేజ్రీవాల్ 2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ, తర్వాత 2020లోనూ జయభేరి మోగించాడు. ఏడేళ్లుగా కేజ్రీవాల్ సీఎంగా కొనసాగుతున్నాడు. సీఎం అయిన మరుక్షణం నుంచే లెఫ్టినెంట్ గవర్నర్‌తో ఆయన పోరాటానికి తెర తీశాడు. నజీబ్‌జంగ్ నుంచి ప్రస్తుత వినయ్‌కుమార్ సక్సేనా దాకా ఎల్జీగా ఎవరున్నా ఆప్‌ను అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఆ క్రమంలో పలు ఆప్ సంక్షేమ పథకాలను వారు అనుమతించకపోవడం చాలాసార్లు వివాదానికి దారితీసింది. మొహల్లా క్లినిక్‌లు, పాఠశాల అభివృద్ధి వంటి వినూత్న పథకాలను ఎల్జీ అనుమానపు చూపులు వెంటాడాయి. కొన్నింటిపై విచారణకు ఆదేశించే దాకా వెళ్లింది! ఆప్ అగ్రనేతలే లక్ష్యంగా ఎల్జీ పావులు కదిపాడు కూడా. ఆప్ నేతలు కూడా ఎల్జీ అవినీతికి పాల్పడుతున్నాడంటూ విమర్శలు గుప్పించారు. ధర్నాలకూ దిగారు. ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండొద్దని, మంత్రులను లెక్కచేయాల్సిన అవసరం లేదని అధికారులను ప్రోత్సహిస్తున్నాడంటూ ఆరోపించారు. ఎల్జీతో తప్పనిసరి భేటీలకు కూడా కేజ్రీవాల్ దూరంగా ఉన్న సందర్భాలెన్నో! ఎందుకింత వివాదమంటే... ఢిల్లీపై పెత్తనం సీఎందా, ఎల్జీదా అన్నదానిపై స్పష్టత లేకపోవడమే!! ఎల్జీదే పెత్తనమని ఢిల్లీ హైకోర్టు తీర్పిస్తే సుప్రీంకోర్టు దానితో విభేదించింది. ఎన్నికైన ప్రభుత్వం సూచనల మేరకే ఎల్జీ నడుచుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. చివరికి కేంద్రం పార్లమెంటులో బిల్లు ద్వారా ఢిల్లీపై ఎల్జీ పెత్తనాన్ని ఖరారు చేసింది. ఈ పెత్తనాల వివాదం నేపథ్యమే ఎంసీడీ తాజా ఫలితాలను కీలకంగా మార్చేసింది!

ఎంసీడీ... గేమ్ చేంజర్!

రాష్ట్రాలకు సాధారణంగా ఉండే అధికారాలు ఢిల్లీకి పూర్తిగా దఖలు పడలేదు. కీలకమైన పోలీసు, భూ వ్యవహారాల వ్యవస్థ పూర్తిగా ఎల్జీ అధీనంలోనే ఉంటాయి. దేశ రాజధాని గనుక ఎయిమ్స్ వంటి పెద్దాసుపత్రులు, పెద్ద పార్కులు, ఢిల్లీ గుండా వెళ్లే హైవేలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్ వంటివేమో కేంద్రం అధీనంలో ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కీలకమైనవన్నీ కేంద్రం కనుసన్నల్లోనే ఉంటాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జోక్యమూ చేసుకోలేదు. విద్యుత్, జలవనరులు, రవాణా వ్యవస్థతో పాటు ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలు, పార్కురులు, రోడ్ల వంటివి దాని చేతుల్లో ఉంటాయి. ఈ నామమాత్రపు అధికారాలతోనే రాష్ట్ర ప్రభుత్వం పాలన చేయాల్సి ఉంటుంది. అయితే ఎంసీడీకి మాత్రం ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉండే సాధారణ అధికారాలన్నీ ఉంటాయి. అదిప్పుడు ఆప్ వశమవడంతో కార్పొరేషన్ పరిధిలోని అన్ని అంశాలపైనా అధికారాలు కేజ్రీవాల్ సర్కారుకు దఖలు పడతాయి. ఆ లెక్కన కొన్ని అధికారాలు చేతులు మారతాయి. కీలకమైన బిజినెస్ లైసెన్సింగ్ కూడా ఎంసీడీ పరిధిలోనే ఉండటం ఆప్‌కు మరింత పై చేయినిస్తుంది. ఎంసీడీ ద్వారా వీలైనన్ని సంక్షేమ పథకాలను జనాలకు మరింత చేరువ చేసి ఇంకా ప్రజాదరణ పొందే అవకాశం ఆప్‌కు చిక్కుతుంది. ఎల్జీతో పోరాటం కొనసాగిస్తూనే ఢిల్లీపై పట్టు మరింత బిగించడానికి తాజా ఫలితాలు ఆప్‌కు ఉపయోగపడతాయి.

కొసమెరుపు: ఎంసీడీ మేయర్ ఎన్నిక ఆప్, బీజేపీ బల ప్రదర్శనకు వేదికగా మారే అవకాశాలు పుష్కలంగా కన్పిస్తున్నాయి. ఆప్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నా 12 మంది కౌన్సిలర్లను నామినేట్ చేసే అధికారం ఎల్జీకి ఉంది. వారంతా బీజేపీకి చెందినవారే అయ్యే పక్షంలో ఆ పార్టీ బలం ఆ మేరకు పెరుగుతుంది. పైగా ఎమ్మెల్యేల మాదిరిగా కౌన్సిలర్లకు పార్టీ విప్ గానీ అనర్హత నిబంధన గానీ వర్తించవు. కనుక ఆప్‌తో పాటు కాంగ్రెస్, స్వతంత్ర కౌన్సిలర్లతో బీజేపీ బేరసారాలాడటం ఖాయం. అదే జరిగితే మేయర్ ఎవరవుతారన్నది చివరిదాకా సస్పెన్సే. ఆ పరిస్థితుల్లో మేయర్ పదవిని ఆప్ చేజిక్కించుకుంటుందా అన్నది ప్రశ్నార్థకమే! చేజిక్కించుకోలేకపోతే పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుంది!!

వచ్చే ఏడాది వేసవి ఉగ్రరూపం

- ముందస్తుగా వచ్చి పడుతుంది
- వరల్డ్ బ్యాంకు నివేదిక

తిరువనంతపురం: భారత్‌లో వచ్చే ఏడాది వేసవి ఉగ్రరూపం చూపిస్తుందని వరల్డ్ బ్యాంకు నివేదిక అంచనా వేసింది. ముందస్తుగా వేసవి కాలం రావడంతో పాటు వడగాడ్పులు ఎక్కువ రోజులు కొనసాగి ప్రమాదకరంగా మారుతాయని తెలిపింది. ప్రపంచంలో వేసవి తీవ్రత అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలుస్తుందని, మానవ మనుగడకే ముప్పుగా మారుతుందని హెచ్చరించింది. గత కొన్ని దశాబ్దాలుగా ప్రతీ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడం, వడగాడ్పులకు వేలాది మంది మృత్యువాత పడుతున్న విషయాన్ని ఆ నివేదిక గుర్తు చేసింది. 'క్లైమేట్ ఇన్వెస్ట్‌మెంట్ ఆపర్చునిటీస్ ఇన్ ఇండియాస్ కూలింగ్ సెక్టార్' అన్న పేరుతో వరల్డ్ బ్యాంక్ ఒక నివేదికను రూపొందించింది. కేరళ ప్రభుత్వ భాగస్వామ్యంతో తిరువనంతపురంలో వరల్డ్ బ్యాంకు రెండు రోజులు నిర్వహించనున్న భారత వాతావరణం మరియు అభివృద్ధి భాగస్వామ్యుల సదస్సులో ఈ నివేదికను విడుదల చేయనుంది. ఈ సారి వేసవి ముందస్తుగా రావడంతో పాటు , ఎక్కువ కాలం కొనసాగుతుందని, ప్రజల ఆయుష్షు పరిమితిని తగ్గించే అవకాశం ఉందని, ఆర్థికంగా సైతం తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరించింది. భారత్‌లో పని చేసే వర్గంలో 75% మంది అంటే దాదాపుగా 38 కోట్లమంది మండుటెండల్లో చెమటోడుస్తూ పని చేస్తారని, వారందరి ప్రాణాలకు వడగాడ్పులు ముప్పుగా మారుతాయని నివేదిక వెల్లడించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా వడగాడ్పుల వల్ల 8 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోతే, వారిలో 3.4 కోట్ల మంది భారత్‌లో ఉంటారని బ్యాంక్ అంచనా వేసింది. భారత్‌లో ఏసీలు, ఎయిర్ కూలర్లు వ్యాపారాలకు మంచి డిమాండ్ ఉంటుందని వివరించింది.

గుజరాత్, హిమాచల్ ఫలితాలు నేడే

అహ్మదాబాద్, సిమ్లా: గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గుజరాత్‌లో 182 అసెంబ్లీ స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లో 68 స్థానాలతో పాటు యూపీలోని మెయిన్‌పురి లోక్‌సభ స్థానం, అయిదు రాష్ట్రాల్లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. 11 గంటలకు ఫలితాలపై ఒక అంచనా వస్తుంది. గుజరాత్‌లో 37 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, హిమాచల్‌లో 68 ఏర్పాటు చేశారు. గుజరాత్‌లో వరసగా ఏడోసారి అధికారాన్ని చేపట్టాలని తహతహలాడుతున్న కమలదళంలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు హుషారుని నింపాయి. ఇవే కాకుండా ఉత్తరప్రదేశ్‌లో రెండు అసెంబ్లీ స్థానాలు, ఒడిశా, రాజస్థాన్, బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఒక్కో అసెంబ్లీ స్థానం ఫలితాలు కూడా వెలువడనున్నాయి.

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లలో కొత్త రికార్డులు నెలకొల్పాలని కమలనాథులు తహతహలాడుతున్నారు. గుజరాత్‌లో బీజేపీ విజయం సాధిస్తే వరసగా ఏడోసారి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించిన పశ్చిమబెంగాల్‌లో సీపీఎం రికార్డుతో సమం అవుతుంది.

ప్రపంచానికి భారత్ మార్గనిర్దేశం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: 75వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకుంటున్న నేటి అమృత కాలంలో ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే విషయంలో భారత్ కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తొలిరోజు బుధవారం ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సభలో మోదీ మాట్లాడారు. రెండు చరిత్రాత్మక ఘట్టాలకు మన దేశం సాక్షిగా నిలుస్తున్న సమయంలో జగదీప్ ధన్‌ఖడ్ ఈ బాధ్యతలు చేపట్టారని అన్నారు. శక్తివంతమైన జీ-20 కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోందని, అలాగే అమృత కాలంలోకి మన ప్రయాణం ప్రారంభించామని చెప్పారు. ఈ అమృత కాలం దేశ అభివృద్ధి, కీర్తిప్రతిష్టలపై మనమంతా దృష్టిపెట్టాల్సిన సందర్భమని పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో దేశ ప్రజాస్వామ్యం ,పార్లమెంట్, పార్లమెంట్ సంప్రదాయాల పాత్ర చాలా కీలకమని ఉద్ఘాటించారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌పై ప్రధాని ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనలో ఒక జవాన్, ఒక కిసాన్ లక్షణాలు ఉన్నాయని చెప్పారు. అచ్చమైన రైతు బిడ్డ అయిన ఉపరాష్ట్రపతి సైనిక్ స్కూల్‌లో చదువుకున్నారని గుర్తుచేశారు. అందుకే ఆయనకు రైతులతో పాటు సైనికులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత ఎగువ సభపై ఉందని మోదీ చెప్పారు.

ఈ సమావేశాలను ఫలవంతం చేద్దాం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలను ఫలవంతంగా మార్చడానికి అన్ని పార్టీల సభ్యులు సహకరించాలని, కలిసికట్టుగా పనిచేయాలని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. శీతాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి విషయంలో దేశాన్ని ఉన్నత స్థాయికి చేర్చడానికి కీలకమైన నిర్ణయాలను ఈ శీతాకాల సమావేశాల్లో తీసుకుంటామన్న నమ్మకం ఉందని వివరించారు. లోక్‌సభకు తొలిసారిగా ఎంపికైనవారికి సభలో చర్చల్లో పాల్గొనే అవకాశాలు ఎక్కువగా ఇవ్వాలని అన్ని పార్టీలకు ప్రధాని సూచించారు. ప్రజాస్వామ్యంలో కొత్త తరాన్ని సిద్ధం చేయడానికి, వారి ఉజ్వలమైన భవిష్యత్తు కోసం నూతన ఎంపీలకు మాట్లాడే అవకాశం ఇద్దామని అన్నారు. జగదీప్ ధన్‌ఖడ్‌కు మోదీ అభినందనలు తెలియజేశారు.



కృష్ణ, ములాయం సింగ్‌కు లోక్‌సభ ఘన నివాళి

తెలుగు సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ, సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయంసింగ్ యాదవ్‌తోపాటు ఇటీవల మరణించిన మరో ఎనిమిది మంది మాజీ ఎంపీలకు లోక్‌సభ ఘనంగా నివాళులు అర్పించింది. బుధవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన అనంతరం స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా సంతాపం తెలిపారు. ప్రజాజీవితంలో మాజీ ఎంపీలు చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా తెలుగు సినిమా రంగంలో కృష్ణ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ములాయంసింగ్ యాదవ్ ఏకంగా ఏడుసార్లు ఎంపీగా, రక్షణ శాఖ మంత్రిగా, మూడు పర్యాయాలు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని ఓం బిర్లా ప్రశంసించారు. మాజీ ఎంపీల మృతికి సంతాపంగా లోక్‌సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.

ఉమ్మడి వ్యూహంపై విపక్షాల చర్చ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం నిర్వహించిన ప్రతిపక్షాల సమావేశానికి వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో విపక్షాలు అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై నాయకులు చర్చించారు.


బ్రిటన్‌లోని లూటన్ పట్టణంలో కొత్తగా నిర్మించిన 'గురు నానక్ గురుద్వారా'ను ప్రారంభించాక తలపాగా ధరించి నేలపై కూర్చున్న బ్రిటన్ రాజు చార్లెస్. తూర్పు ఇంగ్లండ్‌లోని బెడ్‌ఫోర్డ్‌షైర్‌లో రాజు హోదాలో ఆయన పర్యటించడం ఇదే తొలిసారి.

సాక్షి
విజయనగరం
గురువారం । 8 । డిసెంబర్ । 2022



సాయుధ దళాల సేవలు నిరుపమానం

సాయుధ దళాలు దేశానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కొనియాడారు. - 8లో



సీఎం కప్ క్రికెట్ టోర్నీ విజేత విశాఖ

ఏపీ సీఎం ప్రైజ్‌మనీ కప్ క్రికెట్ టోర్నమెంట్-2022 జోనల్ స్థాయి విజేతగా విశాఖ జిల్లా జట్టు నిలిచింది. - 8లో

కొత్త బాధ్యతలు



విజయనగరం క్రైమ్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారిగా ఎ.సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు అవినీతి నిరోధక శాఖలో ఏఎస్పీగా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. విజయనగరం, శ్రీకాకుళం రీజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, డీఈ సత్యనారాయణ, ఏజీ సురేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, సింహాచలం తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గంట్యాడ: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని పెదవేమలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన కిలపర్తి దేముడు, పొటుపు రెడ్డి భారతి, జి.లక్ష్మీప్రసన్న ఎంపిక య్యారు. ఈ నెల 9 నుంచి 11 వరకు కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయలు బుధవారం అభినందించారు.

నేడు స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం నిర్వహిస్తామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలుగోలు టు విజయవాడ

- కాలినడకన కనకదుర్గమ్మ సన్నిధికి..



అలుగోలు నుంచి పాదయాత్రగా వెళ్తున్న భవానీ భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామం నుంచి భవానీ భక్తులు నుడగల మహాలక్ష్మినాయుడు, శనపతి సన్యాసిరావు, అంబళ్ల అప్పలనాయుడు కాలినడకన విజయవాడలోని కనదుర్గమ్మ సన్నిధికి బుధవారం బయలుదేరారు. గురుస్వాములు కురిమినేని నారాయణరావు, ఆల్తి లక్ష్మణరావు ఆశీస్సులు తీసుకొని ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 480 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి అమ్మవారిని దర్శించుకుంటామని భక్తులు తెలిపారు. రోజుకు 50 కిలోమీటర్ల మేర యాత్ర సాగుతుందని.. హిందూ ధర్మ పరిరక్షణకు పాదయాత్రగా పయనమయ్యామని చెప్పారు.

రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా అప్పలనర్సమ్మ




నూతనంగా ఎన్నికైన నాయీబ్రాహ్మణ కార్యవర్గం

విజయనగరం పూల్‌బాగ్: ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక మంగళవారం విజయవాడలో జరిగింది. విజయనగరం జిల్లాకు చెందిన కాసారపు అప్పలనర్సమ్మను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిగా కొవ్వాడ అర్జున్, రాష్ట్ర కార్యదర్శిగా పట్నాన అప్పన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని జిల్లా నాయకులు స్థానిక సంఘం కార్యాలయంలో బుధవారం అభినందించారు.

9న వైద్యాధికారి పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారి పోస్టులు-2, టెలీహబ్‌లో-2, ఎన్‌ఆర్సీ-1, ఎన్‌బీఎస్‌యూలో-3, ఆర్‌బీఎస్‌కేలో 2 వైద్యుల పోస్టులకు ఈనెల 9వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయిన అభ్యర్థులు మాత్రమే పోస్టులకు అర్హులని పేర్కొన్నారు.

తాటిపూడి అందాలు అదరహో..



కొండల నడుమ నీటి సవ్వడి

నిండుకుండలా తాటిపూడి జలాశయం

మూడు వైపులా పచ్చని చెట్లతో కనుచూపు మేర విస్తరించిన కొండలు... వాటి నడుమ నిండుకుండలా కనిపించే తాటిపూడి జలాశయం.. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. గంట్యాడ మండలంలోని జలాశయ ప్రకృతి అందాలు చూపరుల మనస్సును హత్తుకుంటున్నాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



జలాశయాన్ని తిలకిస్తూ...



జలాశయం వద్ద పర్యాటకుల సందడి

మీ భూమికి... శాశ్వత రక్ష

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమంతో సదవకాశం
- జీవితకాల భూ సమస్యలకు సమగ్ర భూసర్వేతో చెక్
- అపోహలు వీడి ప్రతి రైతూ భాగస్వామ్యం కావాలి
- తొలి విడత 179 గ్రామాల్లో రీసర్వే పూర్తి
- 27 మండలాల పరిధిలో దాదాపు 2 లక్షల భూహక్కు పత్రాలు పంపిణీకి సిద్ధం
- తొలి దశలో 24 మండలాలకు చెందిన 11 వేల మంది రైతుల భూములకు వెబ్‌ల్యాండ్‌లో చోటు
- రెండో విడత ప్రక్రియకు అధికారుల సన్నద్ధం

నాడు: యజమానులకు తెలియకుండానే వారి భూమి వివరాలు వేరేవారి రికార్డుల్లోకి చేరిపోయేవి. ఎప్పటికప్పుడు రికార్డులు తారుమారయ్యేవి. తరతరాలుగా భూమి వారి అనుభవంలో ఉన్నా హఠాత్తుగా నిషేధిత జాబితా(22ఏ)లో చేరిపోయేవి. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరూ ఇద్దరూ కాదు కొన్ని వేల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి విదితమే. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన 3,648 కిమీ ప్రజా సంకల్ప పాదయాత్రలో వారి కష్టాలు స్వయంగా చూశారు.

నేడు: భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నడుంబిగించింది. అదో తలనొప్పి వ్యవహారమని గత ప్రభుత్వాలు దాన్ని ముట్టుకోవడానికే సాహసించని వైనం. కానీ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని తలకెత్తుకుంది. అన్ని భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేయిస్తోంది. శాశ్వత రక్షణ కల్పించేలా హక్కు పత్రాల మంజూరు చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వందేళ్ల నుంచి వీడని భూ సమస్యలకు సమగ్ర భూ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. భూములను రీ సర్వే చేయిస్తోంది. జిల్లాలో తొలివిడత రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది. ఇప్పటివరకు 24 మండలాల్లోని 179 గ్రామాల్లో సజావుగా పూర్తి అయ్యింది. సుమారు 11 వేల మందికి వెబ్ ల్యాండ్‌లో చోటుదక్కింది. తద్వారా వారి భూమిపై వారికి సర్వ హక్కులూ లభించాయి. ఇంతటి మహత్తరమైన ప్రక్రియను కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టరు మయూర్ అశోక్ నేతృత్వంలో రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డుల విభాగాల అధికారులు, సిబ్బంది కొన్ని నెలలుగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నాయి. కొంతమంది రైతులు, భూయజమానులు అపోహలతో వారికి పూర్తి స్థాయిలో సహకారం అందించట్లేదు. వారికి అవగాహన కల్పించడానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

సమగ్ర రీ సర్వే అవసరమే...

'అసలు సమగ్ర రీసర్వే అవసరం ఉందా? ఒకవేళ అవసరమే అయితే కారణాలేమిటి?' ఇదీ ఇటీవల క్షేత్రస్థాయి సిబ్బందికి జరిగిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి వేసిన ప్రశ్నకు అవసరమే అని వారంతా ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. ఎందుకంటే... ఎన్నో ఏళ్ల నుంచి పాత రికార్డుల ఆధారంగానే రిజిస్ట్రేషన్లు, ఇతర ప్రక్రియలు సాగుతున్నాయి. అందువల్ల తప్పులు దొర్లుతున్నాయి. అదే సర్వే చేస్తే... ప్రధానంగా రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు సర్వేతో పరిష్కారం లభిస్తుంది. ఒకప్పటిలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. చలానాలు కట్టాల్సిన అవసరం లేదు. డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండదు. ఒక్క మాటలో చెప్పాలంటే పైసా ఖర్చు లేకుండా తమ ఆస్తికి సర్వ హక్కులూ పొందవచ్చు. సాగుచేసుకుంటున్న పొలాలతో పాటు జిల్లాలో 4 లక్షల ఖాతాలకు సంబంధించిన గ్రామ కంఠాలకు, సాదా బై నామా ద్వారా జరిగిన లావాదేవీలకు కూడా సంపూర్ణ హక్కులు లభిస్తాయి. వారసత్వంగా వచ్చిన భూములకు కుటుంబసభ్యుల సమక్షంలోనే చిటికెలో పరిష్కారం లభిస్తుంది. అంతేకాదు సరిహద్దు గొడవలు, పంపకాల చిక్కులు తొలగిపోతాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే ఈ సర్వే వల్ల భూములకు సంబంధించి ప్రత్యేక ఎల్‌పీఎం నంబరు ద్వారా అన్ని వివరాలు క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తమై ఉంటాయి. దీంతో భవిష్యత్‌లో ఇతరులెవరూ సంబంధిత రైతుల అనుమతి లేకుండా పేర్లు గానీ, సరిహద్దులు గానీ మార్చలేరు. చివరికి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు కూడా ఓటీపీ వస్తే గానీ ప్రక్రియ పూర్తికాదు. అత్యంత కచ్చితత్వం, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ 20వేల సర్వే రాళ్లను రైతుల భూముల సరిహద్దుల్లో ఇప్పటికే ఏర్పాటుచేయడం విశేషం.



పూసపాటిరేగ మండలం పోరాంలో రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు (ఫైల్)



బొండపల్లి మండలం తమటాం గ్రామంలో తొలి విడత రీసర్వే ప్రక్రియను డ్రోన్‌తో ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు (ఫైల్)

మరి రైతులు ఏమిచేయాలి?

రీ-సర్వే ప్రక్రియ నిర్ణీత కాలంలో సజావుగా సాగేందుకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలి. తమ ఆధార్ కార్డు, భూమి ఖాతా నంబర్, ఫొటో, ఇతర ప్రాథమిక వివరాలు అందించాలి. ఒకవేళ ఎవరైనా సర్వే సమయంలో అందుబాటులో లేకపోతే తమ బంధువులు, స్నేహితులను పంపించి సర్వే చేయించుకోవాలి. ఇలా రీ-సర్వే జరిగిన భూమిపై ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు. దగ్గరుండి సమస్యను పరిష్కరిస్తారు. నిబంధనల ప్రకారం రీ-సర్వే జరిగే గ్రామంలో ముందుగా ఫాం-10ను అనుసరించి చాటింపు వేస్తారు. ఫాం-19ను అనుసరించడం ద్వారా వ్యక్తిగత సమాచారం అందిస్తారు. 9(2) ద్వారా సర్వే ప్రక్రియ ముగిస్తారు. ఒకవేళ రైతుకు ఈ దశలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే 10(1) ప్రకారం అప్పీల్‌కు వెళ్లొచ్చు. రైతుల ఫిర్యాదును పరిశీలించిన ఉన్నతాధికారులు మండల స్థాయి మొబైల్ మేజిస్ట్రేట్ అధికారులను పంపించి మళ్లీ సర్వే చేయిస్తారు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే ఆర్‌ఓఆర్ నిబంధనల మేరకు ఆర్డీఓ కోర్టులో సంప్రదించవచ్చు.

త్వరలోనే భూహక్కు పత్రాల పంపిణీ...

సమగ్ర భూసర్వే ప్రక్రియ మొదటి విడత విజయవంతంగా ముగిసింది. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 24 మండలాల్లో రీ-సర్వే పూర్తయింది. 179 గ్రామాల్లోని 11వేల మంది రైతులకు త్వరలోనే సంబంధిత భూహక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో మరో 150 గ్రామాల్లో రెండో విడత సర్వే చేసేందుకు సన్నద్ధమవుతోంది. డిసెంబర్ ముగిసే నాటికి 75 గ్రామాల్లో, ఫిబ్రవరి ముగిసే నాటికి మరో 75 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలనేది లక్ష్యం.

రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి...



భూముల సర్వేకు సంబంధించి వందేళ్ల తర్వాత వచ్చిన సువర్ణావకాశం ఇది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అధికారులు, సిబ్బంది రైతుల పొలాల వద్దకే వచ్చి సర్వే చేస్తున్నారు. ఒక్కరోజు సమయం వెచ్చిస్తే జీవితకాల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ అవకాశాన్ని వదులుకుంటే భవిష్యత్‌లో మరలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే అందుబాటులో ఉండి సమగ్ర భూ సర్వే పూర్తి చేయించుకోవాలి. అధికారులకు, సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలి.

– ఎ.సూర్యకుమారి, కలెక్టర్, విజయనగరం జిల్లా

నిధుల సద్వినియోగంతో పంచాయతీల అభివృద్ధి

- జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్



రేగిడి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

రేగిడి: నిధులు సద్వినియోగంతో పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు మంజూరైన ప్రతీ పైసా చాలా విలువైనదని, ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. పంచాయతీల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, ఈఓపీఆర్డీ ఎ.నాగభూషణరావు పాల్గొన్నారు.

హుషారుగా త్రోబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు



ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ త్రోబాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-14, 17 విభాగాల్లో జరిగిన ఎంపిక పోటీలను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యశేఖర్ ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన 350 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపిక పోటీలను పర్యవేక్షించారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు జి.లక్ష్మణరావు, డాక్టర్ పి.శ్రీరాములు తెలిపారు.

పాతదుగ్గిలో గజరాజుల సంచారం



పాత దుగ్గిలోని టమాటా తోటలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ:

మండల వాసులను గజరాజుల భయం వీడ డం లేదు. పాత దుగ్గి సమీపంలో ఏడు గజరాజుల గుంపు బుధవారం తిష్టవేసింది. దుగ్గి, కళ్లికోట, ఆర్తాం, గారవలస తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

చిన్నబగ్గ టేకు ప్లాంటేషన్‌లో..

సీతంపేట/భామిని: సీతంపేట మండలంలోని చిన్న బగ్గ టేకు ప్లాంటేషన్‌లో తిష్టవేసిన ఏనుగుల జంట భామిని మండలంలోని పసుకుడి-భామిని గ్రామాల మధ్య పంటపొలాల్లోకి బుధవారం సాయంత్రం చేరుకుంది. వంశధార నది ఆవల ఉన్న ఒడిశా గిరిజనులు ఏనుగులను వెంట బెట్టడంతో తిరికి ఆంధ్రా సరిహద్దుకు చేరుకున్నాయి. పంట పొలాల్లో సంచరిస్తుండడం, పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అటవీ శాఖ సిబ్బంది ఏనుగుల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

బీసీ మహాసభలో మన నేతలు

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం జరిగిన జయహో బీసీ మహాసభలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సభను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.



సీఎం జగన్‌మోహన్ రెడ్డితో కలిసి బీసీల ఐక్యనినాదం వినిపిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు









సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అభివాదం చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వేదికపైన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

క్లుప్తంగా

9న సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌జిల్లా జట్ల ఎంపిక

బొబ్బిలి: సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ఈనెల 9న పారాది జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎల్‌వీ రమణ, పీడీ ఎన్. వెంకటనాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఈ ఎంపిక 12వ తేదీన జరుగుతుందని ప్రకటించారని, కానీ జిల్లా జట్ల ఎంపిక ప్రీపోన్ చేశారని వివరించారు. అండర్14, అండర్ 17 జట్లను ఎంపిక చేస్తారని విద్యార్థులు, అభ్యర్థులు గమనించాలని కోరారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు జరజాపుపేట వాసి


కాళ్ల శంకరరావు

నెల్లిమర్ల: అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన కాళ్ల శంకరరావు ఎంపికయ్యారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని సిమ్లాలో వచ్చే నెలలో జరిగే సివిల్ సర్వీస్ ఉద్యోగుల జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున శంకరరావు పాల్గొంటారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆయనను నిర్వాహకులు ఎంపికచేశారు. శంకరరావు దత్తిరాజేరు మండలం గడసాం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనను నెల్లిమర్ల కబడ్డీ కోచ్ బి.రామారావు, జరజాపుపేట పెద్దలు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

జాతీయస్థాయి కుస్తీపోటీలకు విద్యార్థుల ఎంపిక


విజేతలను అభినందిస్తున్న ఆర్‌ఐఓ, డీవీఈఓ తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 4,5 తేదీల్లో చిత్తూరు జిల్లా రేణిగుంటలో రాష్ట్రస్థాయిలో జరిగిన అండర్ 19 కుస్తీ పోటీల్లో శ్రీ రామ్ జూనియర్ కాలేజీ(గరివిడి) విద్యార్థులు వి లావణ్య, వి మురళీకృష్ణ బంగారుపతం, అలాగే శ్రీనివాసజూనియర్‌కాలేజీ (చీపురుపల్లి) విద్యార్థులు బి.సుభద్ర, లోకేష్ కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 18న హర్యానాలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో వారు తలపడనున్నారు. క్రీడల్లో రాణిస్తున్న ఈ విద్యార్థులను ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ, డీవీఈఓ ఆర్.సురేష్‌బాబు, శ్రీరామ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ, టీం మేనేజర్ బి.శ్రీనివాసరావులు ఆర్‌ఐఓ కార్యాలయంలో బుధవారం అభినందించారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత


బ్యాగ్‌ను అప్పగిస్తున్న రైల్వే సిబ్బంది

పార్వతీపురంటౌన్: విశాఖలోని గోపాలపట్నం నుంచి సీతానగరం వచ్చిన శంబంగి భాగ్యలక్ష్మి రైల్లో మరిచిపోయిన బ్యాగ్‌ను ఆర్పీఎఫ్, రైల్వే సిబ్బంది ఆమెకు బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాయపూర్ పాసింజర్‌లో భాగ్యలక్ష్మి బ్యాగ్ మరిచిపోయిందని సీతానగరం స్టేషన్ నుంచి అందుకున్న సమాచారం మేరకు ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేశామన్నారు. వెంటనే స్పందించిన ఆర్పీఎఫ్ సిబ్బంది రైలులో తనిఖీ నిర్వహించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని అప్పగించినట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌లో రూ.లక్ష విలువచేసే ఒకటిన్నర తులాల బంగారం చైను, రూ.3వేలు విలువచేసే వస్తువులు ఉన్నట్లు తెలిపారు. బ్యాగ్‌ను అప్పగించడంతో రైల్వేసిబ్బందికి భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.



సాయుధ దళాల సేవలు నిరుపమానం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- విరివిగా విరాళాలు ఇవ్వాలని పిలుపు


నిధికి విరాళం ఇస్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: సాయుధ దళాలు దేశానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కొనియాడారు. వారి త్యాగాలు అమోఘమని పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పతాక నిధి ఫ్లాగ్‌ను జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మంచు కొండల్లో, పర్వతాల్లో, ఎడారుల్లో, సముద్రంలో ఎంతో ప్రతికూల వాతావరణం మధ్య సాయుధ దళాలు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా అనుక్షణం పహారా కాస్తూ దేశాన్ని రక్షిస్తున్నాయన్నారు. వారి త్యాగాల ఫలితంగానే మనమంతా దేశంలో ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని చెప్పారు. సాహసోపేత వీరజవాన్లకు వందనం సమర్పించేందుకు వారి కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చి వారి త్యాగాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు.

విరాళాలకు పన్ను మినహాయింపు

జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ పతాక దినోత్సవ నిధికి ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు కూడా ఉందని తెలిపారు. సైనికుల సమక్షేమానికి పెద్ద ఎత్తున విరాళాలను అందించాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమాధిరి ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా 0020931కు గానీ డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరుమీద చెక్కు లేదా డ్రాఫ్ట్ ద్వారా కూడా తమకు విరాళాలను అందజేయవచ్చని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కెప్టెన్ ఎం.సత్యవతి, కెప్టెన్ ఎ.కల్యాణ అశోక్, లెఫ్టినెంట్ వి.సన్యాసినాయుడు, హవాల్దార్ మహబూబ్ కన్నాట్, మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు, పలువురు విశ్రాంత సైనిక యోధులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

సీఎం కప్ క్రికెట్ టోర్నీ విజేత విశాఖ

- రన్నరప్‌గా నిలిచిన విజయనగరం
- ముగిసిన జోనల్ లెవెల్ టోర్నీ


విజేతగా నిలిచిన విశాఖ జట్టు

విజయనగరం రూరల్: ఏపీ సీఎం ప్రైజ్‌మనీ కప్ క్రికెట్ టోర్నమెంట్–2022 జోనల్ స్థాయి విజేతగా విశాఖ జిల్లా జట్టు నిలిచింది. విజయనగరం జిల్లా కేంద్రం శివారు విజ్జి స్టేడియంలో విజయనగరం, విశాఖ జిల్లా జట్ల మధ్య బుధవారం ఉత్కంఠభరితంగా జరిగిన తుదిపోరులో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. ఇరుజట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో ముందుగా టాస్ గెలిచిన విజయనగరం జట్టు బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 110 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం 111 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 104 పరుగులు మాత్రమే సాధించి 6 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మిడిల్ ఓవర్లలో ఒత్తిడికి గురైన విజయనగరం జట్టు బ్యాటర్లు వరుసగా వికెట్లు సమర్పించి ఓటమి పాలయ్యారు. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ జె.దుర్గాకుమార్ చివరి వరకు నిలిచి భారీ ఇన్నింగ్స్ ఆడినా జట్టును ఓటమి నుంచి తప్పించలేకపోయాడు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ సీఎం ప్రైజ్‌మనీ కప్ జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీలో విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు జిల్లా జట్లు పాల్గొన్నాయని, జోనల్ స్థాయిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన విశాఖ, విజయనగరం జట్లు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించాయని చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. విజయం సాధించిన ఇరు జట్లకు ట్రోఫీలు అందజేశారు. అంపైర్లుగా లక్ష్మణ్, అశోక్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో పీఈటీలు వీసీహెచ్.ఆర్.ఎస్.ప్రసాద్, జి.రవికుమార్, పి.లీలాకృష్ణ, బి.జగన్‌మోహన్‌రావు, పీసీ స్వరూప్, తవిటినాయుడు, కేవీఎస్ రాజు, గురునాయుడులు పాల్గొన్నారు.


రన్నరప్ విజయనగరం జట్టు

మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠినచర్యలు

- జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి వరహాలు


బందలుప్పిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శిశుసంక్షేమాధికారి వరహాలు

పార్వతీపురం: పని ప్రదేశాలలో మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిణి జి. వరహాలు హెచ్చరించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని బందలుప్పి, డి.కె.పట్నం గ్రామాలలో పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల, నివారణ, నిషేధం, సంస్కరణలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ లింగభేదం లేకుండా అందరికీ సమాన హక్కులు భారత రాజ్యాంగం కల్పించిదని, పని ప్రదేశాలలో మహిళలను వేధించకూడదని, వారిపై వేధింపులకు పాల్పడితే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనిప్రదేశాలలో మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. పురుషులతో పాటు స్త్రీలకు సమానవేతనం ఇవ్వాలన్నారు. పని ప్రదేశాలలో మహిళలు లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు, పనిప్రదేశాలలో వేధించపుల నిరోధక చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఎవరైనా మహిళలపట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్లు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్యపరీక్షలు

- సర్వజన ఆస్పత్రిలో అన్ని రకాల రోగాల నిర్ధారణ
- రోజుకి 600 నుంచి 650 మందికి పరీక్షలు
- 24 గంటల పాటు సేవలు


పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్


ల్యాబొరేటరీలో వైద్య పరీక్షల వివరాలు నమోదు చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలన్నీ ఇక్కడే చేస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైద్య పరీక్షలకు సంబంధించి అన్ని వసతులు ల్యాబొరేటరీల్లో సమకూర్చింది. అదేవిధంగా సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించింది. దీని వల్ల ల్యాబొరేటరీ సేవలు 24 గంటల పాటు అందుబాటులోకి వచ్చాయి.

రోజుకు 600 నుంచి 650 మందికి వైద్యపరీక్షలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా జిల్లా కేంద్రాస్పత్రి మారిన తర్వాత రోగుల సంఖ్య గతం కంటే గణనీయంగా పెరిగింది. ల్యాబొరేటరీకి గతంలో రోజుకు 150 నుంచి 200 మంది రోగులు వైద్య పరీక్షలకు వచ్చేవారు. ఇప్పుడు 600 నుంచి 650 మంది వస్తున్నారు.

45 రకాల పరీక్షలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న ల్యాబొరేటరీలో 45 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ల్యాబొరేటరీకి వైద్య సిబ్బంది, పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో 24 గంటల పాటు ల్యాబొరేటరీ సేవలు అందుతున్నాయి. ల్యాబొరేటరీలో వైద్య పరీక్షలు చేసిన వారికి గతంలో మధ్యాహ్నం 2 గంటలకు లేదా మరునాడు రిపోర్టులు ఇచ్చేవారు. ప్రస్తుతం రక్తనమూనాలు తీసిన గంట, గంటన్నరకే రిపోర్టులు ఇస్తున్నారు.


పరీక్షల వివరాలు తెలిపే బ్యానర్

ల్యాబొరేటరీలో అన్ని రకాల పరీక్షలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చిన రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. ప్రతిరోజూ రోగులు అధిక సంఖ్యలో ల్యాబరేటరీకి వస్తున్నారు. గతంలో కంటే వేగంగా మెడికల్ రిపోర్టులు ఇస్తున్నాం.

దాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 545.00
విజయనగరం	రూ. 549.00
శ్రీకాకుళం	రూ. 549.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	53,780–00
బంగారం(22సి. 10గ్రా.)	49,300–00
వెండి (కిలో)	70,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

51,417 టన్నుల చెరకు క్రషింగ్

- రూ.3.81 కోట్ల చెల్లింపులు
- సుగర్ కేన్ డీసీ సత్యనారాయణ


మాట్లాడుతున్న డిప్యూటీ కేన్ కమిషనర్ జీవీవీ సత్యనారాయణ

బొబ్బిలి: జిల్లాలోని సంకిలి ఈఐడీ ప్యారీ, ఎన్‌సీఎస్, భీమసింగి చక్కెర కర్మాగారాల పరిధిలో నేటి వరకూ 51,417 టన్నుల చెరకును క్రషింగ్ చేశారని బొబ్బిలి సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్ జీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు ఫ్యాక్టరీల పరిధిలో నవంబర్ 25 నాటికి రైతుల వ్యక్తిగత ఖాతాల్లో రూ.3.81కోట్లు జమ చేసినట్లు చెప్పారు. క్రషింగ్ జరిగిన మేరకు ఎన్‌సీఎస్ పరిధిలో 10,128 టన్నులు, భీమసింగి పరిధిలో 286 టన్నుల చెరకు ఉందన్నారు.మిగిలిన చెరకు సంకిలి ఫ్యాక్టరీ జోన్ పరిధిలోనిదని చెప్పారు. ప్రతి రైతు అగ్రిమెంట్ చేసుకోవాలని, దళారులను ఆశ్రయించవద్దని హితవు పలికారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రికవరీ శాతం పెరిగిందని, ఈ ఏడాది సంకిలి సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 4.20 లక్షల టన్నులు, ఎన్‌సీఎస్ పరిధిలో లక్షా 20వేల టన్నులు, భీమసింగి పరిధిలో 18వేల టన్నులు క్రషింగ్ చేస్తారని వివరించారు. రైతులు తమ పరిధిలోని చెరకును నేరుగా వాహనం పెట్టుకుని తరలిస్తే పాస్‌లు జారీ చేస్తామని స్పష్టం చేశారు. వారికి కటింగ్ ఆర్డర్లు ఇప్పిస్తామన్నారు.

నిబంధనలు పాటించండి


బొబ్బిలి రోడ్డులో వాహన తనిఖీలు చేపడుతున్న సీఐ తదితరులు

రాజాం సిటీ: వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ కె.రవికుమార్ అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం రాత్రి బొబ్బిలి రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదని, అలా తనిఖీల్లో పట్టుబడితే కఠినంగా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.

అంతర్ వర్సిటీ పోటీలకు ఎస్.కోట విద్యార్థులు


అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శృంగవరపుకోట: ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈనెల 5వ తేదీన నిర్వహించిన ఆంధ్రాయూనివర్సిటీ అంతర్ కళాశాలల ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న స్థానిక వరలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు ఎస్.సాంబశివరావు, ఐ.కృష్ణసాయికిరణ్‌కుమార్ నాయుడులు పాల్గొని ఏయూ జట్టుకు అర్హత సాధించారు. వీరిద్దరూ ఈనెల 23వ తేదీ నుంచి పంజాబ్‌లో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరఫున పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ చెప్పారు. వరలక్ష్మి కళాశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.వరలక్ష్మి, పి.రాజేంద్రప్రసాద్, డీవీఎల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.రమేష్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ భార్గవ్‌రామ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

10న బహుజన కళామండలి మహాసభ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బొబ్బిలి రూరల్: విజయవాడ మాకినీడు బసవ ఉన్నయ్య విజ్ఞాన కేంద్రంలోని కలేకూరి ప్రసాద్ ప్రాంగణం వద్ద ఈనెల 10న బహుజన కళామండలి మహాసభలు నిర్వహించనున్నట్లు మండలి నాయకుడు ఉదయ్ భాస్కర్ తెలిపారు. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మహాసభలను విజయవంతం చేయండి కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు బొద్దాన అప్పారావు, డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గర్భాపు రమేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగకు చెందిన వృద్ధుడు ఆవాల గోపి (67) రెండేళ్లగా ఇబ్బంది పెడుతున్న కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కడుపునొప్పికి నాటువైద్యం చేయించుకుంటున్న వృద్ధుడు మరో పక్క మద్యానికి బానిసయ్యాడు. సిటీ బస్టాండ్‌లో కలాసీగా విధులు నిర్వహిస్తున్న గోపీ కడుపు నొప్పి భరించలేక ఈ నెల 4వ తేదీన పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 10 గంటలకు మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ప్రసన్న కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..


మధుసూదన రావు(ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని సీతయ్యపేటకు చెందిన యాళ్ల మధుసూదన రావు(34)గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై జి.భాస్కర రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పలుచోట్ల చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, వారికి సమాధానం చెప్పలేక మంగళవారం ఆరుబయట గడ్డిమందు తాగి ఇంటికి వచ్చి భార్య హేమలతకు చెప్పడంతో వెంటనే బొబ్బిలి ఆస్పత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 9 గంటలకు మృతి చెందాడు. మృతుడికి 8,6 తరగతులు చదువుతున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి


మనోజ్‌కుమార్ (ఫైల్)

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామంలో ఓ చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన శంకా మనోజ్‌కుమార్ (7 నెలలు) బుధవారం తెల్లవారు ఘామున కుటుంబసభ్యులు చూసేసరికి నిద్రలో మృతి చెంది ఉన్నారు. మృతిపై అనుమానంతో కుటుంబసభ్యులు పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి చిన్నారి మృతదేహాన్ని తరలించారు. చిన్నారికి తండ్రి మురళి, తల్లి సత్యవతి ఉన్నారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.నరేష్ కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు..


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న మర్రిచెట్టు వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి కొన్నాళ్లుగా యాచక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ బంపర్ ఆఫర్! గోల్డ్ కాయిన్ ఫ్రీ. విజయనగరానికి 10 కి॥మీ॥ దూరంలో 200 ఫీట్ బైపాస్ రోడ్‌ను ఆనుకొని 30 నెలలు సులభ వాయిదా పద్ధతిలో VMRDA ప్లాట్లు కలవు. Call: కృష్ణవేణి Cell: 8628022802 [S-1190963]

PLOT FOR SALE

■ అలమండ, గోల్డ్‌స్టార్ జం॥ మరియు కొరువాడ విలేజ్‌లకు ఆనుకొని VMRDA & శ్రీ గంధం మొక్కలతో Open Plots అతి తక్కువ ధరకే కలవు. ఫోన్: 98850 48480, 90008 30026. [V. 5548]

SHOP FOR SALE

■ Shop for Sale: Bobbili (Vizianagaram) 350 Sq mts (30x11) East Facing, Y.V.R.Towers Near High School Road. Ph : 98498 75401, 99857 23736 [V-778215]

ASTROLOGY

■ శ్రీగాయత్రి దేవి జ్యోతిష్య పీఠం S.V.శాస్త్రీ గారు గతం 16 సం॥ స్థిరపడి ఉన్నారు. మీ హస్తరేఖలు, ముఖా లక్షణం జాతకచక్రం చూసి సంపూర్ణ జోతిష్యం చెప్పబడును. విద్య, ఉద్యోగం,వివాహం,సంతానం, ఆరోగ్యం మరియు మీకు ఏటువంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయగలరు. ఆంధ్ర హాస్పిటల్ ఎదురుగాVzm.9701778711. [S-1156816]

WANTED

■ పనిమనుషులు (ఆడవారు) కావలెను. ఇంట్లోనే ఉండిపోయి వంట, ఇంటిపనులు, పిల్లల్ని చూసుకోవాలి. వయస్సు: 20–40. అనుభవం తప్పనిసరి. మంచి జీతం. వైజాగ్. ఫోన్: 86393 90789 [V. 1639]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-782450]

■ UC INFO Tech సంస్థ నందు (15,000/- to 20,000/-) పనిచేయుటకు, వయస్సు : 18 to 28 లోపు, యువతి మరియు యువకులు (10th to PG), ఉచిత వసతి. ఫోన్: 77996 54777, 63051 36884 [V-2502]

■ హైదరాబాదులోని ఆప్తా హోం కేర్ లో పనిచేయుటకు 21-45సం॥గల M/F కేర్‌టేకర్స్/ అటెండర్లు, కావలెను. జీతం: 16-18వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. 6300813664 [G-310]

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. సంప్ర: ఫోన్: 9034046466 [G-786]

■ Wanted Required to Female Staff MNC Infotech & Banks training & Hostel free after training that salary 25k-35k intrested candidates forward to resume WApp 6281159171 [HA 28218]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీతం. 20K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ : 9640300074 [H-784947]

■ చదువుతో సంబంధం లేకుండా వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో పనిచేయుటకు 18 నుండి 35 సం॥లు గల యువకులు కావలెను. జీతం : 12000/- + ఫుడ్ రూమ్స్ సదుపాయం కలదు. డైరెక్ట్ జాయినింగ్. ఫోన్: 91542 96345, 91542 96346 [V.26438]

■ విజయనగరంలో గల షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 10th, డిగ్రీ చదివిన 18 నుండి 35 సం॥లు గల యువతీ యువకులు కావలెను. జీతం : 12000/- నుండి 16,500/-. డైరెక్ట్ జాయినింగ్. ఫోన్: 89499 04532, 91542 96342 [V.26439]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ



అంధ విద్యార్థులకు ఆహారం సమకూరుస్తున్న నిష్కామ ఫౌండేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దివ్యాంగులపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నిష్కామ ఫౌండేషన్ ప్రతినిధి రామచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక పూల్‌బాగ్‌లో ఉన్న ద్వారకామయి అంధుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణబాబు, నాగమణి, వరహాల శెట్టి, సూర్యారావు, చిరంజీవిరావు, ఇందుకుమారి, పాఠశాల వ్యవస్థాపకులు మాచేపల్లి ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి



మంత్రి సీదిరి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యశాఖ డైరెక్టర్ నరసింహులు

భోగాపురం: మత్స్యకారులను ఆదుకోవాలని రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు కోరారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి సీదిరి అప్పలరాజును బుధవారం కలిసి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ కోలా గురువులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న ఎండీఎం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి ఉన్నత పాఠశాలను మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) నిర్వహణ పర్యవేక్షణ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం సందర్శిం చారు. విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు భోజనాలను, స్టాకును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ను పక్కాగా అమలు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ కర్రోతు సత్యం, సూపరింటెం డెంట్ కె.సాంబశివరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం కరక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వనమిత్రకేంద్రం అభివృద్ధికి ప్రతిపాదనలు



వనమిత్ర కేంద్రంలో మొక్కలను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ సింధు

బొండపల్లి: స్థానిక వనమిత్ర కేంద్రాన్ని పర్యాటకంగా, అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపించామని ఎఫ్ఆర్ఓ జె.సింధు తెలిపారు. వనమిత్ర కేంద్రాన్ని బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రజలకు, రైతులకు పంపిణీ చేసేం దుకు వనమిత్ర కేంద్రం నర్సరీలో ఈఏడాది పదివేల మొక్కలను అటవీశాఖ ద్వారా, మరో పది వేల మొక్కలను ఉపాధి నిధులతో పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చేఏడాది వాటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పూర్తిగా సేంద్రియ ఎరువులతో మొక్కలను పెంచుతు న్నామని చెప్పారు. ఆమె వెంట వనమిత్ర కేంద్రం సహాయకులు పి.అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

బొండపల్లి: అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారుల సూచనలు మేరకు రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇప్పటికే కోతలు చేసిన వారు చేనును కుప్పలు పెట్టుకోవాలని, నూర్పులు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే గ్రామాల్లో దండోరా వేయించినట్లు పేర్కొన్నారు.

బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలి

• కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్:

బీఎల్‌ఓలు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టడంతో పాటు అర్హత ఉన్నవారందరికీ ఓటుహక్కు కల్పించాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి అన్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 219 మంది బూత్ లెవిల్ అధికారులకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు మరో రెండు రోజులు మాత్రమే గడువుందని, యుద్ధప్రాతిపదికన సర్వే నిర్వహించాలని సూచించారు. 17 ఏళ్ల నిండిన వారివద్ద నుంచి కూడా ఓటు కోసం దరఖాస్తు స్వీకరిస్తే, వారికి 18 సంవత్సరాలు నిండిన వెంటనే ఓటుహక్కు కల్పించబడుతుందని చెప్పారు. మరణించిన వారు, వలస వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించి, కచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలన్నారు. ఓటర్ల నమోదులో బీఎల్‌ఓలదే కీలకపాత్ర అని చెప్పారు.



హాజరైన అధికారులు, సచివాలయ సిబ్బంది

సర్వే చేసినప్పుడే ఆధార్‌కార్డుతో ఓటుకు అనుసంధానం చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, హాస్టళ్లు, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తాహసీల్దార్ బంగార్రాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గడప గడపకు.. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

• ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులకు ఘన స్వాగతం

విజయనగరం: నగరంలోని 37 డివిజన్ పరిధి వీటీ అగ్రహారం, బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తుంటే ప్రజా స్పందన అనూహ్యంగా ఉంటోందన్నారు. ప్రజలు తమకు అందుతున్న పథకాలతో సంతృప్తి చెందుతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ, తమ డివిజన్‌లో మూడోరోజు గడప గడపకు.. కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. టీడీపీ నాయకులు తమ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం వల్లే ప్రజలు ఓడించారని తెలిపారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసరి బంగారయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మహాసభలను విజయవంతం చేయండి

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 13వ తేదీ నుంచి 16 వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకుడు పి.రామ్మోహనరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలశ పూజలు

భోగాపురం: మండల కేంద్రంలోని భవానీ దీక్షాపరులు శీల జోగారావు, కొమ్మూరు రామకృష్ణ, తదితరులు బుధవారం రాత్రి కలశ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో భవానీ భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

చీపురుపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్.మౌనిక, కె.తేజేశ్వని రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం గౌరీదేవి తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో వేణుగోపాలపురం డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో సంప్రదాయ కీర్తనల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎస్.మౌనిక ప్రథమ స్థానంలో నిలిచింది. అదే తరగతికి చెందిన కె.తేజేశ్వని మట్టితో తయారు చేసిన కళాకృతుల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇరువురూ రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు అర్హత సాధించారు. వీరిని హెచ్ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం అభినందించారు.

ఉపకరణాలకు వందమంది ఎంపిక



కొత్తవలస: విభిన్న ప్రతిభావంతులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తవలస: స్థానిక భవిత కేంద్రంలో కొత్తవలస, వేపాడ, ఎల్.కోట మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గుర్తింపు శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన పిల్లలకు వైద్యులు ఉదయ్ కుమార్, మహేశ్వరరావు, ఎం.రాంభరద్వాజ్ పరీక్షలు చేసి 100 మందిని ఎంపిక చేశారు. వీరికి వీల్‌చైర్స్, ట్రైసైకిళ్లు, వినికిడి మెషిన్‌లు తదితర పరికరాలు ఉచితంగా అందించనున్నారు. అలాగే పలువురికి మూడు సంవత్సరాలకాల పరిమితి గల బస్సు పాస్‌లు అందించారు. ఐఈ కో–ఆర్డినేటర్‌లు ఎస్.సూర్యారావు, ఎం.భారతి, ఐఈఆర్టీలు పి.కనకరాజు, సీహెచ్.రామునాయుడు, సీహెచ్.జయంతి, ఎస్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో రేపు..

శృంగవరపుకోట: విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో స్థానిక మండల వనరుల కేంద్రంలో ఈనెల 9వ తేదీన గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ సీహెచ్. సత్యనారాయణ తెలిపారు. జామి, గంట్యాడ, ఎస్.కోట మండలాలకు చెంది న 5 నుంచి 18 ఏళ్ల లోపున్న దివ్యాంగులు శిబిరానికి హాజరు కావాలని కోరారు. ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు, వారి సహాయకులకు రవాణా చార్జీలు అందిస్తామని, భోజన సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

• కలెక్టర్ సూర్యకుమారి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

జామి: మండలంలో అభివృద్ధి పనులు, ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.సూర్యకుమారి మండల అధికారులను ఆదేశించారు. మండలం లోని కుమరాం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ముందుగా ఉత్తరాంధ్ర పట్టభద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను పరిశీ లించారు. సచివాలయం పరిధిలో ఓటర్లగా నమోదు అయిన వారిని పిలిచి వారి డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులను పరిశీలించారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బంది, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా పనితీరు తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు తరచూ ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారా లేదా అని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కుమరాం గ్రామాన్ని అన్ని విధాల ఆదర్శంగా తీర్చి దిద్దాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నారు. డీఎంహెచ్‌ఓ ఎస్.వి.రమణకుమారి, తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఎంపీడీఓ ఎం.సతీష్, ఏఓ కిరణ్‌కుమార్, అలమండ, జామి పీహెచ్‌సీల వైద్యాధికారులు భాగ్యరేఖ, పద్మావతి పాల్గొన్నారు.

శంబల నగరిలో ప్రత్యేక పూజలు

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి పంచాయతీ పరిధిలోని రాజీపేట గ్రామంలో ఉన్న శ్రీగాయిత్రీ శంబల నగరిలో బుధవారం ప్రత్యేక పూజలు, గాయిత్రీ హోమ విగ్రహాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. సామూహిక పూజల్లో ఉభయ రాష్ట్రాలకు చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు గాయిత్రీ మాత విగ్రహాలను అందజేశారు.

పాలిథిన్ విక్రయాలపై జోరుగా తనిఖీలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు, తదితరులు

విజయనగరం: పాలిథిన్ ఉత్పత్తుల విక్రయాలపై తనిఖీల ప్రక్రియ కొనసాగుతోంది. సర్కిల్ వారీగా ప్రతిరోజూ ప్లాస్టిక్ వినియోగం పట్ల ప్రజలను చైతన్యపరుస్తూ, మరోవైపు తనిఖీలను చేపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు సూచనలతో ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా విక్రయాలు చేపడుతున్న వ్యాపారులకు అపరాధ రుసుం విధిస్తున్నారు. హోల్‌సేల్ దుకాణదారులకు రూ.25 వేల వరకు జరిమాన విధించడంతో పాటు సామాగ్రిని స్వాధీనం చేసుకుంటున్నారు. మొదటి, రెండో తప్పులకు జరిమాన విధించి మూడోసారి పట్టుబడితే దుకాణాలను మూసివేస్తామని అధికారులు చెబుతున్నారు. రైతు బజార్లు, చేపలు, మాంసం దుకాణాలు, చిన్న చిన్న కిరాణా, పాన్‌షాపులలో కూడా కార్యదర్శులతో కలిసి పారిశుధ్య పర్యవేక్షకులు తనిఖీలు చేపడుతున్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుకు కృషి చేస్తున్నామని కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు తెలిపారు. ప్రజలు, వర్తకులు సహకరించాలని కోరారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

• బీఆర్ అంబేడ్కర్ గురుకులం జిల్లా కన్వీనర్ చంద్రావతి



మాట్లాడుతున్న అంబేడ్కర్ గురుకులం జిల్లా కన్వీనర్ చంద్రావతి, తదితరులు

పూసపాటిరేగ: బీఆర్ అంబేడ్కర్ గురుకులం పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అంబేడ్కర్ గురుకులం జిల్లా కన్వీనర్ చంద్రావతి అన్నారు. మండలంలోని కొప్పెర్ల గురుకులంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకులం ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని సూచించారు. జిల్లాలో గురుకులంలో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే మోడల్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో కొప్పెర్ల, చీపుపల్లి గురుకులం ప్రిన్సిపాళ్లు పూర్ణచంద్రరావు, టి.జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాలను చూపిస్తున్న జీఎస్ఎన్ రాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు ఈ నెల 9వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి వర్సిటీలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన హక్కని, ప్రతి పౌరుడు ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి హేమంత్‌కుమార్, ఏయూ నాయకులు జగన్ మోహన్, గురవయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

ఖజానా శాఖ కార్యాలయం పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఖజానా అధికారి గణేష్

భోగాపురం: మండలం కేంద్రంలోని ఖజానాశాఖ కార్యాలయాన్ని జిల్లా ఖజానాశాఖ అధికారి ఎస్ఆర్‌కే గణేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పింఛన్‌దారులు జనవరి, ఫిబ్రవరి నెలల్లో వారి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భోగాపురం, చీపురుపల్లి, ఎస్. కోట, విజయనగరం ఖజానా కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు స్థలాలు ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే టెండర్ల ప్రక్రియ ద్వారా భవన నిర్మాణాలను చేపడతామని చెప్పారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఎస్టీఓలు జయలక్ష్మి, కె.సునీల, కె.చంద్రశేఖర్, ఎస్.రామకృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

బొండపల్లి: రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి– ప్రణాళికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం, శుక్రవారం రెండురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి బుధవారం తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా పంచాయతీల కార్యదర్శులు, వీఆర్‌ఓలతో పాటు మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

లింగ వివక్షను రూపుమాపుదాం



బొండపల్లి: మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు

బొండపల్లి: లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్స న్ హిమబిందు అన్నారు. లింగ వివక్షత, దిశ చట్టం, లైంగిక వేధింపులు తదితర అంశాలపై ఐసీడీఎస్, వెలుగు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో కూడా లింగ వివక్షకు పాల్పడడం సరికాదన్నారు. అన్ని రంగాల్లోనూ మగ వారితో సమానంగా ఆడ వారు కూడా రాణిస్తున్నారని చెప్పారు. ఆడ, మగ అన్న భేదాలను తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వ దిశ చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. అలాగే స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతీ మహిళ దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి విధించే శిక్షలను వివరించారు. కార్యక్రమంలో మహిళా స్టాడింగ్ కమిటీ సభ్యులు శాంతి కుమారి,గంట్యాడ ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, ఎస్ఐ ఎస్.రవి, వెలుగు ఏపీఎం సులోచనాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, ప్రమీలా మూడు మండలాలు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎల్.కోటలో ర్యాలీ



లక్కవరపుకోట: ర్యాలీ చేస్తున్న మహిళలు, వెలుగు సిబ్బంది

లక్కవరపుకోట: లింగ వివక్షతకు ఇక ముగింపు పలుకుదాం నినాదంతో మండల కేంద్రంలో డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. నేటి ఆధునిక సమాజంలో కూడా లింగవివక్షత తగదని వెలుగు ఏపీఎం అప్పలనాయుడు అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12 జిల్లాల్లో వేగంగా ధాన్యం సేకరణ

సాక్షి, అమరావతి: ధాన్యం సేకరణతోపాటు మద్దతు ధర చెల్లింపులను వేగంగా నిర్వహిస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు 12 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లను పక్కా ప్రణాళిక ప్రకారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 1.23 లక్షల మంది రైతుల నుంచి రూ.1425.54 కోట్ల విలువైన 6.98 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు తెలిపారు. ఇందులో రూ.410.45 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. గోనెసంచులు, హమాలీల ఖర్చులు, రవాణా కోసం రైతులకు రూ.2 కోట్ల వరకు అందించామని తెలిపారు.

మైనారిటీల హక్కుల పరిరక్షణకు కృషి

సాక్షి, అమరావతి: ఏపీలో మైనారిటీల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఏపీ స్టేట్ మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ చెప్పారు. మంగళగిరిలోని ఏపీ స్టేట్ మైనారిటీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో వైస్ చైర్మన్ డాక్టర్ జాషువా డేనియల్, నూతన సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, జితేందర్ జీత్‌సింగ్, షేక్ సైఫుల్లాతో కలిసి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మైనారిటీల మేలు కోసం, వారి హక్కుల పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ మైనారిటీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో కమిషన్‌కు అందిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవాలని రిజిస్ట్రార్‌లకు ఆదేశాలిచ్చామన్నారు. కమిషన్ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని జిల్లాల్లో పర్యటించి సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు.

టీడీపీ డీఎన్‌ఏ బీసీలు

- చంద్రబాబు ట్వీట్
- తోకలు కత్తిరిస్తానన్నప్పుడు గుర్తుకు రాలేదా... అని నిలదీసిన నెటిజన్లు

సాక్షి, అమరావతి: 'టీడీపీ డీఎన్‌ఏ బీసీలు.. బీసీల గుండెల్లో టీడీపీ' అంటూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం ట్వీట్ చేశారు. వైఎస్సార్‌సీపీ జయహో బీసీ సభ విజయవంతమవడంతో.. టీడీపీ నేతలు దానిని తక్కువ చేసి చూపించేందుకు విమర్శలు చేయడం మొదలుపెట్టారు. అందులో భాగంగా చంద్రబాబు కూడా ట్వీట్ చేయగా.. తోకలు కత్తిరిస్తానని బెదిరించేటప్పుడు బీసీలు టీడీపీ డీఎన్‌ఏ అని గుర్తుకు రాలేదా... అని నెటిజన్లు నిలదీశారు. పదవులకు, రాజ్యసభ సీట్లకు బీసీలు పనికిరారా... అంటూ చంద్రబాబును ప్రశ్నించారు. కాగా, చంద్రబాబు గురువారం నుంచి మూడు రోజులపాటు బాపట్ల, గుంటూరు జిల్లాల్లో పర్యటిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

పవన్ రాష్ట్ర పర్యటన వాహనం పేరు 'వారాహి'

- వాహనం ఫొటోలతో ట్వీట్ చేసిన జనసేన అధినేత
- పర్యటన వివరాలను మాత్రం వెల్లడించని జనసేన



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ తన రాజకీయ రాష్ట్ర పర్యటనకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. త్వరలో తాను ప్రారంభించబోయే రాష్ట్ర పర్యటనలో ఉపయోగించే వాహనం వివరాలను బుధవారం ఆయన ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. పర్యటనలో ఆయన ఉపయోగించే వాహనానికి 'వారాహి'గా నామకరణం చేసినట్టు పేర్కొన్నారు. 'వారాహి.. రెడీ ఫర్ ఎలక్షన్ బ్యాటిల్' పేరుతో తన రాష్ట్ర పర్యటన వాహనాన్ని ఆయన పరిశీలిస్తూ దిగిన ఫొటోలను తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఈ వాహనానికి సంబంధించి ట్రయల్ రన్‌ను పవన్ కళ్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో పరిశీలించారని జనసేన పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా, పవన్‌కళ్యాణ్ రాష్ట్ర పర్యటన ఈ ఏడాది దసరా నుంచే ప్రారంభమవుతుందని మొదట ఆ పార్టీ ప్రకటించినప్పటికీ, తర్వాత తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నట్టు అప్పట్లో ఆ పార్టీ తెలియజేసింది. ఇప్పుడు కూడా పవన్‌కళ్యాణ్ రాష్ట్ర పర్యటన ఎప్పటి నుంచి మొదలవుతుందన్న వివరాలను మాత్రం ప్రకటించలేదు.

బీసీల మధ్య చిచ్చు పెడుతున్న వైఎస్సార్‌సీపీ

- పురందేశ్వరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీసీ కులాల మధ్య చిచ్చు పెట్టే రీతిలో బీసీ కార్పొరేషన్లు ఉన్నాయని.. బీసీలకు ప్రభుత్వం గత మూడేళ్లలో ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీసీలను కులాల వారీగా విడదీసి కులాల కుంపట్లు పెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు తెచ్చి, వారిలో నాయకత్వ లక్షణాలు నేర్పింది ఎన్టీఆర్ మాత్రమేనని అన్నారు.



ఒంగోలు 34వ డివిజన్‌లో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



నంద్యాల జిల్లా పాతపాడులో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం



కాకినాడ బర్మాకాలనీలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నేటినుంచి రబీ ఈ-క్రాప్ నమోదు

- పంట వివరాలు నమోదు కాగానే ఈకేవైసీ
- ఆక్వా చెరువులున్న సర్వే నంబర్లు బ్లాక్
- జనవరి నెలాఖరు నాటికి 100 శాతం నమోదు



అవకతవకలకు ఆస్కారం లేకుండా..

ఈ-క్రాప్ నమోదులో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చేందుకు రబీ సీజన్‌లో మరిన్ని మార్పులు తీసుకొస్తున్నాం. ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలో కూడా 100 శాతం ఈ క్రాపింగ్ నమోదు పూర్తి చేసే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. – చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయశాఖ

సాక్షి, అమరావతి: రబీకి సంబంధించి గురువారం నుంచి ఈ-క్రాప్ నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పంట నమోదులో పారదర్శకత, జవాబుదారీ తనం తీసుకొచ్చేందుకు సంస్కరణలు చేపట్టింది. పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, సంక్షేమ పథకాల అమలులో అర్హులైన ప్రతి రైతు లబ్ధి పొందేలా ఈ-క్రాప్ నమోదులో మరిన్ని మార్పులు తీసుకొస్తోంది. ఇంతకుముందు ఆర్బీకేల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యాక మాత్రమే వీఏఏలు, వీఆర్‌వోలు, చివరగా రైతుల వేలిముద్రలు(ఈకేవైసీ) తీసుకునే వారు. ఇకనుంచి ఈ పంట నమోదు ప్రక్రియ కొనసాగుతుండగానే ఈకేవైసీ నమోదు చేపట్టనున్నారు. ఇకపై ముగ్గురి వేలిముద్రలు ఒకేసారి నమోదు చేస్తారు.

విత్తన పంటనూ నమోదు చేయాల్సిందే

ప్రైవేట్ విత్తన కంపెనీలతో చేసుకున్న ఒప్పందం మేరకు విత్తనోత్పత్తి కోసం పంటను సాగు చేస్తే విధిగా ఆ వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాల్సిందే. ఆయా సర్వే నంబర్లలో సాగైన విత్తన పంటను కొనుగోలు చేయడానికి వీల్లేకుండా మార్పు చేశారు. సాధారణంగా ఉత్పత్తి చేసిన విత్తనాలను కంపెనీలకు అమ్మేస్తారు. దాని స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించకుండా అడ్డుకట్ట వేసేందుకే ఈ మార్పు తీసుకొచ్చారు. కాగా, విత్తిన కొద్దిరోజుల తర్వాత ఆ పంట వైపరీత్యాలు లేదా తెగుళ్ల వల్ల దెబ్బతింటే రైతులు రెండోసారి విత్తుకుంటే పంట ఫొటోలతో పాటు మండల వ్యవసాయాధికారి ధ్రువీకరిస్తేనే పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారు.

ఈ-ఫిష్‌లో నమోదైతే ఈ-క్రాప్‌లో స్థానం ఉండదు

చేపలు, రొయ్యల చెరువులు గల సర్వే నంబర్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేస్తున్నట్టు నమోదు చేసిన ఘటనలు చోటుచేసుకోవడంతో ఆ పరిస్థితికి చెక్ పెడుతూ 'ఈ ఫిష్'లో నమోదైన సర్వే నంబర్లన్నీ ఈ-క్రాప్‌లో బ్లాక్ చేస్తున్నారు. గడచిన ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు చివరి దశలో ఉండగా.. ఎంఏవోలు, తహసీల్దార్లు 10 శాతం, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు 5 శాతం, జాయింట్ డైరెక్టర్లు 3 శాతం, జాయింట్ కలెక్టర్లు 2 శాతం, కలెక్టర్ స్థాయి అధికారులు ఒక శాతం చొప్పున ర్యాండమ్ చెక్ చేస్తున్నారు. ఇకనుంచి ప్రతి 15 రోజులకోసారి ర్యాండమ్‌గా చెక్ చేసేవిధంగా మార్పు తీసుకొచ్చారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో తనిఖీ కోసం ఎంపిక చేసిన పంట వివరాలను సైతం జిల్లాలకు పంపిస్తారు. ఆ మేరకు ర్యాండమ్‌గా తనిఖీ చేసి లోటుపాట్లను సర్దుబాటు చేసుకుంటూ నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు.



వధూవరులు సౌజన్య, డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ఆశీర్వదించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వధూవరులకు సీఎం జగన్ ఆశీర్వాదం

నెల్లూరు(సెంట్రల్): తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కిలివేటి సుభాషిణి దంపతుల కుమార్తె సౌజన్య, డాక్టర్ శ్రావణ్‌కుమార్ వివాహ వేడుక నెల్లూరు రూరల్ కనుపర్తిపాడు సమీపంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. దాదాపు 15 నిమిషాలు వివాహ వేడుకలో ఉన్న సీఎం ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు.

రామశేషు హత్య ఘటనపై ముఖ్యమంత్రి ఆరా

కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి ధర్మానకు సూచన

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా గార మండలం వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బరాటం రామశేషు హత్య ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. తక్షణమే గ్రామానికి వెళ్లి ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవడంతోపాటు రామశేషు కుటుంబానికి అండగా నిలవాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సీఎం చెప్పారు. దీంతో వైఎస్సార్‌సీపీ విజయవాడలో నిర్వహిస్తున్న బీసీ సదస్సుకు హాజరు కాకుండానే.. హత్యకు గురైన రామశేషు కుటుంబాన్ని పరామర్శించడానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు వెళ్లారు.

రైతుబజార్ల సిబ్బంది జీతాల పెంపు

- 23 శాతం పెంచిన ప్రభుత్వం
- విశాఖ, విజయవాడ, గుంటూరు ఎస్టేట్ ఆఫీసర్లకు రూ.26 వేలకు పెరిగిన జీతం
- సూపర్‌వైజర్లకు రూ.18,500కు పెంపు
- మిగిలిన చోట్ల ఎస్టేట్ ఆఫీసర్లకు రూ.24 వేలకు, సూపర్‌వైజర్లకు రూ.15 వేలకు పెంపు, సెక్యూరిటీ గార్డులకు రూ. 15 వేలకు పెంచుతూ ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: రైతుబజార్ల సిబ్బంది వేతనాలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇస్తున్న జీతాలను 23 శాతం పెంచింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 రైతుబజార్లు ఉన్నాయి. ప్రతి రైతు బజారుకు ఓ ఎస్టేట్ ఆఫీసర్, సెక్యూరిటీ గార్డు ఉన్నారు. ఆదాయాన్ని బట్టి కొన్నింటిలో సూపర్‌వైజర్లు కూడా ఉన్నారు. ఎస్టేట్ ఆఫీసర్లు లేని చోట సూపర్‌వైజర్లు విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రస్తుతం 75 మంది ఎస్టేట్ ఆఫీసర్లు, 28 మంది సూపర్‌వైజర్లు, 212 మంది సెక్యూరిటీ గార్డులు, మరో ఐదుగురు హార్టికల్చర్ అసిస్టెంట్లు (సూపర్‌వైజర్లు) ఉన్నారు. వీరిలో 188 మంది కాంట్రాక్టు, 132 మంది అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. వీరి జీతాల కోసం ప్రతి నెలా రూ.57 లక్షలు, రైతుబజార్ల నిర్వహణకు మరో రూ.50 లక్షల వరకు ఖర్చవుతుంది. 2021వరకు స్థానిక మార్కెట్ కమిటీలే ఈ ఖర్చులు భరించేవి. ప్రభుత్వ చర్యల ఫలితంగా 76 రైతుబజార్లు స్వయం సమృద్ధి సాధించాయి. ఏటా రూ.11.87 కోట్ల వార్షికాదాయాన్ని ఆర్జిస్తున్నాయి. మిగిలిన రైతుబజార్లు కూడా స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నాయి. కాగా, రైతుబజార్లలో రైతులు, వినియోగదారుల మధ్య వారధిలా పనిచేస్తున్న సిబ్బంది జీతాలను పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు జీతభత్యాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాల్లోని రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లకు రూ.21 వేల నుంచి రూ.26 వేలకు, సూపర్‌వైజర్లకు రూ.15 వేల నుంచి రూ.18,500కు వేతనాలు పెరగనున్నాయి. మిగిలిన కార్పొరేషన్లు, పట్టణాలు, ఇతర ప్రాంతాల్లోని రైతుబజార్లలో ఎస్టేట్ ఆఫీసర్లకు రూ.19,500 నుంచి రూ.24 వేలకు, సూపర్‌వైజర్లకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు పెరగనున్నాయి. ప్రాంతాలతో సంబంధం లేకుండా సెక్యూరిటీ గార్డుల వేతనం రూ.12 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంపును డిసెంబర్ నెల నుంచి అమలులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

'ఎన్‌ఆర్‌ఐ' డైరెక్టర్ల మనీ ల్యాండరింగ్

- ఎన్‌ఆర్‌ఐఏఎస్ కంపెనీ పేరిట నిధులు కొల్లగొట్టారు
- 53 స్థిరాస్తులు, ఇతర డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు జప్తు చేసిన ఈడీ

సాక్షి, అమరావతి: టీడీపీ పెద్దల గుప్పిట్లో ఉన్న గుంటూరు జిల్లా పెదకాకానిలోని ఎన్‌ఆర్‌ఐ అకాడమీ భారీగా అక్రమాలకు పాల్పడిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఐ అకాడమీ అదే పేరును పోలి ఉండేలా 'ఎన్‌ఆర్‌ఐఏఎస్' అనే మరో కంపెనీని తెరచి అక్రమంగా నిధులు మళ్లించిందని వెల్లడించింది. తద్వారా ఎన్‌ఆర్‌ఐ అకాడమీ డైరెక్టర్లు మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని స్పష్టంచేసింది. వైద్య కళాశాల సీట్ల ద్వారా భారీగా వసూలు చేసిన ఫీజులు, కోవిడ్ రోగుల నుంచి పెద్ద ఎత్తున వసూలు చేసిన వైద్య బిల్లుల నిధులను అక్రమ ఖాతాల్లోకి మళ్లించి కొల్లగొట్టిందని ఈడీ తెలిపింది. భవనాల నిర్మాణం పేరుతో ఎన్‌ఆర్‌ఐ అకాడమీ డైరెక్టర్లు ఈ నిధులను దారి మళ్లించారని పేర్కొంది. ఈ నెల 2, 3 తేదీల్లో విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లలో ఎన్‌ఆర్‌ఐ డైరెక్టర్ల కార్యాలయాలు, నివాసాల్లో ఈడీ విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఎన్‌ఆర్‌ఐ అకాడమీ డైరెక్టర్లు భారీగా మనీ ల్యాండరింగ్‌కు పాల్పడి కూడబెట్టిన 53 విలువైన స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఈడీ స్వాధీనం చేసుకుని, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది.

వలంటీర్ మారినా ఫోన్ నంబర్ మారదు

సాక్షి, అమరావతి: ఏదైనా కారణంతో వలంటీర్ మారినా.. సమాచారం విషయంలో ఆ క్లస్టర్ పరిధిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాలు, పట్టణాలు, నగర కార్పొరేషన్లలో క్లస్టర్ వారీగా శాశ్వత ఫోన్ నంబర్‌ను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పుడే ప్రభుత్వం ప్రతి వలంటీర్‌కు మొబైల్ ఫోన్‌తో పాటు సిమ్‌ను కూడా అందజేసింది. అయితే ఏ కారణంతోనైనా ఏదైనా ప్రాంతంలో వలంటీర్ విధుల నుంచి తప్పుకొని తనకు కేటాయించిన ఫోన్ నంబర్ తిరిగి ఇవ్వనప్పుడు ఆ క్లస్టర్ పరిధిలోని ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బంది ఇకపై తలెత్తకుండా విధుల నుంచి తప్పుకొన్న వలంటీర్‌కు కేటాయించిన సిమ్‌ను బ్లాక్ చేసి, అదే నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని కొత్త వలంటీర్‌కు అధికారులు అందజేయనున్నారు. ఇందుకోసం వలంటీర్లకు ప్రభుత్వం కేటాయించిన ఫోను నంబర్ల వివరాలను రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ డేటా బేస్ సెంటర్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల పదో తేదీ కల్లా ప్రతి వలంటీర్ తమ మొబైల్ నంబర్ వివరాలతో పాటు సిమ్ కార్డు వివరాలు రాష్ట్ర స్థాయి డేటా బేస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడైనా సరైన సిగ్నల్ లేక ప్రభుత్వం కేటాయించిన సిమ్ కాకుండా వలంటీర్లు తమ సొంత ఫోన్ నంబర్ వాడుతుంటే.. అలాంటి చోట్ల సరైన సిగ్నల్ ఉండే కంపెనీలకు చెందిన ఫోన్ నంబర్లనే వలంటీర్లకు కేటాయించేందుకు చర్యలు చేపట్టారు.

సీఎం కార్యాలయ అధికారులకు శాఖల కేటాయింపు

సాక్షి, అమరావతి: సీఎం ప్రత్యేక సీఎస్‌గా పనిచేసిన డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమించిన నేపథ్యంలో సీఎం ప్రత్యేక సీఎస్‌గా పూనం మాలకొండయ్యను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. సీఎం సంయుక్త కార్యదర్శిగా ఎస్.భరత్ గుప్తాను నియమించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు సీఎంవో అధికారులకు సీఎం ప్రత్యేక సీఎస్ పూనం మాలకొండయ్య సబ్జెక్టులను కేటాయించారు. పూనం మాలకొండయ్యకు సాధారణ పరిపాలన, విద్య, ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమం, వ్యవసాయ, అనుబంధ రంగాలు, పరిశ్రమలు-వాణిజ్యం, మౌలిక సదుపాయాలు-పెట్టుబడులు, ఆహార పౌరసరఫరాలు-వినియోగదారుల వ్యవహారాలు, మార్కెటింగ్-కో-ఆపరేషన్, మహిళా శిశు సంక్షేమం, కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రత్యుత్తరాలు, కె.ధనంజయరెడ్డికి ఆర్థిక, ప్రణాళిక, హోం, జలవనరులు, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, సీఆర్‌డీఏ, ఇంధన, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతికత, గనులు, ముత్యాలరాజుకు రెవెన్యూ, న్యాయ, లెజిస్లేటివ్ వ్యవహారాలు, రవాణా, రహదారులు-భవనాలు, ఏపీఎస్‌ఆర్టీసీ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడలు, కార్మిక, ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్, సీఎంవో ఎస్టాబ్లిష్‌మెంట్, డాక్టర్ ఎస్.భరత్ గుప్తకు గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, గ్రామ, వార్డు సచివాలయాలు, మహిళా శిశు సంక్షేమం మినహా అన్ని సంక్షేమ శాఖలు, సీఎం హామీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వినతులు సబ్జెక్టులు కేటాయించారు.

గంటన్నర పాటు నరకయాతన

- ప్లాట్‌ఫామ్, బోగీ మధ్య ఇరుక్కున్న విద్యార్థిని
- ప్లాట్‌ఫామ్ తవ్వి బయటకు తీసి ఆస్పత్రికి తరలింపు
- ఆందోళనకరంగా విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి



దువ్వాడ రైల్వే స్టేషన్‌లో పట్టాలు, బోగీ మధ్యలో ఇరుక్కున్న ఎంసీఏ విద్యార్థిని

అగనంపూడి(గాజువాక): ప్లాట్‌ఫామ్, బోగీ మధ్య ఇరుక్కుని ఎంసీఏ విద్యార్థిని గంటన్నరపాటు నరకయాతన అనుభవించిన ఘటన దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరిగింది. దువ్వాడ జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కథనం ప్రకారం... కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని గోపాలపట్నం గ్రామానికి చెందిన మెరపల శశికళ దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. కళాశాలకు వెళ్లడానికి బుధవారం ఉదయం ఆమె గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోవడంతో ఆమె దిగే ప్రయత్నంలో కాలుజారి ప్లాట్‌ఫామ్, రైలు బోగీ మధ్యలో ఇరుక్కుపోయింది. రైలు నిలిపేసి ఆమెను బయటకు తీసుకువచ్చేందుకు అక్కడి సిబ్బంది ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. వెంటనే ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఆపరేటింగ్ సిబ్బందితోపాటు రెస్క్యూ టీమ్, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు అక్కడికి చేరుకుని గంటన్నరపాటు శ్రమించి ప్లాట్‌ఫామ్‌ను తవ్వించి ఆమెను బయటకు తీశారు. అంబులెన్స్‌లో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె శరీరంలో అంతర్గతంగా రక్తస్రావం జరగడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని వైద్యులు చెప్పినట్లు మధుసూదరావు తెలిపారు. రైలు గంటన్నర ఆలస్యంగా బయలుదేరి వెళ్లింది.

9న పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

సాక్షి, అమరావతి: పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించడానికి ఈ నెల 9న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల శాఖ సదస్సును ఏర్పాటుచేసింది. విజయవాడలోని హోటల్ అజంతా ఎవర్ గ్రీన్‌లో జరగనున్న ఈ సదస్సుకు మంత్రులు తానేటి వనిత, గుడివాడ అమర్‌నాథ్, మేరుగు నాగార్జున, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ కరికాల వలవన్ హాజరుకానున్నారు. ఆసక్తిగలవారు పేర్ల నమోదుకు 9494399626లో సంప్రదించాలి.

ఆర్టీసీకి 'చంద్రన్న భజన' బకాయి

రూ.78.36 కోట్లు

- బస్సులకు పైసా అద్దె చెల్లించని చంద్రబాబు ప్రభుత్వం
- పోలవరం టూర్లకు అద్దె రూ.65.79 కోట్లు
- కట్టని రాజధాని సందర్శనలకు చెల్లించాల్సింది రూ.5.36 కోట్లు
- దివ్య దర్శనానికి తీసుకున్న బస్సుల అద్దె రూ.7.21 కోట్లు
- ఒక్క పైసా కూడా కట్టని బాబు సర్కారు
- అద్దె ముందుగానే చెల్లించి బస్సులు తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ
- జూలైలో వైఎస్సార్‌సీపీ ప్లీనరీ కోసం రూ.3.38 కోట్లు ముందుగానే చెల్లింపు
- 'జయహో బీసీ' సదస్సు కోసం రూ.7 కోట్లు చెల్లింపు
- అయినా విషం కక్కిన 'ఈనాడు'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బీసీలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వారిని మరింత చైతన్యం చేసేందుకు బుధవారం విజయవాడలో నిర్వహించిన జయహో బీసీ సదస్సు పైనా ఈనాడు పత్రిక విషపు రాతలు రాసింది. ఈ సదస్సుకు ముందుగానే డబ్బులు చెల్లించి, ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకొన్నప్పటికీ, 'వైఎస్సార్‌సీపీకి ఆర్టీసీ జీ హుజూర్' అంటూ బండ లేసింది. ఇదే ఈనాడుకు ఆనాడు చంద్రబాబు పేరిట పెట్టిన 'జయము జయము చంద్రన్న' అనే భజన కార్యక్రమానికి అప్పనంగా ఆర్టీసీ బస్సులను తిప్పిన విషయం పట్టించుకోదు. ఆ కార్యక్రమం కోసం టీడీపీ ప్రభుత్వం ఆర్టీసీకి బకాయి పెట్టిన మొత్తం రూ.78.36కోట్లు. 'జయహో బీసీ' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ముందుగానే డబ్బులు చెల్లించి ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకుంది. ఈ విషయాన్ని దాచిపెట్టి, అబద్ధాలు రాసింది. ఈనాడు పత్రిక కడుపుమంట అలాంటిది. ఇంతకీ చంద్రబాబు ప్రభుత్వంలో ఆర్టీసీ దుస్థితి, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిస్థితి ఏమిటో ఓసారి పరిశీలిద్దాం...

పైసా అద్దె చెల్లించకుండానే..

ఆర్టీసీ అందరికీ బస్సులు అద్దెకిస్తుంది. వ్యక్తులకు, సంస్థలకు, వేడుకలకు... ఇలా ముందుగా అద్దె చెల్లిస్తే బస్సులు పంపుతుంది. ప్రభుత్వం కూడా ఇలా అద్దెకు బస్సులు తీసుకుంటుంది. పార్టీలూ తీసుకుంటాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ప్రచార కార్యక్రమాల కోసం ఆర్టీసీ బస్సులను ఇష్టానుసారం వాడుకున్నారు. నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్సులను ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు తీసుకుంటే అందుకు అద్దె చెల్లించాలి. టీడీపీ ఐదేళ్లలో ఏనాడూ దీనిని పట్టించుకోలేదు. పోలవరం సందర్శన కోసం 19,923 ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకున్నారు. అందుకోసం ఆర్టీసీకి రూ.65.79 కోట్లు చెల్లించాలి. అక్కడికి బస్సుల్లో తరలించిన వారితో చంద్రన్న భజన పాటలు పాడించారు. అయినా, 2019లో టీడీపీ అధికారాన్ని కోల్పోయే వరకు ఆ బకాయి చెల్లించనే లేదు. కట్టని రాజధానిని చూపించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజల్ని బలవంతంగా అమరావతికి ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. అందుకోసం 1,518 బస్సులను వాడుకున్నారు. ఆ బస్సుల అద్దె బకాయి రూ.5.36 కోట్లు చెల్లించనే లేదు. 'దివ్య దర్శనం' పేరుతో టీడీపీ ప్రభుత్వం 1,984 ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంది. అందుకు చెల్లించాల్సిన అద్దె రూ.7.21 కోట్లు. ఇదీ చెల్లించలేదు. మొత్తం మీద చంద్రబాబు ఆర్టీసీకి పెట్టిన బకాయి రూ.78.36 కోట్లు. కానీ ఈనాడు పెన్ను ఈ వాస్తవం రాయదు. ఎందుకంటే ఆర్టీసీ సొమ్మును అప్పనంగా వాడుకుంది వారి చంద్రబాబు కదా. ఆర్టీసీ సంస్థ నష్టాల్లో కూరుకుపోయినా, అప్పుల పాలైపోయినా పర్వాలేదు. చంద్రబాబు భజన చేస్తే చాలన్నది దాని సిద్ధాంతం.

అద్దె ముందే చెల్లించడం వైఎస్సార్‌సీపీ విధానం

ప్రస్తుతం ఆర్టీసీపై వైఎస్సార్‌సీపీ ఒక్క రూపాయి కూడా భారం మోపడంలేదు. పార్టీ కార్యక్రమాలకు అవసరమైతే నిర్ణీత అద్దెను ముందుగానే చెల్లించి మరీ బస్సులను తీసుకుంటోంది. ఈ ఏడాది జూలైలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్లీనరీకి 1,823 బస్సుల కోసం రూ.3.38కోట్లు ముందుగానే చెల్లించింది. విజయవాడలో బుధవారం నిర్వహించిన 'జయహో బీసీ' సభ కోసం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 1,460 ఆర్టీసీ బస్సులను దాదాపు రూ.7 కోట్లకు అద్దెకు తీసుకుంది. అయినా సరే 'ఈనాడు' మాత్రం ప్రభుత్వానికి ఆర్టీసీ జీ హుజూర్... అంటూ దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని మోసగించేందుకు యత్నించింది. స్వామి భక్తి అంటూ ఇష్టారీతిన పదాలు వాడింది. ఇదే స్వామి భక్తి చంద్రబాబు హయాంలో అప్పనంగా ఇచ్చినప్పుడు ఈనాడు గమనించలేకపోయిందా? కాదు.. చూడనట్లే ఉంది. ఇష్టం వచ్చినట్లుగా బస్సులు వాడుకొని, అద్దె ఎగ్గొట్టిన చంద్రబాబు దందాను మరుగున పెట్టి, ముందస్తుగా డబ్బు చెల్లించి ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చిన వైఎస్సార్‌సీపీపై అక్కసు వెళ్లగక్కింది.

సందర్భం



● రేణు పాసవాన్

భయంతో కూడిన మౌనం కంటే నిర్భయమైన నిరసన ఆయుధం అవుతుంది. రేణు పాసవాన్ విషయంలో ఇదే జరిగింది. చిన్న వయసులోనే తనకు పెళ్లి ప్రయత్నాలు జరిగాయి. 'నేను చదువుకోవాలి' అని గట్టిగా నిర్ణయించుకొని తండ్రి ఆగ్రహానికి గురైంది. బిడ్డ మనసును అర్థం చేసుకున్న ఆ తండ్రి 'సరే నీ ఇష్టం' అనక తప్పలేదు. ఆరోజు భయపడి బాల్యవివాహానికి సిద్ధమై ఉంటే రేణు పాసవాన్ స్పీకర్, లైఫ్‌కోచ్, రైటర్, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకునేది కాదు. తాజాగా ఫాక్స్ స్టోరి ఇండియా 'ఇండియాస్ 50 ఇన్‌స్పైరింగ్ వుమెన్ -2022' జాబితాకు ఎంపికైంది రేణు...

రేణు ది గ్రేట్

స్త్రీ హక్కుల గొంతుక

బిహార్‌లోని ముజాఫర్‌పూర్ జిల్లాలోని మిథాన్‌పుర అనే చిన్న గ్రామంలో పుట్టింది రేణు. ఆ ప్రాంతంలో బాల్యవివాహాలు సహజం. తనకు కూడా పెళ్లి చేసే ప్రయత్నాలు చేస్తే ఇంటి నుంచి పారిపోయింది.

ఎక్కడో ఉన్న రేణును ఇంటికి తీసుకువచ్చిన తండ్రి 'పెళ్లి అంటూ నిన్ను బాధ పెట్టను' అన్నాడు.

చదువులో ఎప్పుడూ చురుగ్గా ఉండేది రేణు. బయెటెక్నాలజీలో పట్టా పుచ్చుకుంది. పుణెలో ఎంబీఏ చేసింది.

బెంగళూరులో బయోటెక్నాలజీ చదువుకునే రోజుల్లో హస్టల్లో అమ్మాయిలు రేణుకు దూరంగా ఉండేవారు. నిర్లక్ష్యం చేసేవారు. దీనికి కారణం తాను బిహారి కావడం! ఇక రైల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు బిహారీల పట్ల పోలీసులు వ్యవహరించే తీరు అమానుషంగా ఉండేది. ఇవన్నీ చూసిన తరువాత తనకు బాధగా అనిపించేది.

'ఇన్ఫోసిస్'లో కొన్ని సంవత్సరాల పాటు ఉద్యోగం చేసింది రేణు.

తాను నడిచొచ్చిన దారిపై ఒకసారి పుణె క్యాంపస్‌లో ప్రసంగించింది. ఇది ఎంతోమందిని ఆకట్టుకుంది. 'మీ జీవితానుభవాలకు ఎందుకు అక్షర రూపం ఇవ్వకూడదు! చాలా మందికి స్ఫూర్తి ఇస్తాయి' అని చెప్పడంతో 'లివ్ టూ ఇన్‌స్పైర్' పేరుతో తొలి పుస్తకం రాసింది రేణు. బిహార్‌లోని మారుమూల గ్రామం నుంచి బెంగళూరులో ఉద్యోగం వరకు తన ప్రయాణానికి అక్షరరూపం ఇచ్చింది. ఈ పుస్తకం బాగా పాపులర్ అయింది.

ఏవేవో జ్ఞాపకాలు చుట్టుముడుతుండగా 'నేను చేయాల్సింది ఇంకా ఏదో ఉంది' అనుకుంది రేణు. 'లివ్ టూ ఇన్‌స్పైర్' అనే సంస్థను స్థాపించి గ్రామాలలోని మహిళలు ఆర్థికంగా సొంత కాళ్ల మీద నిలబడడానికి అవసరమైన సహకారం అందిస్తోంది. కళాకృతుల తయారీలో మహిళలకు శిక్షణ ఇప్పిస్తోంది.

దీంతో పాటు మహిళల హక్కుల కోసం పనిచేయడం మొదలుపెట్టింది. అలా 'జి-100' గ్రూప్‌లో చేరింది. బిహార్ నుంచి ఈ గ్రూప్‌లో చేరిన తొలి మహిళ రేణు. జి-100 అనేది ప్రపంచ వ్యాప్తంగా మహిళల హక్కుల కోసం గొంతు విప్పుతున్న మహిళా ఉద్యమకారుల పోరాట వేదిక. జి-100 గ్రూప్ ఛైర్మన్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించిన రేణు పాసవాన్ లివ్ టూ ఇన్‌స్పైర్ తరువాత ది న్యూ, సస్టేనబుల్ డెవలప్‌మెంట్ అనే రెండు పుస్తకాలు రాసింది. ఇవి తనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చాయి.

ఐక్యరాజ్యసమితి 'జెండర్ ఈక్వాలిటీ'కి సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రేణు 'షి ది ఛేంజ్' టైటిల్‌కు ఎంపికైంది.

'ఆ ఇంట్లో వ్యక్తులు కాదు సమస్యలు ఉంటాయి' అని ఊరివాళ్లు అనుకునేవారు. ఎందుకంటే రేణు సోదరులు ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడేవాళ్లు. తల్లికి మానసిక సమస్యలు. వంట వండడం నుంచి బట్టలు ఉతకడం వరకు అన్నీ తన బాధ్యతలే అయ్యేవి. ఇలాంటి ఇంట్లో నుంచి వచ్చిన రేణు పాసవాన్ మోటివేషనల్ స్పీకర్‌గా, స్త్రీ హక్కుల ఉద్యమకార్యకర్తగా ప్రపంచవ్యాప్తగా గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రధాన కారణం పైకి ఎదిగినా పరాయికరణకు లోను కాకపోవడం. తన మూలాలు ఏమిటో మరవక పోవడం.

ఊలు ఉన్నది వెచ్చని స్వెట్టర్‌లు అల్లడానికే కాదు.
చక్కగా చిత్రంగా బొమ్మలు వేయడానికి కూడా.
ఊలు బొమ్మలంటే ఊలుతో అల్లిన బొమ్మలు కాదు.
ఊలుతో అల్లిన చిత్రాలు... ఉలెన్ ఆర్ట్ కళారూపాలు.
మానస చేతిలో దిద్దుకున్న అమ్మ మనసు రూపాలు.

ఊలు బొమ్మల లాలి



అది నవంబర్ 17. బెంగళూరు, కర్నాటక చిత్ర కళా పరిషత్‌లోని దేవరాజ్ అర్స్‌లో ఓ ఆర్ట్ ఎగ్జిబిషన్. అది సోలో ఎగ్జిబిషన్. అందులో వినూత్నమైన చిత్రాల ప్రదర్శన. రంగు అద్దుకున్న కుంచె నుంచి కాన్వాస్ మీద రూపుదిద్దుకున్న రూపమేనా? సందేహం కలుగుతుంది. కళ్లు భ్రమకు గురి చేస్తున్నాయా అనే అనుమానం కూడా. భ్రుకుటి ముడిచి నిశితంగా చూస్తే తెలుస్తుంది అది దారాలు చేసిన మాయ అని. పోరింగ్ ఆర్ట్‌ను తలపిస్తూ రంగుల దారాలు పెయింటింగ్ ఫ్రేమ్ నుంచి కిందకు జాలువారి ఉన్నాయి. మొత్తం 14 చిత్రాలవి. అన్నింటిలోకి పెద్ద చిత్రం పదకొండు అడుగుల ఎత్తు, ఏడున్నర అడుగుల వెడల్పు ఉంది. ఒక్కొక్కటి ఒక్కొక్క థీమ్‌తో ఉన్నాయి. కానీ ప్రధానంగా 'అమ్మ' మనసును ప్రతిబింబిస్తున్నాయి. అమ్మ బొమ్మ కనిపించదు, నిద్రపోతున్న బిడ్డను సంతృప్తిగా చూసుకునే భావం బొమ్మల్లో ద్యోతకమవుతుంది. ఆ చిత్రాల రూపకర్త ఓ తెలుగు మహిళ. పేరు మానసప్రియ. ఆమె ఈ కళారూపాల కోసం ఐదేళ్ల నిరంతరంగా శ్రమించారు. పిన్నికి ఇచ్చిన మాట కోసం ఆమె జీవించి ఉండగానే ప్రదర్శించడం కోసం రెండేళ్ల పాటు నిద్రను త్యాగం చేస్తూ పని చేశారు. ఆమె పని చేస్తున్న వేగం కంటే పిన్నిని ఆవరించిన క్యాన్సర్ ఇంకా వేగంగా విస్తరించింది. పిన్నిని తీసుకువెళ్లిపోయింది. పిన్ని సీత ప్రథమ వర్ధంతికి మానస ప్రియ ఇచ్చిన కన్నీటి కళాసుమాంజలి ఈ ప్రదర్శన. తాను ఆర్టిస్ట్ అయిన నేపథ్యాన్ని, చిత్రకళలో చేస్తున్న ప్రయోగాలను సాక్షితో పంచుకున్నారామె.

ప్రకాశం నుంచి బళ్లారి

''మా తాతలు ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా నుంచి కర్నాటకలోని బళ్లారికి వచ్చి స్థిరపడ్డారు. అలా నేను బళ్లారిలో పుట్టాను. నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం ఇష్టం. పెన్సిల్‌తో చక్కటి రూపాన్ని తీసుకురాగలిగేదాన్ని. స్కూల్‌లో ప్రైజ్‌లు కూడా వచ్చాయి. అయితే నాకు పెద్ద అడ్డంకి చదువే. ఎంత ప్రయత్నించినా మార్కులు పెద్దగా వచ్చేవి కాదు. అందులో నా అదృష్టం ఏమిటంటే... మార్కులు రావడం లేదని చదువు మానిపించకుండా ఫైన్ ఆర్ట్స్‌లో (బి.ఎఫ్.ఎ) చేర్పించడం. హైదరాబాద్‌లో లాలాపేట నుంచి ఉదయం ఐదింటికి ఉప్పల్‌కి వెళ్లి అక్కడి ప్రకృతి దృశ్యాలను బొమ్మలు వేశాను. పదిరోజులు వైజాగ్‌లో కాలేజ్ బల్లల మీద పడుకుంటూ ప్రాజెక్ట్ చేశాను. బీఎఫ్ఏ పూర్తయిన తర్వాత బెంగళూరులో విజువల్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ చేశాను. ఇవన్నీ చేసిన తర్వాత ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందే లోపే పెళ్లి. పిల్లల కోసం కొంత గ్యాప్ తీసుకున్నాను. తొమ్మిదేళ్ల విరామం తర్వాత రేఖ అనే ఫ్రెండ్ ఆహ్వానంతో కేరళ, ఫోర్ట్ కొచ్చిలో నా చిత్రాలను ప్రదర్శించాను. అప్పటికి ఉలెన్ పెయింటింగ్స్ మొదలు పెట్టలేదు. అయితే ఆర్టిస్ట్‌గా ఊరికే ఉండకుండా ఏదో ఒక ప్రయోగం చేసేదాన్ని. అలా టెర్రారియమ్ అని గాజు సీసాల్లో మొక్కలను పెంచడం వంటి హాబీలు ప్రాక్టీస్ చేశాను. ఆ తర్వాత పెయింటింగ్‌లో ఇప్పుడు మీరు చూస్తున్న ఉలెన్ ప్రయోగం మొదలు పెట్టాను. మా వారి ఉద్యోగరీత్యా ఇప్పుడు పూనాలో ఉంటున్నప్పటికీ నా ఆర్ట్ ప్రయోగాలు మానలేదు.

నా పేరు మీద మొక్క

బెంగళూరులో ఎగ్జిబిషన్ నాలుగు రోజులు సాగింది. ఓ రోజు అరవై దాటిన మహిళలు ఐదుగురు వచ్చారు. 'మేము అక్కాచెల్లెళ్లం. ఓ సిస్టర్ ఈ రోజే కెనడా నుంచి వచ్చింది. ఈ ఎగ్జిబిషన్ చూసి తీరాలని తనను నేరుగా తీసుకువచ్చాం' అని చెప్పారు. అలాగే ఎగ్జిబిషన్ చివరి రోజు ఆర్ట్ గ్యాలరీ ప్రెసిడెంట్‌గారు వచ్చి 'వాళ్ల కాలేజ్‌లో రెండు రోజులు ఎగ్జిబిషన్ కావాల'ని అడిగారు. ఆరు వందల మంది విద్యార్థుల మధ్య నాతోనే ప్రారంభోత్సవం చేయించి, కాలేజ్ ప్రాంగణంలో నా పేరు మీద మొక్క నాటారు. ఐదేళ్లు నేను ఇంటి నాలుగ్గోడల మధ్య పడిన శ్రమ నాకో ప్రత్యేకతను తెచ్చింది. నేను అభ్యసించిన కోర్సుకి మరో కొత్త ఆర్ట్ ఫార్మ్‌ను జత చేయగలుగుతున్నాననే సంతృప్తి కలుగుతోంది'' అన్నారు మానస ప్రియ.

- వాకా మంజులారెడ్డి

నా బొమ్మల్లో అమ్మ ఉంది



నేను ఆర్టిస్ట్‌ని, తల్లిని. ఉలెన్ ఆర్ట్ మాధ్యమంగా అమ్మ మనసును ఆవిష్కరించే ప్రయత్నం చేశాను. పిల్లలు మెలకువగా ఉన్నప్పటికంటే నిద్రపోతున్నప్పుడు చాలా బాగుంటారు. ఎంత సేపు చూసినా ఇంకా చూడాలనిపిస్తుంది. ఉలెన్ ఆర్ట్‌లో పిల్లల ముఖంలో ప్రసన్నత కోసం నేను శ్రద్ధగా పని చేయడాన్ని మా సీత పిన్ని చాలా ఇష్టంగా చూసేది. 'ఈ కళాఖండాలతో ఎగ్జిబిషన్ పెడితే చూడాలని ఉంది' అని చెప్పిందో సారి. 'అలాగే చూస్తావు పిన్నీ' అన్నాను. కానీ ఆ తర్వాత కొన్నాళ్లకే తెలిసింది పిన్నికి క్యాన్సర్ అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉందని. అప్పటి వరకు మామూలుగా ప్రాక్టీస్ చేసిన నేను త్వరగా పూర్తి చేయాలని చాలా దీక్షగా పనిచేశాను. రెండేళ్ల పాటు రోజుకు నాలుగు గంటలే నిద్రపోయాను. నేనెంత ఆత్రుత పడినప్పటికీ పిన్ని ఉండగా ఆ పని చేయలేకపోయాను. గత ఏడాది పిన్ని ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయింది. పిన్ని తొలి వర్ధంతి నాటికి ఎగ్జిబిషన్ పెట్టి తీరాలని ఈ ఏడాది నవంబర్‌లో ఆ పని చేయగలిగాను. ఈ ప్రక్రియలో నాకు చాలా మంది సహాయం చేశారు. అంజలి పట్వర్ధన్ నా ప్రతి బొమ్మకు ఒక పోయెమ్ రాశారు. ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటులో ఫ్రెండ్ తేజస్విని సహాయం చేసింది.

- ధూళిపాళ్ల మానస ప్రియ, ఉలెన్ ఆర్టిస్ట్

ఇంటిప్స్



- పింగాణీ కప్పులకు, సాసర్లకు కాఫీ, టీ మరకలు పట్టి వదలనట్లయితే సోడియం బైకార్బనేట్‌లో కొద్దిగా నీటిని కలిపి ఈ పేస్టుతో శుభ్రం చేయాలి.
- ప్లేయింగ్ కార్డ్స్ పట్టుకుంటే చేతులకు అంటుకున్నట్లుంటే వాటి మీద టాల్కం పౌడర్ చల్లి ఒక కవర్‌లో వేసి బాగా కదిలించాలి. జిడ్డు, మురికి టాల్కం పౌడర్‌కు అంటుకుని రాలిపోతుంది.
- కిచెన్ ప్లాట్‌ఫాం మీద కాని స్టవ్ మీద కాని జిడ్డు మరకలుంటే ముందుగా కొద్దిగా నీళ్లచల్లి సోడియం బైకార్బనేట్ చల్లాలి. రెండు -మూడు నిమిషాల తర్వాత స్పాంజ్‌తో కాని, క్లాత్‌తో కాని తుడవాలి.
- కిచెన్‌లో అవెన్, స్టవ్, ప్లాట్‌ఫాం తుడిచే స్పాంజ్‌లు, బ్రష్‌లు కొద్ది రోజులు వాడిన తర్వాత వాసన పట్టేస్తుంటాయి. వాటిని నీటిలో ఒక టేబుల్ స్పూన్ సోడియం బైకార్బనేట్, నాలుగు చుక్కల డిష్‌వాష్ లిక్విడ్ కలిపి రాత్రంతా నానబెట్టి శుభ్రం చేయాలి.
- ఫ్రిజ్‌ను శుభ్రం చేయాలంటే ఒక లీటరు నీటిలో ఒక కప్పు సోడియం బై కార్బనేట్ కలిపి ఆ మిశ్రమంలో స్పాంజ్‌ను ముంచి లోపలి అరలన్నీ తుడవాలి. తర్వాత మంచినీటిలో ముంచి పిండేసిన స్పాంజ్‌తో మరొకసారి తుడవాలి.
- థర్మాస్ ఫ్లాస్కులోపల వాసన వస్తుంటే ఒకటేబుల్ స్పూన్ సోడియం బైకార్బనేట్ వేసి నిండా నీటిని పోయాలి. రాత్రంతా అలాగే ఉంచి ఉదయాన్నే కడిగితే వాసన పోయి శుభ్రంగా ఉంటుంది. అవసరమని పిస్తే బ్రష్‌తో రుద్దవచ్చు.



- స్టెయిన్‌లెస్ స్టీల్ సింకులో రెండు స్పూన్ల సోడియం బైకార్బనేట్ చల్లి కొద్దిగా నీటిని చల్లిరుద్ది కడిగితే బాగా శుభ్రపడి కొత్తదానిలా మెరుస్తుంది.

స్పృహ

మార్కెటింగ్ హెడ్‌గా పని చేసిన సనా మిట్టల్‌కు కస్టమర్ నాడి తెలియడంతో పాటు సమస్యలు కూడా తెలుసు. ఈ స్పృహ ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌గా కొత్త అడుగులు వేసేలా చేసింది...

పల్లె మనసు చదివిన తరువాత...



● సనా మిట్టల్

'ఫ్లోరెస్' రూపంలో ఫెమినైన్ హైజీన్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టిన సనా మిట్టల్ తన వ్యాపారానికి అతీతంగా మెనుస్ట్రువల్ హైజీన్ గురించి అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తోంది. 'మా బ్రాండ్ ఉద్దేశం వస్తువులు అమ్ముకోవడం మాత్రమే కాదు స్త్రీ సాధికారతకు పెద్దపీట వేయడం కూడా' అంటున్న సనా మిట్టల్ హైస్కూల్, కాలేజీలలో వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు నిర్వహిస్తోంది.

'ఇప్పటికీ చాలా కుటుంబాలలో అమ్మాయిలకు రుతుస్రావం గురించి ఏమీ చెప్పరు. తీరా ఆ టైమ్ వచ్చిన తరువాత అమ్మాయిలు శుభ్రత గురించి అవగాహన లేక రకరకాల సమస్యలకు గురవుతున్నారు. రుతుస్రావంపై ఉన్న మూఢనమ్మకాలను కూడా తొలిగించే ప్రయత్నం చేస్తున్నాం' అంటోంది సనా.

వివిధ ప్రాంతాలలో 'ఫ్లోరెస్' తరఫున గైనకాలజీ కన్సల్టెంట్‌లు ఉచితంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇంటిమేట్ కేర్, పీరియడ్ కేర్, గ్రూమింగ్ అండ్ టాయిలెట్ హైజీన్ అనే నాలుగు విభాగాలను తీసుకొని, కోటిమంది మహిళలను లక్ష్యంగా చేసుకొని దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధం అవుతోంది సనా.

పంజాబ్ యూనివర్శిటీలో ఎంబీఏ చేసిన సనా, ఆ తరువాత ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీలో మార్కెటింగ్ హెడ్‌గా పనిచేసింది. వృత్తిరీత్యా ఎన్నో గ్రామాలకు వెళ్లినప్పుడు 'శానిటరీ నాప్‌కిన్' గురించి ఎన్నో విషయాలను కథలు కథలుగా వినేది. స్థూలంగా తనకు అర్థమైన విషయమేమిటంటే గ్రామీణప్రాంతాలలో చాలామంది మహిళలకు రుతుస్రావ శుభ్రతకు సంబంధించిన అవగాహన లేదని.


దీంతో 'ఫ్లోరెస్' అనే స్టార్టప్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా అడుగులు వేసింది సనా. ఫ్లోరెస్ అనేది మెనుస్ట్రువల్ కప్స్ నుంచి టాయిలెట్ సీటు కవర్స్ వరకు ఎన్నో రకాల ఉత్పత్తులకు కేంద్రం.

'పోరాటం నుంచే శక్తి వస్తుంది' అనే మాటను గట్టిగా నమ్ముతుంది సనా.

ఆమె సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగడం వెనుక ఎంతో పోరాటం ఉండి ఉండవచ్చు. సక్సెస్ అయిన తరువాత కూడా ఆ పోరాటం తనతో పాటే ఉంది. అయితే అది ఇప్పుడు రకరకాల మూఢనమ్మకాలపై అనేది నిజం.

బ్యూటిప్స్

అలొవెరా.. టీ బ్యాగ్..



చలికాలం పెదవులు పొడిబారడం సహజంగా జరుగుతుంటుంది. ఈ సమస్యకు విరుగుడుగా.. కొబ్బరినూనె, తేనె కలిపి పెదవులపై రాసి, మసాజ్ చేయాలి. రోజులో 4 -5 సార్లు ఈ విధంగా చేస్తూ ఉంటే పెదవులు పొడిబారడం, పగుళ్ల సమస్యలు తగ్గి, మృదువుగా అవుతాయి.

అలొవెరా జెల్ చర్మం పగుళ్లను నివారిస్తుంది. రాత్రి పడుకునే ముందు పొడిబారిన పెదవులకు అలొవెరా జెల్‌ని రాయాలి. లేదా రోజ్‌వాటర్‌లో గ్లిజరిన్ కలిపి, పడుకునేముందు పెదవులకు రాసుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే పెదవుల చర్మం మృదువుగా అవుతుంది.

గోరువెచ్చని నీటిలో టీ బ్యాగ్ ముంచి, పిండి, ఆ బ్యాగ్‌ను పెదవులపై మూడు నిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల పెదవుల చర్మంపై తేమ స్థాయి పెరుగుతుంది. దీనివల్ల పెదవులు పొడిబారకుండా ఉంటాయి.

సైబర్ టాక్

టెలిగ్రామ్ స్కామ్!!

టెలిగ్రామ్ రెండవ అత్యంత ప్రజాదరణ పొందిన క్రాస్-ప్లాట్‌ఫారమ్ మెసేజింగ్ అప్లికేషన్. ఇది విస్తృతంగా ఉపయోగించబడుతుంది. ఎందుకంటే ఇది మెరుగైన గోప్యత, ఎన్‌క్రిప్షన్ లక్షణాలతో పాటు రెండు లక్షల మంది సామర్థ్యం వరకు పెద్ద గ్రూప్ చాట్ ఫీచర్‌లకు కూడా మద్దతు ఇస్తుంది. టెలిగ్రామ్ తన వినియోగదారులకు మీడియా పరిమాణాలపై పరిమితులు లేకుండా అనేక ఫీచర్లను అందిస్తుంది.

ప్రయోజనాలు

(ఎ) వాట్సాప్ గ్రూప్‌లలో 256 మంది సభ్యుల వరకు ఉండచ్చు. అదే, టెలిగ్రామ్ అయితే రెండు లక్షల మంది ఒక గ్రూప్‌గా ఉండవచ్చు. (బి) టెలిగ్రామ్ ప్రాథమికంగా మీరు రహస్యంగా ఎంచుకున్న సంభాషణలను ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. ఇది మీ గోప్యతను మెరుగుపరుస్తుంది. (సి) టెలిగ్రామ్ యాప్ పూర్తిగా ఉచితం. టెలిగ్రామ్‌లో బాధించే ప్రకటనలు ఉండవు (డి) మెసేజ్‌లను పంపిన వారికి, వాటిని స్వీకరించిన వారికి భద్రత ఉంటుంది.

స్కామ్‌లు

టెలిగ్రామ్ స్కామ్‌లు మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో జరుగుతాయి లేదా మెసేజింగ్ అప్లికేషన్ నుండి వినియోగదారులను ప్రమాదకరమైన థర్డ్ పార్టీ సైట్‌లు, అప్లికేషన్‌లలోకి లాగుతాయి. టెలిగ్రామ్‌కు విస్తృతమైన ఆమోదం, వాడుకలో సౌలభ్యం కారణంగా స్కామర్‌లు జొరబడతారు.

చాలా సార్లు, స్కామర్‌లు తమను తాము చట్టబద్ధమైన ఏజెంట్లుగా లేదా వివిధ కార్పొరేషన్‌ల ఉద్యోగులుగా చూపించుకోవడం చూస్తుంటాం.

స్కామర్లు తరచుగా బాధితులను ఆకర్షించడానికి ప్రముఖ ఛానెల్‌ల నకిలీ/నకిలీ వెర్షన్‌లను సృష్టిస్తారు. ఈ గ్రూప్‌లు ఒకే విధమైన పేర్లు, ప్రొఫైల్ చిత్రాలను కలిగి ఉంటాయి. అదే పిన్ చేయబడిన సందేశాలను కలిగి ఉంటాయి. దాదాపు చట్టబద్ధమైన వాటితో సరిపోలే వినియోగదారు పేర్లతో ఉంటాయి. ప్రమోషన్లు, ఉచిత బహుమతులు, ఎమ్ఎల్ఎమ్ ఆధారిత పథకాలతో కూడిన స్కామ్‌లకు ప్రజలు బలైపోతుంటారు. స్కామర్‌లు సమస్యను పరిష్కరించడానికి మీ ల్యాప్‌టాప్ లేదా పరికరం రిమోట్ కంట్రోల్ తీసుకోవాలని తరచూ అడుగుతారు. ఈ ప్రక్రియలో మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరిస్తారు.

ఎ) బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు

నాణేలు, డబ్బు లేదా ఖాతా లాగిన్‌ల నుండి బాధితులను స్కామ్ చేయడానికి స్కామర్లు టెలిగ్రామ్‌లో తమను తాము క్రిప్టో నిపుణులుగా చెప్పుకుంటారు. తమను తాము నిపుణులుగా చూపిస్తూ, వారు బాధితుల క్రిప్టో పెట్టుబడులపై హామీతో కూడిన రాబడిని వాగ్దానం చేస్తారు. వారి స్కామ్‌లో భాగంగా, వారు తమ పెట్టుబడి పెరుగుతున్నట్లు చూపే బాధితుల చార్ట్‌లు, గ్రాఫ్‌లను చూపుతారు (ఈ సభ్యులలో ఎక్కువ మంది నకిలీ లేదా చెల్లించిన సోషల్ మీడియా నిపుణులు). బాధితుడు వాలెట్ లేదా డ్యాష్‌బోర్డ్‌లో ప్రదర్శించిన విధంగా వారి ఆదాయాలను ఉపసంహరించుకోలేరు. ఆ సమయంలో స్కామర్లు అదృశ్యమవుతారు. గ్రూప్‌లలో ఎప్పుడూ స్పందించరు.

బి) బాట్‌లను ఉపయోగించి ఫిషింగ్

టెలిగ్రామ్ ప్లాట్‌ఫారమ్‌లో బాట్‌లను నిర్మించే, ఉపయోగించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఎపిఐ ఉండటం వలన, వారు రియల్ సంభాషణలలో పాల్గొంటారు. దీంతో మీరు స్కామ్‌కి గురవుతున్నారో లేదో చెప్పడం కష్టం. అంటే, ఒక నకిలీ బాట్, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు అప్లికేషన్‌ల నుండి ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. ఈ బాట్ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా లాగిన్‌లు, పాస్‌వర్డ్‌లు, క్యూ ఆర్ కోడ్‌లను కూడా వదులుకోమని వినియోగదారుని కాల్ చేస్తుంది, ఒప్పిస్తుంది.

సి) టెక్ సపోర్ట్ స్కామ్‌లు

ఈ స్కామ్‌లో స్కామర్లు చట్టబద్ధమైన టెక్ సపోర్ట్ ఏజెంట్లలా నటిస్తుంటారు. స్కామర్‌లు సమస్యను పరిష్కరించడానికి బాధితుల ల్యాప్‌టాప్ లేదా పరికరాన్ని రిమోట్ కంట్రోల్‌గా తీసుకుంటారు. ఈ ప్రక్రియలో బాధితుల వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరిస్తారు.

డి) రొమాన్స్/ సెక్స్‌టార్షన్ స్కామ్‌లు

సోషల్ మీడియా నిషేధించిన సాన్నిహిత్యాలు, నిషేధించిన ప్రవర్తనలలో పాల్గొనడానికి అవకాశాన్ని సృష్టిస్తుంది. స్కామర్‌లు దీన్ని ఉపయోగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వినియోగదారుతో నమ్మకాన్ని పొందేందుకు వారితో సంబంధాన్ని ప్రారంభిస్తారు. బాధితులు తమకు సున్నితమైన ఫొటోలు లేదా వీడియోలను పంపమని అడుగుతారు, ఆ పై వారు బ్లాక్‌మెయిల్ కోసం ఉపయోగిస్తారు. ఇతర రకాల శృంగార మోసాలు (ఎ) ప్రతిపాదనలతో దోపిడి. (బి) అందమైన స్త్రీ లేదా పురుషుడు. (సి) గే మ్యాన్ పే మేకింగ్.

టెలిగ్రామ్ యాప్‌లో భద్రతా చిట్కాలు

ఎ) మీ అన్ని రకాల పాస్‌వర్డ్‌లకు కనీసం 10 పెద్ద, చిన్న అక్షరాలు, సంఖ్యలు, చిహ్నాలు, ప్రత్యేకమైనవి, ఊహించడానికి కష్టంగా ఉండేలా నిర్వహణకు ఉపయోగించడాన్ని పరిగణించండి.
బి) తెలిసిన మూలాల ద్వారా పంపబడినప్పటికీ, https://www.unshorten.it లేదా https://www.checkshorturl.comను ఉపయోగించి సంక్షిప్త URLs / Links ధృవీకరించండి
సి) తెలియని పరిచయాల ద్వారా పంపబడిన అటాచ్‌మెంట్స్‌ను క్లిక్ చేయడానికి లేదా డౌన్‌లోడ్ చేయడానికి ముందు https://www.isitphishing.org or https://www.urlvoid.com వెబ్‌లింక్ ద్వారా ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయండి.
డి) వినియోగదారు ప్రొఫైల్‌కి వెళ్లి, మీ స్క్రీన్ మూలలో ఉన్న మూడు చుక్కలపై క్లిక్ చేసి, 'యూజర్ బ్లాక్' ని ఎంచుకోండి.
ఇ) స్కామ్ ఖాతా స్క్రీన్‌షాట్, ఏదైనా ఇతర సమాచారాన్ని టెలిగ్రామ్‌లోని @notoscam పంపండి. లేదా ప్రత్యామ్నాయంగా ఇమెయిల్: abuse@telegram.orgకి పంపవచ్చు.





ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



తొలి మ్యాచ్‌లో ప్రణయ్ పరాజయం

బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌ను భారత ప్లేయర్ హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమితో ప్రారంభించాడు. బ్యాంకాక్‌లో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ ప్రణయ్ 11–21, 21–9, 17–21తో 14వ ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో చైనా ప్లేయర్, ప్రపంచ 17వ ర్యాంకర్ లూ గ్వాంగ్ జుతో ప్రణయ్ తలపడతాడు. సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే ప్రణయ్ ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి.

ఈశ్వరన్ సెంచరీ: భారత్ 'ఎ'కు ఆధిక్యం



కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (144 బ్యాటింగ్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించడంతో... బంగ్లాదేశ్ 'ఎ' జట్టుతో సిల్హెట్‌లో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టుకు 72 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 8/0తో రెండో రోజు బరిలోకి దిగిన భారత్ 'ఎ' ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్లకు 324 పరుగులు చేసింది. పుజారా (52; 7 ఫోర్లు), కోన శ్రీకర్ భరత్ (77; 10 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు.



గెలి'చాను' రజతం

ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మెరిసిన మీరాబాయి చాను

బొగోటా (కొలంబియా): మణికట్టు గాయం బాధిస్తున్నా... భారత స్టార్ మహిళా వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను వెనక్కి తగ్గలేదు. ప్రయత్నిస్తే పతకం రాకపోదా అని ఆశాభావంతో మొండి పట్టుదలగా బరిలోకి దిగిన ఈ మణిపూర్ తార అనుకున్నది సాధించింది. ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన 49 కేజీల విభాగం పోటీల్లో మీరాబాయి రెండో స్థానంలో నిలిచింది. 28 ఏళ్ల మీరాబాయి స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 113 కేజీలు కలిపి మొత్తం 200 కేజీలు బరువెత్తింది. జియాంగ్ హుయ్‌హువా (చైనా; 206 కేజీలు) స్వర్ణం సాధించగా... జిహువా (చైనా; 198 కేజీలు) కాంస్యం దక్కించుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో మీరాబాయికిది రెండో పతకం. 2017లో ఆమె 48 కేజీల విభాగంలో స్వర్ణం సాధించింది. 'మణికట్టు గాయం వేధిస్తున్నా దేశానికి పతకం అందించాలనే పట్టుదలతో ప్రయత్నించి సఫలమయ్యాను. వచ్చే ఏడాది ఆసియా క్రీడల్లో, ఆ తర్వాత పారిస్ ఒలింపిక్స్‌లోనూ పతకాలు సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తా' అని మీరాబాయి తెలిపింది.

4 ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు అంతకంటే ఎక్కువ పతకాలు సాధించిన నాలుగో భారత మహిళా లిఫ్టర్‌గా మీరాబాయి గుర్తింపు పొందింది. గతంలో కుంజరాణి దేవి (7 రజత పతకాలు), కరణం మల్లీశ్వరి (2 స్వర్ణాలు, 2 కాంస్యాలు), నీలంశెట్టి లక్ష్మీ (1 రజతం, 1 కాంస్యం) ఈ ఘనత సాధించారు.

స్వదేశానికి రోహిత్ శర్మ

మిర్పూర్: కెప్టెన్ రోహిత్ బొటన వేలికి పెద్దగాయమే అయినా రెండో వన్డేలో పంటిబిగువన భరించి అసాధారణ పోరాటం చేశాడు. అయితే గాయం తీవ్రత దృష్ట్యా స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్ష చేయించుకునేందుకు అతను స్వదేశానికి పయనమవుతాడని టీమిండియా హెడ్ కోచ్ ద్రవిడ్ తెలిపారు. చహర్ కండరాల గాయంతో, వెన్నునొప్పితో కుల్దీప్ సేన్ కూడా భారత్‌కు బయల్దేరతారని ద్రవిడ్ చెప్పారు. 'బొటన వేలికి గాయమైనప్పటికీ కుట్లు పడ్డాయి కానీ... విరగలేదు! అందువల్లే నేను బ్యాటింగ్ చేయగలిగాను' అని రోహిత్ వెల్లడించాడు.

సిరీస్ సమర్పయామి

ఏడేళ్ల క్రితం ధోని సారథ్యంలో... ఇప్పుడేమో రోహిత్ శర్మ కెప్టెన్సీలో బంగ్లాదేశ్ గడ్డపై టీమిండియా చేష్టలుడిగింది. ఈసారి మాత్రం పూర్తిగా బంగ్లాదేశ్ జట్టు చేతిలో కాకుండా ఆ జట్టులోని ఒక్క ప్లేయర్ మెహదీ హసన్ మిరాజ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనకు టీమిండియా ఓడిందని చెప్పొచ్చు. ఈ ఆల్‌రౌండర్ వీరోచిత శతకంతో ఒకదశలో 69/6 స్కోరుతో ఉన్న బంగ్లాదేశ్ చివరకు 271/7 చేస్తే... ఛేజింగ్‌లో 172/4 స్కోరుతో ఉన్న భారత్ ఆఖరికి 266/9 స్కోరు చేసి ఓడింది.

- రెండో వన్డేలోనూ ఓడిన భారత్
- చివర్లో ఆశలు రేపిన రోహిత్ ఆట
- సిరీస్ 2–0తో బంగ్లాదేశ్ సొంతం
- మిరాజ్ అజేయ సెంచరీ



మిరాజ్



కోహ్లి క్లీన్‌బౌల్డ్



రోహిత్

మిర్పూర్: మరోసారి బంగ్లాదేశ్ పర్యటనలో భారత్‌కు చేదు ఫలితమే ఎదురైంది. ఇంకో వన్డే మిగిలుండగానే టీమిండియా 0–2తో సిరీస్‌ను కోల్పోయింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెహదీ హసన్ మిరాజ్ (83 బంతుల్లో 100 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు; 2/46) ఆల్‌రౌండ్ ప్రదర్శన ముందు భారత కెప్టెన్ రోహిత్ శర్మ (28 బంతుల్లో 51 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్) ఆశలు రేపిన మెరుపులు చిన్నబోయాయి. దీంతో భారత్ 5 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చేతిలో ఓడింది. మొదట బంగ్లా 50 ఓవర్లలో 7 వికెట్లకు 271 పరుగులు చేసింది. మహ్ముదుల్లా (96 బంతుల్లో 77; 7 ఫోర్లు) రాణించాడు. అనంతరం టీమిండియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 266 పరుగులే చేసి ఓడింది. శ్రేయస్ అయ్యర్ (82; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (56; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. సిరీస్‌లో చివరిదైన మూడో వన్డే శనివారం జరుగుతుంది.

సీమర్లు సిరాజ్, ఉమ్రాన్ మాలిక్.. స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌కు బంగ్లాదేశ్ 69/6తో కష్టాల్లో పడింది. ఈ దశలో మహ్ముదుల్లా, ఎనిమిదో స్థానంలో దిగిన మెహదీ హసన్ ఏడో వికెట్‌కు 148 పరుగులు జోడించి భారీస్కోరుకు బాట వేశారు. కడదాకా అజేయంగా నిలిచిన మిరాజ్ 83 బంతుల్లో (8 ఫోర్లు, 4 సిక్సర్లు) ఇన్నింగ్స్ ఆఖరి బంతికి పరుగు తీసి వన్డే కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు.

భారత ఇన్నింగ్స్ మొదలైన తొలి బంతికి కోహ్లి (4) బౌండరీ కొట్టాడు. కానీ ఇబాదత్ తర్వాతి ఓవర్లో క్లీన్‌బౌల్డయ్యాడు. మరుసటి ఓవర్లో ధావన్, కాసేపటికి సుందర్, రాహుల్ కూడా అవుటయ్యారు. ఈ దశలో శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ ఐదో వికెట్‌కు 107 పరుగులు జోడించారు. 172/4 స్కోరుతో జట్టు లక్ష్యం చేరే దారిలో కనిపించింది కానీ అదే స్కోరు వద్ద అయ్యర్‌ను మిరాజ్ అవుట్ చేసి భారత్‌ను కష్టాల్లో నెట్టాడు.

రోహిత్ ధనాధన్...

శార్దుల్ (7), చహర్ (11), బంతులు వృథా చేసి అవుటయ్యారు. 45.1 ఓవర్లలో భారత్ స్కోరు 213/8! ఇంకా 29 బంతుల్లో 59 పరుగుల సమీకరణం భారత్‌కు ఓటమిని ఖాయం చేసింది. ఈ దశలో ఫీల్డింగ్‌లో చేతి వేలికి గాయమైన రోహిత్ 9వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఇబాదత్ 45వ ఓవర్లో 2 సిక్సర్లు, ఒక బౌండరీ బాదాడు. కానీ అవతలివైపు సిరాజ్ బంతులు వృథా చేశాడు. 48వ ఓవర్నైతే మెయిడిన్ చేశాడు. 12 బంతుల్లో 40 పరుగులు చేయాల్సిన దశలో రోహిత్ రెండు సిక్సర్లు కొట్టాడు. రెండుసార్లు క్యాచ్‌లు నేలపాలై బతికి పోయాడు. మొత్తానికి ఈ ఓవర్లో 20 పరుగులొచ్చాయి. సిరాజ్ ఆఖరి బంతికి అవుటయ్యాడు. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సిన దశలో ముస్తఫిజుర్‌ను రోహిత్ ఎదుర్కొన్నాడు. 2, 3 బంతుల్లో బౌండరీలు కొట్టగా.. నాలుగో బంతికి పరుగు రాలేదు. 2 బంతుల్లో 12 పరుగుల సమీకరణం భారత్‌ను ఊరించింది. ఉత్కంఠ ఉన్నపళంగా పెరిగింది. ఐదో బంతిని రోహిత్ సిక్సర్ కొట్టాడు. ఆఖరి బంతి సిక్స్ కొడితే భారత్‌దే విక్టరీ! కానీ ముస్తఫిజుర్ యార్కర్ వేయడంతో రోహిత్ సిక్స్ కొట్టలేకపోయాడు. భారత్ ఓటమి ఖరారైంది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: అనాముల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 11; లిటన్ దాస్ (బి) సిరాజ్ 7; నజ్ముల్ (బి) ఉమ్రాన్ 21; షకీబ్ (సి) ధావన్ (బి) సుందర్ 8; ముష్ఫికర్ (సి) ధావన్ (బి) సుందర్ 12; మహ్ముదుల్లా (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 77; అఫీఫ్ (బి) సుందర్ 0; మెహదీ హసన్ మిరాజ్ (నాటౌట్) 100; నజుమ్ (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు)** 271. **వికెట్ల పతనం:** 1–11, 2–39, 3–52, 4–66, 5–69, 6–69, 7–217. **బౌలింగ్:** దీపక్ చహర్ 3–0–12–0, సిరాజ్ 10–0–73–2, శార్దుల్ 10–1–47–0, ఉమ్రాన్ 10–2–58–2, సుందర్ 10–0–37–3, అక్షర్ పటేల్ 7–0–40–0.

భారత్ ఇన్నింగ్స్: కోహ్లి (బి) ఇబాదత్ 5, ధావన్ (సి) మిరాజ్ (బి) ముస్తఫిజుర్ 8; అయ్యర్ (సి) అఫీఫ్ (బి) మిరాజ్ 82; సుందర్ (సి) లిటన్‌దాస్ (బి) షకీబ్ 11; రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మిరాజ్ 14; అక్షర్ (సి) షకీబ్ (బి) ఇబాదత్ 56; శార్దుల్ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) షకీబ్ 7; దీపక్ చహర్ (సి) నజ్ముల్ (బి) ఇబాదత్ 11; రోహిత్ శర్మ (నాటౌట్) 51; సిరాజ్ (బి) మహ్ముదుల్లా 2; ఉమ్రాన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు)** 266. **వికెట్ల పతనం:** 1–7, 2–13, 3–39, 4–65, 5–172, 6–189, 7–207, 8–213, 9–252. **బౌలింగ్:** మిరాజ్ 6.1–0–46–2, ఇబాదత్ 10–0–45–3, ముస్తఫిజుర్ 10–1–43–1, నజుమ్ 10–0–54–0, షకీబ్ 10–1–39–2, మహ్ముదుల్లా 3.5–0–33–1.

పోర్చు'గోల్స్' మోత

- ప్రిక్వార్టర్ ఫైనల్లో 6–1తో స్విట్జర్లాండ్‌పై ఘనవిజయం
- క్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్
- రామోస్ 'హ్యాట్రిక్'

దోహా: ఆరంభం నుంచి సూపర్ స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డోను ఆడించకపోయినా... తమ జట్టులో ప్రతిభావంతులకు కొదవలేదని నిరూపిస్తూ పోర్చుగల్ జట్టు ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో కళ్లు చెదిరే ప్రదర్శనతో మెరిసింది.



రామోస్

ఆద్యంతం దూకుడుగా ఆడుతూ, పూర్తి ఆధిపత్యం చలాయిస్తూ రొనాల్డో లేకున్నా పోర్చుగల్ జట్టు భవిష్యత్‌కు ఢోకా లేదని నిరూపించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన చివరి ప్రిక్వార్టర్ ఫైనల్లో పోర్చుగల్ 6–1 గోల్స్ తేడాతో స్విట్జర్లాండ్‌ను చిత్తుగా ఓడించి 16 ఏళ్ల తర్వాత మళ్లీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పోర్చుగల్ తరఫున తొలి ప్రపంచకప్‌లో ఆడుతున్న 21 ఏళ్ల గొన్సాలో రామోస్ (17వ, 51వ, 67వ ని.లో) మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' నమోదు చేయగా... పెపె (33వ ని.లో), రాఫెల్ గెరెరో (55వ ని.లో), రాఫెల్ లియా (90+2వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. స్విట్జర్లాండ్ జట్టుకు మాన్యుయెల్ అకాంజీ (58వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. చివరిసారి 1954లో ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన స్విట్జర్లాండ్ ఆ తర్వాత ఐదుసార్లు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. మరోవైపు ఎనిమిదోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న పోర్చుగల్ మూడోసారి క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. 1966లో మూడో స్థానంలో నిలిచిన పోర్చుగల్, 2006లో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. ఈనెల 10న జరిగే క్వార్టర్ ఫైనల్లో మొరాకోతో పోర్చుగల్ తలపడుతుంది.

తొలిసారి సబ్‌స్టిట్యూట్‌గా రొనాల్డో...

వరుసగా ఐదో ప్రపంచకప్‌లో ఆడుతున్న పోర్చుగల్ కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో తొలిసారి తుది 11 మంది జట్టులో చోటు కోల్పోయాడు. రొనాల్డో స్థానంలో గొన్సాలో రామోస్‌ను తొలి నిమిషం నుంచి ఆడించాలని కోచ్ ఫెర్నాండో సాంటోస్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. జాతీయ జట్టుకు ఒక్క మ్యాచ్ ఆడకుండానే నేరుగా ప్రపంచకప్ జట్టులో స్థానం సంపాదించిన రామోస్ ఘనా, ఉరుగ్వేలతో మ్యాచ్‌ల్లో సబ్‌స్టిట్యూట్‌గా చివరి నిమిషాల్లో బరిలోకి దిగాడు. అయితే కీలకమైన మ్యాచ్‌లో అత్యంత అనుభవజ్ఞుడు, 37 ఏళ్ల రొనాల్డోను కాదని రామోస్‌ను ఆరంభం నుంచే ఆడించడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అయితే తన ఎంపిక సరైనదేనని రామోస్ నిరూపించుకున్నాడు. మూడు గోల్స్ చేయడమే కాకుండా గెరెరో గోల్ చేయడానికి రామోస్ సహాయపడ్డాడు. పోర్చుగల్ ఖాతాలో ఐదు గోల్స్ జమయ్యాక.. 74వ నిమిషంలో రొనాల్డోను జావో ఫెలిక్స్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి పంపించారు. ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో రొనాల్డో రిజర్వ్ బెంచ్‌కు పరిమితమై మ్యాచ్ మధ్యలో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

క్వార్టర్ ఫైనల్స్ షెడ్యూల్

డిసెంబర్ 9

బ్రెజిల్ x క్రొయేషియా
రాత్రి గం. 8:30 నుంచి

అర్జెంటీనా x నెదర్లాండ్స్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

డిసెంబర్ 10

పోర్చుగల్ x మొరాకో
రాత్రి గం. 8:30 నుంచి

ఫ్రాన్స్ x ఇంగ్లండ్
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

సంక్రాంతికి కలుద్దాం



● చిరంజీవి

చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. హీరో రవితేజ ఓ లీడ్ రోల్ చేసిన ఈ సినిమాకు కేఎస్ రవీంద్ర (కొల్లి బాబీ) దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శ్రుతీహాసన్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేస్తున్నట్లు బుధవారం చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''సంక్రాంతికి కలుద్దాం'' అంటూ రిలీజ్ డేట్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు చిరంజీవి. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహ నిర్మాతలు: జీకే మోహన్, ఎం. ప్రవీణ్, స్క్రీన్‌ప్లే: కోన వెంకట్, కె. చక్రవర్తిరెడ్డి.

ఒక్క పాటతో పూర్తి



● బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వీరసింహారెడ్డి'. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం టాకీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకుంది. ''వీరసింహారెడ్డి' ఒక్క పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తమన్ సంగీతం అందించిన ఫస్ట్ సింగిల్ 'జై బాలయ్య..' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. 2023 జనవరి 12న సంక్రాంతికి మా సినిమాని విడుదల చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబీ, సీఈవో: చిరంజీవి (చెర్రీ), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చందు రావిపాటి, లైన్ ప్రొడ్యూసర్: బాల సుబ్రమణ్యం కేవీవీ.

మా అమ్మ కోసం విరూపాక్ష చేశాను

- సాయిధరమ్ తేజ్

''మా అమ్మ కోసం 'విరూపాక్ష' చేశాను. ఈ సినిమాకు వాయిస్ ఓవర్ ఇచ్చిన ఎన్టీఆర్‌కు థ్యాంక్స్. ఈ చిత్రానికి సుకుమార్‌గారు స్క్రీన్‌ప్లే అందించి, నిర్మాణ భాగస్వామిగా ఉండటం హ్యాపీ'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'విరూపాక్ష' అనే టైటిల్ ఖరారు చేశారు. బాపినీడు .బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను సాయిధరమ్ రిలీజ్ చేశారు. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో ఈ గ్లింప్స్ సాగుతుంది. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో 2023 ఏప్రిల్ 21న రిలీజ్ కానుంది. విలేకరుల సమావేశంలో కార్తీక్ దండు మాట్లాడుతూ– ''1990 నేపథ్యంలో ఫారెస్ట్ బేస్డ్ విలేజ్‌లో జరిగే థ్రిల్లర్ ఇది. అక్కడ జరిగే వింత పరిణామాలను హీరో ఎలా ఎదుర్కొన్నాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ప్రమాదం నుంచి కోలుకున్నాక సాయిధరమ్ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా మా సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు'' అన్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు సతీష్ బీకేఆర్, అశోక్ బండ్రెడ్డి, సంగీత దర్శకుడు అజనీష్ లోక్‌నాథ్ పాల్గొన్నారు.



● కార్తీక్ దండు, సాయిధరమ్, బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు

క్రికెటర్‌ని కావాలనుకున్నాను కానీ..

- యష్ పూరి



''చెప్పాలని ఉంది' సినిమాలో కథే పెద్ద హీరో. కథ బావుంటే ఆదరించడానికి ప్రేక్షకులు రెడీగా ఉంటారు. ఈ వారం విడుదలవుతున్న సినిమాల్లో మా 'చెప్పాలని ఉంది' మొదటి రెండు స్థానాల్లో ఉంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు యష్ పూరి. అరుణ్ భారతి. ఎల్ దర్శకత్వంలో యష్ పూరి, స్టెఫీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'చెప్పాలని ఉంది'. ఆర్బీ చౌదరి సమర్పణలో వాకాడ అంజన్ కుమార్, యోగేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా యష్ పూరి మాట్లాడుతూ– ''నేను క్రికెటర్‌ని కావాలని కల కన్నాను. హైదరాబాద్ రంజీ ట్రోఫీ ప్రాబబుల్స్ వరకూ వెళ్లాను. అయితే కొన్ని కారణాల వల్ల క్రికెట్ వదిలి, సినిమాతో ప్రేమలో పడ్డా. ఓ రకంగా నాకు అల్లు అర్జున్‌గారే స్ఫూర్తి. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'అలనాటి సిత్రాలు'లో నాకు తొలి చాన్స్ వచ్చింది. ఇప్పుడు సూపర్ గుడ్ ఫిలింస్‌లో 'చెప్పాలని ఉంది'తో సోలో హీరోగా లాంచ్ కావడం నా లక్. ఇందులో జర్నలిస్ట్ చంద్ర శేఖర్ పాత్రలో కనిపిస్తాను. ఈ సినిమా చేశాక మీడియా మీద మరింత గౌరవం పెరిగింది'' అన్నారు.

అప్పుడు ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోతాను

- కీర్తీ సురేశ్



సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ గురించిన చర్చలు అప్పుడప్పుడు తెరపైకి వస్తుంటాయి. తాజాగా క్యాస్టింగ్ కౌచ్ గురించి కీర్తీ సురేశ్ చేసిన వ్యాఖ్యలు సంచలనం అయ్యాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్ గురించి కీర్తి చెప్పిన విషయాలు వైరల్‌గా మారాయి. ''నా సహచర నటీమణులు కొందరు క్యాస్టింగ్ కౌచ్ గురించి నా దగ్గర చర్చించారు. నాకైతే క్యాస్టింగ్ కౌచ్ గురించిన చేదు అనుభవాలు ఎదురవ్వలేదు. కెరీర్ స్టార్టింగ్ నుంచే డీసెంట్‌గా, స్ట్రయిట్ ఫార్వార్డ్‌గా ఉంటున్నాను. అందుకే నాకు అలాంటి అనుభవాలు ఎదురు కాలేదనుకుంటున్నాను. కొన్నిసార్లు కొన్ని అనుభవాలు మన ప్రవర్తనను బట్టి కూడా ఉండొచ్చు. ఒకవేళ కమిట్‌మెంట్ కారణంగానే నాకు సినిమాలో చాన్స్ వస్తుందనుకుంటే ఆ సినిమాను వదులుకుంటాను. అప్పుడు సినిమా ఇండస్ట్రీనే వదిలేసి వేరే ఉద్యోగం చూసుకుంటాను. అవకాశాల కోసం దిగజారను'' అని ఆ ఇంటర్వ్యూలో కీర్తీ సురేశ్ పేర్కొన్నట్లు వార్తలు వస్తున్నాయి.

క్రైమ్.. థ్రిల్



● అరుణ్ విజయ్, పల్లక్

అరుణ్ విజయ్, పల్లక్ లల్వాని జంటగా జి.యస్.ఆర్. కుమార వేలన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆక్రోశం'. జగన్మోహిని సమర్పణలో విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్, మూవీ స్లైడర్స్ పతాకాలపై ఆర్. విజయ్ కుమార్ నిర్మించిన తమిళ చిత్రం 'సినం'. ఈ చిత్రాన్ని నిర్మాత సి.హెచ్. సతీష్ కుమార్ తెలుగులో 'ఆక్రోశం' పేరుతో ఈ నెల 16న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సి.హెచ్. సతీష్ కుమార్ మాట్లాడుతూ– ''కుటుంబంలోని అన్ని ఎమోషన్స్‌తో రూపొందిన చిత్రం 'ఆక్రోశం'. ఈ సినిమా అందరికీ రీచ్ కావాలనే ఉద్దేశంతో ఈ నెల 9న కాకుండా 16న విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''యాక్షన్, క్రైమ్, థ్రిల్లర్, ఎమోషనల్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. సినిమాలో మంచి సందేశం కూడా ఉంటుంది'' అన్నారు అరుణ్ విజయ్. ''టాలీవుడ్ నాకు ఎంతో స్పెషల్. హైదరాబాద్‌కి వచ్చిన ప్రతీసారి నా ఇంట్లో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఈ చిత్రంలో మధు అనే పాత్ర చేశాను'' అన్నారు పల్లక్ లల్వాని. ఈ సినిమాకు సంగీతం: షబీర్ తబరే ఆలం, కెమెరా: గోపీనాథ్.

కొత్తవాళ్లు రావాలి

- హీరో కార్తికేయ



● రంజిత్, కార్తికేయ

రంజిత్, సౌమ్య మీనన్ జంటగా రామకృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లెహరాయి'. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ సమర్పణలో కుమారస్వామి, మద్దిరెడ్డి శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన హీరో కార్తికేయ మాట్లాడుతూ– ''ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. కొత్త సినిమా ఎంత పెద్ద హిట్ అయితే అంతమంది కొత్తవారు ఇండస్ట్రీకి వస్తారు. ఎంతమంది కొత్తవారు వస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది'' అని అన్నారు. ''మా సినిమాకు తొలి ప్రేక్షకుడు అయిన నిర్మాత వేణు గోపాల్‌గారికి ధన్యవాదాలు. ఇది ఒక మంచి కథ'' అన్నారు రంజిత్. ''ఈ సినిమాకు నిజమైన హీరో నిర్మాత మద్దిరెడ్డి శ్రీనివాస్‌గారే. ఎందుకంటే ఈ సినిమాపై మా అందరికన్నా ఆయన ఎక్కువ ఆసక్తి చూపించారు'' అన్నారు రామకృష్ణ. ''నా మిత్రుడు కుమారస్వామి ప్రారంభించిన సినిమా ఇది. కరోనా కారణంగా ఆయన మరణించారు. ఇదివరకు ఆయన తీసిన సినిమాలకు భాగస్వామిగా ఉన్న నేను ఈ సినిమాను పట్టుబట్టి ఈ స్థాయికి తీసుకువచ్చాను'' అన్నారు మద్దిరెడ్డి శ్రీనివాస్.

ముఖచిత్రం... సందేశాత్మకం

- గంగాధర్



● గంగాధర్
● సందీప్ రాజ్

వికాస్ వశిష్ఠ, ప్రియ వడ్లమాని, చైతన్య రావ్, అయేషా ఖాన్ ప్రధాన పాత్రల్లో విశ్వక్ సేన్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ముఖచిత్రం'. గంగాధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు 'కలర్‌ఫోటో' దర్శకుడు సందీప్ రాజ్ కథ, స్క్రీన్‌ప్లే మాటలు అందించారు. ప్రదీప్ యాదవ్, మోహన్ యల్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో గంగాధర్ మాట్లాడుతూ– ''పిల్ల జమీందార్', భాగమతి'.. ఇలా చాలా చిత్రాలకు దర్శకత్వ శాఖలో చేశాను. కోన వెంకట్‌గారి రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో కూడా చేశాను. దర్శకుడిగా ప్రయత్నిద్దామనుకుని సందీప్ రాజ్‌తో కలిసి ఈ సినిమా చేశా. కమర్షియల్ అంశాలు ఉంటూనే సందేశమిచ్చే చిత్రమిది. ఇందులో విశ్వక్‌సేన్ చేసిన లాయర్ పాత్ర హైలైట్‌గా ఉంటుంది'' అన్నారు.

నమ్మకం ఉంది – సందీప్ రాజ్

''లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. కొన్ని న్యూస్ ఆర్టికల్స్ ఆధారంగా, నా అభిమాన దర్శకులు బాలచందర్‌గారి సినిమాలోని ఓ సందర్భం స్ఫూర్తిగా ఈ సినిమా కథ రెడీ చేశాను. ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తన ప్రియురాలికి మరొక అమ్మాయి ముఖాన్ని అమర్చుతాడు ఓ ప్లాస్టిక్ సర్జన్. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. కరోనా తర్వాత భారీ చిత్రాలకే ప్రేక్షకులు వస్తున్నారని అంటున్నారు. కానీ ఈ సినిమా ఆ అభిప్రాయాన్ని బ్రేక్ చేస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు.

థ్రిల్లింగ్ లవ్



● సోనాక్షి

రామరాజు, సోనాక్షి వర్మ, అభి, ప్రీతి సుందర్ ముఖ్య తారలుగా, శ్రీ నారాయణ దర్శకత్వంలో రూపొందిన ఎమోషనల్ అండ్ థ్రిల్లింగ్ లవ్‌స్టోరీ ' 2లవ్'. మహేందర్ సింగ్, శైలజ తాటిచెర్ల, శ్రీనారాయణ నిర్మించిన ఈ చిత్రం ఈ 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీనారాయణ మాట్లాడుతూ– ''గిరిజనుల నేపథ్యంలో తెరకెక్కిన స్వచ్ఛమైన ప్రేమకథే ఈ చిత్రం. ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ఓ కథ ఉంటుంది. ప్రతి ఎమోషన్ కథను నడిపిస్తుంటుంది'' అన్నారు.

సాక్షి
గురువారం
8-12-2022

బిజినెస్

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
216	82
62,411	18,561

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్‌	10,973	▽	40
డోజోన్స్‌	33,649	△	53
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,489	▽	32
డాక్స్‌	14,261	▽	82
షాంఘై	3,200	▽	13
నికాయ్‌	27,686	▽	199

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌
రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
53,583	▽	46
బంగారం (99.5 స్వచ్ఛత)		
53,368	▽	46
వెండి (కిలో)		
64,718	▽	70

ఫారెక్స్‌ రేట్లు
రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	81.95	83.62
€	యూరో	ఒకటి	85.09	88.16
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	98.78	102.17
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	59.42	61.32
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	54.29	56.67
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	59.96	61.91
SAR	సౌదీ రియాల్‌	ఒకటి	21.00	22.67
UAE D	యూఏఈ దిర్హామ్‌	ఒకటి	21.56	23.35
¥	చైనా యువాన్‌	ఒకటి	10.69	12.72

ఓఎన్‌జీసీ చైర్మన్‌గా అరుణ్‌ కుమార్‌ సింగ్‌



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఓఎన్‌జీసీ చైర్మన్‌గా అరుణ్‌ కుమార్‌ సింగ్‌ నియమితులయ్యారు. ఆయన గతంలో చమురు రిఫైనింగ్‌, మార్కెటింగ్‌ సంస్థ బీపీసీఎల్‌ చైర్మన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. రిటైరైన వ్యక్తిని మహారత్న హోదా గల ప్రభుత్వ రంగ సంస్థకు హెడ్‌గా నియమించడం ఇదే తొలిసారి. సింగ్‌ మూడేళ్ల పాటు ఓఎన్‌జీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

మాస్‌చిప్‌ ఇన్‌స్టిట్యూట్‌ కొత్త కేంద్రం

హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: వీఎల్‌ఎస్‌ఐ, ఎంబెడ్డెడ్‌ సిస్టమ్స్‌ శిక్షణ సంస్థ మాస్‌చిప్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సిలికాన్‌ సిస్టమ్స్‌ అత్యాధునిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. రాయదుర్గం నాలెడ్జ్‌ సిటీలోని అరబిందో గెలాక్సీలో 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. ఫిజికల్‌ డిజైన్‌, అనలాగ్‌ లేఔట్‌, డిజైన్‌ వెరిఫికేషన్‌, ఎంబెడ్డెడ్‌ సిస్టమ్స్‌ విభాగాల్లో ఏటా 600 మందికి శిక్షణ ఇస్తారు. మాస్‌చిప్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సిలికాన్‌ సిస్టమ్స్‌ను సెమికండక్టర్ల తయారీ దిగ్గజం మాస్‌చిప్‌ టెక్నాలజీస్‌ ప్రమోట్‌ చేస్తోంది. ఈ కేంద్రం 2011 నుంచి వేలాది మందికి శిక్షణ ఇచ్చిందని మాస్‌చిప్‌ ఎండీ, సీఈవో వెంకట సింహాద్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సెమికండక్టర్‌ కంపెనీల్లో వీరు పనిచేస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ జయేశ్‌ రంజన్‌ ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.


నెలవారీ చెల్లింపులు మరింత భారం

రెపో రేటు మరో 0.35 శాతం పెంపు
- 6.25 శాతానికి చేరిన కీలక రేటు
- 8 నెలల్లో 2.25 శాతం పెరుగుదల
- వృద్ధి అంచనా 6.8 శాతానికి కోత

ముంబై: వరుసగా ఐదో విడత ఆర్‌బీఐ కీలక రెపో రేటును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రెపో రేటు 0.35 శాతం పెరిగి 6.25 శాతానికి చేరింది. ఇది విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే ఉంది. దీంతో గృహ రుణాలు సహా అన్ని రకాల రుణాలపై వడ్డీ రేట్లు ఈ మేరకు పెరగనున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది ఏప్రిల్‌ నుంచి చూస్తే గృహ రుణాలపై ఈఎంఐలు 23 శాతం వరకు పెరిగినట్టయింది. ఈ భారం ఎలా ఉంటుందంటే 20 ఏళ్ల కాలానికి గృహ రుణం తీసుకున్న వారిపై ఈఎంఐ 17 శాతం, 30 ఏళ్ల కాలానికి తీసుకున్న వారిపై 23 శాతం మేర (8 నెలల్లో) ఈఎంఐ పెరిగినట్టయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉంటుందన్న గత అంచనాను ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) 6.8 శాతానికి తగ్గించింది. ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2022–23) సగటున 6.7 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఎంపీసీ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్‌ శక్తికాంతదాస్‌ వెల్లడించారు. వృద్ధిని దృష్టిలో పెట్టుకుని తమ చర్యలు వేగంగా ఉంటాయన్న సంకేతాన్ని ఇచ్చారు.

వృద్ధి అంచనాలకు కోత

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 6.8 శాతం మేర ఉండొచ్చని తాజాగా ఆర్‌బీఐ అంచనా వేసింది. గత అంచనా 7 శాతంతో పోలిస్తే కొంత తగ్గించింది. అంతేకాదు ఇలా వృద్ధి అంచనాలను తగ్గించడం ఇది మూడోసారి. పలు అంతర్జాతీయ ఏజెన్సీలు, రేటింగ్‌ సంస్థలు సైతం భారత్‌ వృద్ధి అంచనాలను దిగువకు సవరించడం తెలిసిందే. ఉక్రెయిన్‌–రష్యా యుద్ధంతోపాటు, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మాంద్యం, కఠినంగా మారుతున్న ద్రవ్య పరిస్థితులను వృద్ధికి ప్రతికూలతలుగా శక్తికాంతదాస్‌ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణంపైనా వీటి రిస్క్‌ ఉంటుందన్నారు. అయినప్పటికీ, మన ఆర్థిక వ్యవస్థ మంచి పనితీరును చూపిస్తోందంటూ, ప్రపంచంలో భారత్‌ చాలా వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని మరోసారి గుర్తు చేశారు. డిసెంబర్‌తో (క్యూ3) ముగిసే త్రైమాసికంలో 4.4 శాతం, 2023 జనవరి–మార్చి (క్యూ4)లో 4.2 శాతం చొప్పున జీడీపీ వృద్ధి సాధిస్తుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2023–24) ఏప్రిల్‌–జూన్‌ త్రైమాసికం (క్యూ1)లో 7.1 శాతం, క్యూ2లో 5.9 శాతం చొప్పున వృద్ధి నమోదవుతుందని పేర్కొంది. రబీ సాగు బాగుండడం, అర్బన్‌ ప్రాంతాల్లో డిమాండ్‌ స్థిరంగా కొనసాగడం, గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ డిమాండ్‌ మెరుగుపడడం, తయారీ, సేవల రంగాల్లో పునరుద్ధానం సానుకూలతలుగా శక్తికాంతదాస్‌ పేర్కొన్నారు.



ద్రవ్యోల్బణంపై పోరు కొనసాగుతుంది..

మార్చి త్రైమాసికంలో నిర్దేశిత 6 శాతం లోపునకు ద్రవ్యోల్బణం దిగొస్తుంది. ద్రవ్యోల్బణానికి సంబంధించి గడ్డు పరిస్థితులు ఇక ముగిసినట్టే. రేటు పెంపు తక్కువగా ఉండడం అన్నది ధరలపై పోరాటం విషయంలో మేము సంతృప్తి చెందినట్టు కాదు. పూర్తి ఆర్థిక సంవత్సరానికి సగటు ద్రవ్యోల్బణం 6.7 శాతంగా ఉంటుంది. ఇక ఆర్‌బీఐ ఇటీవలే సెంట్రల్‌ బ్యాంక్‌ డిజిటల్‌ కరెన్సీ (సీబీడీసీ) లావాదేవీలను రిటైల్‌, హోల్‌సేల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ప్రయోగాత్మక పరీక్షల్లో ఫలితాల పట్ల సంతృప్తిగా ఉన్నాయి.
– శక్తికాంతదాస్‌, ఆర్‌బీఐ గవర్నర్‌

పాలసీలోని ఇతర అంశాలు

- ఆరుగురు సభ్యుల ఎంపీసీలో 0.35 శాతం రేటు పెంపునకు ఐదుగురు ఆమోదం తెలిపారు.
- సర్దుబాటు విధాన ఉపసంహరణను ఆర్‌బీఐ కొనసాగిస్తున్నట్టు తెలిపింది.
- ఆర్‌బీఐ రెండేళ్ల విరామం తర్వాత రేట్లను ఈ ఏడాది మే నెలలో తొలిసారి సవరించింది. మేలో 0.40 శాతం పెంచగా, జూన్‌ సమీక్షలో అర శాతం, ఆగస్ట్‌లో అర శాతం, సెప్టెంబర్‌ సమీక్షలోనూ అర శాతం చొప్పున పెంచుతూ వచ్చింది.
- యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై 'సింగిల్‌ బ్లాక్‌, మల్టీ డెబిట్స్‌' సదుపాయాన్ని ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. దీంతో ఈ కామర్స్‌, సెక్యూరిటీల్లో పెట్టుబడుల చెల్లింపులు సులభతరం అవుతాయని పేర్కొంది. అంటే కస్టమర్‌ ఒక ఆర్డర్‌కు సంబంధించిన మొత్తాన్ని తన ఖాతాలో బ్లాక్‌ చేసుకుని, డెలివరీ తర్వాత చెల్లింపులు చేయడం.
- భారత నియంత్రణ సంస్థల విశ్వసనీయతను అభివృద్ధి చెందిన దేశాలు గుర్తించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ గవర్నర్‌ శక్తికాంతదాస్‌ అన్నారు.

రేట్ల పెంపు స్పీడ్‌ తగ్గినట్టే

ఆర్‌బీఐ పాలసీ ప్రకటన మా అంచనాలకు తగ్గట్టే ఉంది. విధానంలోనూ మార్పులేదు. ప్రకటన కొంచెం హాకిష్‌గా (కఠినంగా) ఉంది. రేట్ల పెంపు సైకిల్‌ ముగిసిందనే సంకేతాన్ని ఇవ్వలేదు.
– సాక్షి గుప్తా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ ప్రధాన ఆర్థికవేత్త

రిటైల్‌ ద్రవ్యోల్బణం అంచనాలు 2022–23 సంవత్సరానికి 6.7 శాతం వద్ద కొనసాగించడం, సీక్వెన్షియల్‌గా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతున్న అంశాలు తెరముందుకు వచ్చాయి. ఇదే ధోరణి స్థిరంగా ఉంటూ, ఆర్‌బీఐ తన విధానాన్ని మార్చుకునేందుకు దారితీస్తుందా అన్నది చూడాలి.
– సంజీవ్‌ మెహతా, ఫిక్కీ ప్రెసిడెంట్‌

రెపో రేటు ఏ మాత్రం పెంచినా ఆ ప్రభావం అంతిమంగా వినియోగదారుడిపై, గృహ కొనుగోలుదారులపై పడుతుంది. బ్యాంకులు రేట్ల పెంపును కస్టమర్లకు బదిలీ చేస్తాయి. దీంతో స్వల్పకాలంలో ఇది కొనుగోళ్లపై ప్రభావం చూపిస్తుంది.
– హర్షవర్ధన్‌ పటోడియా, క్రెడాయ్‌ ప్రెసిడెంట్‌

బిగ్‌'సి' 20వ వార్షికోత్సవ ఆఫర్ల వర్షం!

హైదరాబాద్‌: ప్రముఖ మొబైల్‌ రిటైల్‌ చెయిన్‌ బిగ్‌'సి' 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లక్కీడ్రా ఆఫర్‌ ప్రకటించింది. సంస్థ వ్యవస్థాపకులు, సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపిన సమాచారం ప్రకారం, 2022 డిసెంబర్‌ 3 నుంచి 2023 జనవరి 29 వరకూ బిగ్‌'సి'లో స్మార్ట్‌ఫోన్‌, స్మార్ట్‌టీవీ, ల్యాప్‌టాప్‌ కొను గోళ్లపై లక్కీడ్రా ద్వారా ఎంపికైన విజేతలకు 20 కార్లు, 20 బైకులు, 20 ఏసీలు, 20 రిఫ్రిజిరేటర్లు, 20 టీవీలు బహుమతిగా లభిస్తాయి. ప్రతి మొబైల్‌ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి, 10 శాతం వరకూ క్యాష్‌బ్యాక్‌, వడ్డీలేని సులభతర వాయిదా చెల్లింపుల వంటి పలు ఆఫర్లూ ఉన్నాయి.



కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

8-12-2022	
విశాఖ	545–00
చిత్తూరు	568–00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	544–00
విజయవాడ	544–00
రిటైల్‌ ధర (డజను)	78.00
7-12-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	541–00
వరంగల్‌	543–00
రిటైల్‌ ధర	6.00

ఆర్‌బీఐ ఎఫెక్ట్‌.. మార్కెట్‌ వీక్‌

- సెన్సెక్స్‌ నష్టం 216 పాయింట్లు
- 62,411 వద్ద ముగింపు
- నిఫ్టీ 82 పాయింట్లు డౌన్‌
- 18,561 పాయింట్ల దిగువకు

ముంబై: వడ్డీ రేట్లకు కీలకమైన రెపో పెంపు నేపథ్యంలో దేశీ స్టాక్‌ మార్కెట్లు నీరసించాయి. ఆటుపోట్ల మధ్య నష్టాలతో నిలిచాయి. సెన్సెక్స్‌ 216 పాయింట్లు క్షీణించి 62,411 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 82 పాయింట్లు తక్కువగా 18,561 దిగువన స్థిరపడింది. ఆర్‌బీఐ అధ్యక్షతన పరపతి సమీక్షను చేపట్టిన మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) రెపో రేటును 0.35 శాతం పెంచింది. జీడీపీ వృద్ధి అంచనాలను 0.2 శాతం తగ్గించింది. అయితే మార్కెట్లు తొలుత బలహీనంగా ప్రారంభమై పాలసీ నిర్ణయాల సమయంలో కోలుకుని లాభాల్లోకి వచ్చాయి. తిరిగి వెనువెంటనే అమ్మకాలు ఊపందుకోవడంతో చివరికి డీలా పడ్డాయి. ఇంట్రాడేలో 62,760 వద్ద గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్‌ చివర్లో 62,317 దిగువన కనిష్టాన్నీ చవిచూసింది. ఇదేవిధంగా నిఫ్టీ 18,668–18,528 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులకు లోనయ్యింది. వెరసి వరుసగా నాలుగో రోజు మార్కెట్లు వెనకడుగు వేశాయి.



ఎఫ్‌ఎంసీజీ మాత్రమే

ఎన్‌ఎస్‌ఈలో ఎఫ్‌ఎంసీజీ(1 శాతం), పీఎస్‌యూ బ్యాంక్స్‌(0.25శాతం) బలపడగా.. మీడియా, రియల్టీ, కన్సూమర్‌ డ్యూరబుల్స్‌, మెటల్‌, ఐటీ, ఫార్మా 1.5–0.7 శాతం మధ్య తగ్గాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఎస్‌బీఐ లైఫ్‌, ఎన్‌టీపీసీ, బజాజ్‌ ఫిన్‌, ఇండస్‌ఇండ్‌, ఆర్‌ఐఎల్‌, టాటా స్టీల్‌, అపోలో హాస్పిటల్‌, హెచ్‌సీఎల్‌ టెక్‌, విప్రో, సన్‌ ఫార్మా, ఓఎన్‌జీసీ 2–1.4% మధ్య క్షీణించాయి. అయితే హెచ్‌యూఎల్‌, బీపీసీఎల్‌, ఏషియన్‌ పెయింట్స్‌, ఎల్‌అండ్‌టీ, యాక్సిస్‌, ఐటీసీ 2–0.8 శాతం మధ్య ఎగశాయి.

స్మాల్‌ క్యాప్స్‌ సైతం

బీఎస్‌ఈలో మిడ్‌, స్మాల్‌ క్యాప్స్‌ 0.4 శాతం నీరసించాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2,038 నష్టపోగా.. 1,478 బలపడ్డాయి.

మూడు ప్రాజెక్టులకు ఎన్‌ఐఐఎఫ్‌ఎల్‌ నిధులు



హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: నేషనల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఫండ్‌తో (ఎన్‌ఐఐఎఫ్‌ఎల్‌) జీఎంఆర్‌ ఎయిర్‌పోర్ట్స్‌ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా మూడు విమానాశ్రయ ప్రాజెక్టులకు ఎన్‌ఐఐఎఫ్‌ఎల్‌ నిధులు సమకూరుస్తుంది. గోవాలోని మోపా అంతర్జాతీయ విమానాశ్రయానికి కంపల్సరీ కన్వర్టబుల్‌ డిబెంచర్స్‌ రూపంలో రూ.631 కోట్లు అందించనుంది. దేశీయ విమానయాన రంగంలో ఎన్‌ఐఐఎఫ్‌ఎల్‌కు ఇది తొలి పెట్టుబడి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతోసహా రెండు ప్రాజెక్టులకు ఎన్‌ఐఐఎఫ్‌ఎల్‌ ఆర్థిక సాయం అందిస్తుందని జీఎంఆర్‌ గ్రూప్‌ ఎయిర్‌పోర్ట్స్‌ బిజినెస్‌ చైర్మన్‌ జీబీఎస్‌ రాజు బుధవారం తెలిపారు.

3 విభాగాలుగా గ్రూప్‌-1 మెయిన్స్‌ పేపర్‌1 సిలబస్‌

సాక్షి, అమరావతి: గ్రూప్‌–1 క్యాడర్‌ పోస్టుల భర్తీకి మెయిన్స్‌ పరీక్షల్లో పేపర్‌–1 (జనరల్‌ ఎస్సే) సిలబస్‌ను 3 విభాగాలుగా చేసినట్టు ఏపీపీఎస్సీ బుధవారం తెలిపింది. మొదటి సెక్షన్లో కరెంట్‌ ఎఫైర్స్‌, రెండో సెక్షన్‌లో సోషియో పొలిటికల్‌, ఎకనమిక్స్‌, ఎన్విరాన్‌మెంటల్‌ అంశాలుంటాయి. మూడో సెక్షన్లో కల్చరల్‌ హిస్టారికల్‌, సివిక్‌ అవేర్‌నెస్‌, రిఫ్లెక్టివ్‌ అంశాలు ఉంటాయని పేర్కొంది. అభ్యర్థులు మూడు విభాగాల నుంచి 800 పదాలు ఉండేలా 3 వ్యాసరూప సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఒక్కో దానికి 50 మార్కులు ఉంటాయి. పరీక్ష 3 గంటలు ఉంటుంది.

కాలేజీల అనుమతులకు దరఖాస్తు గడువు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్‌ కోర్సులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు 2023–24 విద్యా సంవత్సరానికి ప్రొవిజనల్‌ అఫిలియేషన్‌ పొడిగింపు, పునరుద్ధరణ, అదనపు సెక్షన్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ఏపీ ఇంటర్మీడియెట్‌ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ల సమర్పణకు ఈ నెల 8 నుంచి 23వ తేదీ వరకు గడువు పొడిగించామని పేర్కొన్నారు. రూ.10వేల అపరాధ రుసుముతో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. ఆర్‌ఐవోల ఇన్‌స్పెక్షన్లు డిసెంబర్‌ 15 నుంచి జనవరి 3వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు.

జనవరి 5న సర్పంచ్‌ల సంఘం ఏర్పాటు

తిరుపతి కల్చరల్‌: వచ్చే ఏడాది జనవరి 5న గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎస్‌ఆర్‌ కల్యాణ మండపంలో పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి కడప జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో చెప్పారు. బాబు రాజేంద్రప్రసాద్‌ ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సంఘంతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆయన కేవలం తన ఉనికి చాటుకునేందుకే పంచాయతీరాజ్‌ చాంబర్‌ను 20 మందితో ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లంతా కలిసి సమావేశమై నూతన కమిటీని ఎన్నుకుని తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పోలవరం పనుల నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరణ

- అంతర్రాష్ట్ర వివాదంపై రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని కేంద్రానికి సూచన
- తదుపరి విచారణ ఫిబ్రవరి 15కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు పనుల నిలిపివేతకు సుప్రీంకోర్టు నిరాకరించింది. వర్క్‌ ఆర్డర్‌ ఉపసంహరణను కేంద్రం పదే పదే రద్దు చేయడంతో ఏపీ చేపట్టేపనుల వల్ల తమకు నష్టం కలుగుతోందని, పనులు నిలిపివేయాలన్న ఒడిశా అభ్యర్థనను తిరస్కరించింది. పోలవరం ప్రాజెక్టును ఒకే రాష్ట్రం కోణంలో చూడరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రాజెక్టు ముంపుపై ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌, రేలా స్వచ్ఛంద సంస్థ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ సంజయ్‌కిషన్‌ కౌల్‌, జస్టిస్‌ అభయ్‌ ఎస్‌ ఓకా, జస్టిస్‌ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. జలశక్తి తరఫు సీనియర్‌ న్యాయవాది వసీం ఖాద్రీ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటి వరకు నాలుగు రాష్ట్రాల మధ్య మూడు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రుల సమావేశం జరగనుందని, నివేదిక ఇచ్చేందుకు మూడు నెలల సమయం ఇవ్వాలని కోరారు. సాంకేతిక సమస్యలతో పాటు న్యాయపరమైన సమస్యలున్నాయని, అందుకే సమయం కోరుతున్నట్టు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ తమతమ అభిప్రాయాలు మంత్రిత్వశాఖకు పంపాయని తెలిపారు. ముఖ్యమంత్రుల సమావేశంపై ఎలాంటి పురోగతి లేదని ఒడిశా తరఫు సీనియర్‌ న్యాయవాది కట్నాలియా తెలిపారు. అక్టోబర్‌ 7న సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించి రాష్ట్రాలు తమతమ అభ్యంతరాలు తెలిపాయని, వాటిని మంత్రిత్వ శాఖకు అందజేశామని అయినా పురోగతి లేదన్నారు. ముఖ్యమంత్రుల సమావేశం ఎప్పుడనేది ఇంకా నిర్ణయించలేదన్నారు. ముంపుపై వివాదం ముగిసే వరకూ పనులు నిలిపివేయాలని కోరారు. దీనికి అంగీకరించని ధర్మాసనం.. ఆ విధంగా కోరడం తగదంది. ఈ వ్యవహారంలో సమగ్రంగా ఆలోచించాలని, దేశంలో రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకోవాలని సూచించింది. కాగా, ఈ ఏడాది గోదావరికి వరదలు రావడంతో పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణలో ముంపు పెరిగిందని.. ముంపు నివారణకు ఏపీ చర్యలు తీసుకొంటే నిర్మాణంపై తమకెలాంటి అభ్యంతరం లేదని సీనియర్‌ న్యాయవాది వైద్యనాథన్‌ తెలిపారు. పేర్కొన్నారు. రాష్ట్రాల నుంచి సాంకేతిక అంశాలపై అభిప్రాయాలు డిసెంబర్‌ 2న మంత్రిత్వశాఖకు చేరాయని అదనపు సొలిసిటర్‌ జనరల్‌ ఐశ్వర్య భాటి తెలిపారు. కేంద్రం రెండు నెలల్లోపు సీఎంల సమావేశం నిర్వహిస్తామని తెలిపిందని, ఈ నేపథ్యంలో అంతర్రాష్ట్ర వివాదంపై నివేదిక అందజేయడానికి రెండు నెలలు గడువు ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ ఫిబ్రవరి 15కు వాయిదా వేసింది.

తెలంగాణ నుంచి అప్పులు ఇప్పించడంలో కేంద్రం విఫలం

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగా విభజించారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ అన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి రూ.లక్షల కోట్ల విలువైన ఆస్తులు రావాల్సి ఉందని.. వాటిని ఏపీకి ఇచ్చేలా చర్యలు తీసుకోవడంలో కేంద్రం విఫలమైందన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు ప్రధాని మోదీ దృష్టిలో పడేందుకు.. ప్రశ్నించడం లేదన్నారు. ఏపీ విభజనపై గతంలో కేసు వేశామని, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం కౌంటర్‌ దాఖలు చేయలేదన్నారు. పార్లమెంట్‌ సాక్షిగా ఇష్టారీతిగా విభజించడం వల్లే.. నేడు రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొందన్నారు. చంద్రబాబు తొలుత ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరి.. ఎన్నికల సమయంలో ప్రత్యేక హోదా డిమాండ్‌ చేశారని మండిపడ్డారు.

ఆ వైద్యులకు ఈ నెల 9లోపు జీతాలు చెల్లిస్తాం

- ఇప్పటికే నిధులు కూడా మంజూరు చేశాం
- హైకోర్టుకు నివేదించిన ఆరోగ్య శాఖ

సాక్షి,అమరావతి: కోవిడ్‌ సమయంలో వైద్య సేవలు అందించిన కాంట్రాక్ట్‌ వైద్యులకు ఈ నెల 9వ తేదీ లోపు జీతాలు చెల్లిస్తామని వైద్య ఆరోగ్య శాఖ బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఇప్పటికే రూ.14 లక్షలను కృష్ణాజిల్లా డీఎంహెచ్‌వోకు మంజూరు చేశామని ఆ శాఖ తరఫు న్యాయవాది హైకోర్టుకు వివరించారు. ఈ నెల 9లోపు ఆ మొత్తాన్ని చెల్లిస్తామన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, బకాయిల చెల్లింపుల్లో జాప్యం చేసినందుకు పిటిషనర్లు వడ్డీకి అర్హులని, ఈ విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ గన్నమనేని రామకృష్ణప్రసాద్‌ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోవిడ్‌ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించినప్పటికీ, తమకు చెల్లించాల్సిన జీతాలు ఇప్పటి వరకు చెల్లించలేదంటూ కాంట్రాక్ట్‌ వైద్యులు డాక్టర్‌ గీత్‌ సత్యసాయి స్వరూప్‌ మరో 9 మంది వైద్యులు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు.

'ఏసీఏ' ఫలితాలపై ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

- సింగిల్‌ జడ్జి వద్దే తేల్చుకోండి
- ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ ఎన్నికలపై హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ (ఏసీఏ) అపెక్స్‌ కౌన్సిల్‌ ఎన్నికల ఫలితాలను వెల్లడించవద్దంటూ సింగిల్‌ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. సింగిల్‌ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే విధించాలన్న ఏసీఏ ప్రస్తుత కార్యవర్గ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ నెల 14న ఈ వ్యవహారంపై సింగిల్‌ జడ్జి విచారణ జరపనున్న నేపథ్యంలో ఏమున్నా ఆయన వద్దే చెప్పుకోవాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరగా తేల్చాలని సింగిల్‌ జడ్జిని ధర్మాసనం కోరింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీఏ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న పి.శరత్‌చంద్రారెడ్డి ఈడీ కేసు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆయన ఏసీఏలో పదవులు నిర్వహించేందుకు అనర్హుడని.. ఆ మేరకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ చిత్తూరు జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్‌ జడ్జి జస్టిస్‌ మానవేంద్రనాథ్‌ రాయ్‌ ఈ నెల 3న జరిగిన ఏసీఏ అపెక్స్‌ కౌన్సిల్‌ ఎన్నిక ఫలితాలను వెల్లడించవద్దంటూ ఈ నెల 1న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని సవాల్‌ చేస్తూ ప్రస్తుత కార్యవర్గం సీజే నేతృత్వంలోని ధర్మాసనం ముందు అప్పీల్‌ దాఖలు చేసింది. దీనిపై తాజాగా ధర్మాసనం విచారణ జరిపింది. ఏసీఏ కార్యవర్గం తరఫున ఎస్‌.రవిప్రసాద్‌ వాదనలు వినిపిస్తూ.. అపెక్స్‌ కౌన్సిల్‌ ఎన్నిక ప్రకటన లాంఛనమే నన్నారు. ఒక్కో పోస్టుకు కేవలం ఒక నామినేషన్‌ మాత్రమే దాఖలైందని.. ఈ నేపథ్యంలో సర్వసభ్య సమావేశంలో ఎన్నికల ఫలితాల ప్రకటన చేయాల్సి ఉందన్నారు. అయితే ఫలితాలు ప్రకటించకుండా సింగిల్‌ జడ్జి స్టే ఇచ్చారని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. సాధారణంగా మధ్యంతర ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది.

ప్రపంచమంతా మన వైపు చూసేలా పెట్టుబడుల సదస్సు

- అధికారులకు బుగ్గన ఆదేశం
- విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుపై మంత్రి అమర్‌నాథ్‌తో కలసి సమీక్ష

సాక్షి, అమరావతి: ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్‌ వైపు చూసే విధంగా అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌ ప్రత్యేకత, అపార వనరులు, అనుకూల పరిస్థితులు సదస్సులో ప్రతిబింబించాలన్నారు. గ్లోబల్‌ సమ్మిట్‌తో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ప్రభావితం చెందేలా సదస్సు ఉండాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. సదస్సుపై పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో గురువారం సచివాలయంలో మంత్రులు బుగ్గన, అమర్‌నాథ్‌ సమీక్ష నిర్వహించారు. పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లతో పాటు బ్రాండింగ్‌ పైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడంలో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. సమావేశ మందిరాలు, వేదిక ఏర్పాట్లు సహా సదస్సుకు సంబంధించి మౌలిక సదుపాయాల ఏర్పాటులో పాటించాల్సిన కీలక అంశాలను ఆర్థిక మంత్రి చర్చించారు.

సదస్సుకు ఏయూ అనుకూలం: అమర్‌నాథ్‌

మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించే గ్లోబల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ సదస్సు నిర్వహణకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుకూలంగా ఉంటుందని పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ తెలిపారు. ముఖ్యమంత్రి ఇటీవల ఆవిష్కరించిన లోగో, నేపథ్యాలను బుగ్గనకు వివరించారు. పెట్టుబడుల సదస్సులను ఇతర రాష్ట్రాలు నిర్వహిస్తున్న తీరును పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు చర్చించారు. రోడ్‌ షోల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌. కరికాల వలవన్‌ తెలిపారు. కేంద్ర మంత్రులను ఎవరెవరిని ఆహ్వానించాలి? ఆంధ్రప్రదేశ్‌ మూలాలున్న ప్రఖ్యాత కంపెనీల సీఈవోలను, ఆయా రంగాల్లో ప్రత్యేకతను చాటిన వ్యక్తులను ఎవరెవరిని పిలవాలన్న అంశాలపై మంత్రులు అధికారులకు పలు సూచనలిచ్చారు. సమీక్షలో చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

కృష్ణా బోర్డు సభ్యునిగా అజయ్‌కుమార్‌ గుప్తా!

సాక్షి, హైదరాబాద్‌: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) సభ్యునిగా అజయ్‌కుమార్‌ గుప్తాను కేంద్ర జలశక్తి శాఖ నియమించినట్టు తెలిసింది. బోర్డు సభ్యుడు బి.రవికుమార్‌ పిళ్లై ఢిల్లీలోని కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కేంద్ర జలశక్తి శాఖలో పనిచేస్తున్న అజయ్‌కుమార్‌ను నియమించినట్టు సమాచారం.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బెయిల్‌పై విడుదలైన స్వామీజీ

చంచల్‌గూడ: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్వామి సింహయాజీకి హైకోర్టు బెయిల్‌ మంజూరు చేసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టయి చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌ ఖైదీలుగా ఉన్న విషయం తెలిసిందే. కాగా, బుధవారం ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు.

అయ్యప్ప భక్తుల కోసం కేరళలో వసతి షెల్టర్లు

- రాష్ట్ర సీఎస్‌ జవహర్‌రెడ్డికి లేఖ రాసిన కేరళ సీఎస్‌

సాక్షి, అమరావతి: వివిధ రాష్ట్రాల నుంచి శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం కేరళ ప్రభుత్వం యాత్ర మార్గమధ్యంలో ఈ ఏడాది పెద్ద ఎత్తున వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసింది. శబరిమలకు చేరుకునే వివిధ మార్గాల్లో భక్తుల సౌకర్యార్థం మొత్తం 71 ఆలయాల్లో అన్నదానం, రక్షిత మంచినీటి సరఫరా, టాయిలెట్‌ తదితర వసతులను ఏర్పాటు చేసింది. ఈ మేరకు కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీపీ జోయ్‌ మన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాల ద్వారా మన రాష్ట్రం నుంచి శబరిమల యాత్రకు వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో కేరళలో వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్న ఆలయాల వివరాలు తెలియజేయాలని కోరుతూ ఆ లేఖకు సంబంధిత వివరాలను జతపరిచారు. వసతి సౌకర్యాల వివరాలతో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి

సాక్షి, అమరావతి: సీఆర్‌డీఏ పరిధిలో (అమరావతి ప్రాంతం) పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఈ ఏడాది జూన్‌, జూలై నెలల వేతనాలకు సంబంధించి రూ.80 లక్షలను ఏజెన్సీల ఖాతాల్లో జమ చేశామని కమిషనర్‌ వివేక్‌ యాదవ్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు నుంచి నవంబర్‌ వరకు చెల్లించాల్సిన వేతనాలకు సంబంధించిన బిల్లులను ఆయా ఏజెన్సీలు ఒప్పందం ప్రకారం కార్మికుల ఖాతాల్లో జమచేయాలన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

దేశంలో బొగ్గు కొరత లేదు

లోక్‌సభ

వైఎస్సార్‌సీపీ ఎంపీ అనూరాధ ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం బొగ్గు కొరత లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. బుధవారం లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకూ 524.2 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. మరో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2021–22లో 652.80 మిలియన్ టన్నుల బొగ్గును రైల్వే రవాణా చేసిందని కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

దక్షిణమధ్య రైల్వేలో 18 వైటీఎస్‌కే కేంద్రాలు

రైల్వేలో దేశమంతటా 374 యాత్రి టికెట్ సువిధ కేంద్రాలు ఉండగా.. దక్షిణ మధ్య రైల్వేలో 18 కేంద్రాలు ఉన్నాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఎస్.రెడ్డెప్ప అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ వద్ద 764 కేసులు పెండింగ్‌లో ఉండగా.. తెలంగాణ కమిషన్ వద్ద 4,075 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్‌చౌబే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఏపీ జిల్లాల కమిషన్ల వద్ద 4,452 కేసులు పెండింగ్‌లో ఉండగా.. తెలంగాణలో 4,924 కేసులు పెండింగ్ ఉన్నాయని పేర్కొన్నారు.

గార్మెంట్స్, ఫ్యాబ్రిక్స్‌పై జీఎస్టీలో మార్పు లేదు

గార్మెంట్స్, ఫ్యాబ్రిక్స్‌పై జీఎస్టీలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. జీఎస్టీ మండలి 45వ సమావేశంలో 5 శాతం నుంచి 12 శాతానికి పెంచాలని నిర్ణయించినప్పటికీ 46వ సమావేశంలో ఆ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి ప్రశ్నకు దర్శన జర్దోష్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019, పోటీ చట్టం 2002, సీజీఎస్టీ చట్టం 2017, ఐటీ చట్టం 2000, చెల్లింపు పరిష్కార వ్యవస్థల చట్టం 2007, కంపెనీల చట్టం 2013, కాపీరైట్ చట్టం 1957 తదితర చట్టాలు ఈ–కామర్స్ రంగానికి వర్తిస్తాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జౌళి శాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్ సమాధానమిస్తూ.. ముద్ర పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 2022 అక్టోబర్ వరకూ రూ.246.24 కోట్ల విలువైన 44,037 రుణాలిచ్చినట్టు తెలిపారు.

ఏపీ జీఎస్‌డీపీ 11.43 శాతం

ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ 2021–22లో 11.43 శాతంగా ఉందని కేంద్ర స్టాటిస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ సహాయ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఏపీ జీఎస్‌డీపీ 2014–15లో 9.20 శాతంగా.. 2018–19లో 5.36 శాతంగా ఉందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు తలారి రంగయ్య ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి సమాధానమిచ్చారు.

ఏపీలో ఇంటర్‌నెట్ లేని పోస్టాఫీసులు 186

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ సమాధానమిస్తూ.. ఏపీలో 10,605 పోస్టాఫీసులు ఉండగా.. 186 పోస్టాఫీసులకు ఇంటర్‌నెట్ సౌకర్యం లేదని కేంద్ర కమ్యూనికేషన్ల సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమాధానమిస్తూ..ఏపీలో 5,883 ఆధార్ సేవా కేంద్రాలున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సోమ్‌ప్రకాష్ సమాధానమిస్తూ.. 2016 నుంచి 2022 వరకూ ఏపీలో 1,300 స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఆ రెండు రోజులూ మహిళలు సెలవివ్వాలి

బహిష్టు సమయంలో ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని మహిళలకు నెలకు రెండు రోజులపాటు సెలవులు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ డిమాండ్ చేశారు.

విశాఖ సీఐటీఎస్‌లో నైపుణ్య శిక్షణ

విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ జవాబు

రాజ్యసభ

సాక్షి, న్యూఢిల్లీ: మహిళలకు నైపుణ్య శిక్షణ కోసం దేశంలో ప్రత్యేకంగా 19 జాతీయ మహిళా నైపుణ్య శిక్షణ సంస్థలు (ఎన్ఎస్‌టీఐ) పని చేస్తున్నాయని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీనేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ.. విశాఖపట్నంలోని క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ ట్రైనర్స్ (సీఐటీఎస్)ను జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థకు అనుబంధ సంస్థగా ప్రకటించి 2022–23 నుంచి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ వంటి ట్రేడ్లలో శిక్షణను ప్రారంభించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు ట్రేడ్లలో 75 మందికి శిక్షణ పొందే అవకాశం ఉన్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం మార్గదర్శకాలలో చేసిన మార్పుల కారణంగా నల్లమల అడవులలో జీవించే చెంచు తెగ ప్రజలకు ఈ పథకం కింద వేతనంతో కూడిన ఉపాధి పొందడానికి అనర్హులవుతారా అని ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని నల్లమల అడవుల్లో నివసించే చెంచులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనంతో కూడిన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రెండు తెలుగు రాష్ట్రాలు తెలిపాయని పేర్కొన్నారు.

మార్చి నాటికి బీచ్ కారిడార్ డీపీఆర్

విశాఖ–భోగాపురం బీచ్ కారిడార్ ప్రాజెక్ట్ సిక్స్ లేనింగ్ పనులకు సంబంధించి డీపీఆర్ పురోగతిలో ఉందని.. 2023 మార్చి నాటికి డీపీఆర్ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. సాధ్యాసాధ్యాలు, అంచనా వ్యయం, నిర్మాణానికి సమయం మొదలైన వివరాలను 2023 జూన్ కల్లా సమర్పించేందుకు అవకాశమిచ్చినట్లు పేర్కొన్నారు.

కేంద్రం సమన్వయకర్తగానే ఉంటుంది

వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి సంబంధించి ద్వైపాక్షిక సమస్యలు సంబంధిత రాష్ట్రాలే పరిష్కరించుకోవచ్చన్నారు. పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవడానికి రెండు రాష్ట్రాల మధ్య కేంద్రం సమన్వయకర్తగా మాత్రమే వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. విభజన చట్టం అమలు పురోగతికి సంబంధించి ఈ ఏడాది సెప్టెంబర్ 27న కేంద్ర హోంశాఖ కార్యదర్శి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగిందని తెలిపారు.

కృష్ణపట్నం పోర్టు రహదారి ఆలస్యం

వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ.. ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో కృష్ణపట్నం పోర్టుకు నిర్మించాల్సిన ఆరు లేన్ల రహదారి ఆలస్యం అయిందని, ఈ విషయంలో స్పష్టత రావాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ సమాధానమిస్తూ.. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ నుంచి 67 కోర్సులు అందిస్తున్నట్టు తెలిపారు. జాతీయ విపత్తు స్పందన నిధి నుంచి నిధులు విడుదల చేయకపోవడంపై ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ సమాధానమిస్తూ.. 2022–23లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన నిధికి కేంద్ర వాటాగా రూ.940 కోట్లు కేటాయించగా.. తొలి విడతలో రూ.470 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

రెండు బిల్లులకు మద్దతు

రాజ్యసభలో ప్రవేశపెట్టిన అటవీ పరిరక్షణ సవరణ బిల్లు, లోక్‌సభలో యాంటీ మారిటైమ్ పైరసీ బిల్లు, 2019 బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది.

నేడు తుపానుగా మారనున్న

వాయుగుండం

9వ తేదీ రాత్రి మహాబలిపురం వద్ద తీరం దాటే అవకాశం

- దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిలాల్లో వర్షాలు
- వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచన



సాక్షి, అమరావతి /సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం ఉదయం తుపానుగా మారనుంది. ప్రస్తుతం ఇది గంటకు 10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా శ్రీలంక, తమిళనాడు వైపు దూసుకు వస్తోంది. బుధవారం రాత్రి ట్రింకోమలీ (శ్రీలంక)కి 410 కిలోమీటర్లు, జాఫ్నాకు (శ్రీలంక) 550 కిలోమీటర్లు, కారైకాల్‌కు 610 కిలోమీటర్లు, చెన్నైకి 700 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఈ తుపానుకు మాండూస్ అని పేరు పెట్టారు. 9వ తేదీ రాత్రి తమిళనాడులోని మహాబలిపురం సమీపంలో తీరం దాటుతుందని చెబుతున్నారు. తీరాన్ని దాటే సమయంలో గంటకు 65–75 కి.మీలు, గరిష్ఠంగా 85 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. తీరం దాటిన తర్వాత వాయుగుండంగా బలహీనపడి చిత్తూరు వైపు కదులుతుందని చెబుతున్నారు. గురువారం నుంచి 10వ తేదీ వరకు తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది.

అప్రమత్తమైన యంత్రాంగం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాలను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సముద్రం అలజడిగా ఉంటుందని, దక్షిణకోస్తా – తమిళనాడు తీరాల వెంబడి శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. వేటకు వెళ్ళిన మత్స్యకారులు వెంటనే వెనక్కి తిరిగి రావాలని కోరారు.

నేటి నుంచి వర్షాలు

మాండూస్ ప్రభావంతో 8వ తేదీ నుంచి 3 రోజులపాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. 10, 11 తేదీల్లో ఏపీలో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన వైఎస్ భారతి



ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో వైఎస్ భారతి

పెదనందిపాడు: గుంటూరు జిల్లా గోగులమూడిలో ఎన్ఆర్ఐ డాక్టర్ వేలినేని వేంకటేశ్వరరావు కట్టించిన వేలినేని నాగయ్య, తులసి మెమోరియల్ ఆరోగ్య కేంద్రాన్ని సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకరరెడ్డి, తహసిల్దార్ సుభాని, వేలినేని శివరామకృష్ణయ్య, లావు వెంకటేశ్వర్లు (ఎల్‌వి), జాగర్లమూడి లక్ష్మీ నారాయణ, వేలినేని వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షార్‌లో 'మోటార్' పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పీఎస్ఎల్‌వీ రాకెట్‌కు సంబంధించి కొత్తగా మరో స్ట్రాపాన్‌బూస్టర్ మోటార్‌ను కనుగొనేందుకు తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని స్టాక్ టెస్ట్ ఫెసిలిటి వద్ద మోటార్ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. బుధవారం మధ్యాహ్నం 1.45 గంటలకు కొత్తగా రూపొందించిన స్ట్రాపాన్ మోటార్‌ను మండించి శాస్త్రవేత్తలు పరీక్షించారు. మోటార్ పనితీరు సంతృప్తికరంగా ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ మోటార్లను మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈఈఎల్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. ఇప్పటికే పీఎస్ఎల్‌వీ రాకెట్లలో పీఎస్ఎల్‌వీ–ఎక్స్‌ల్, పీఎస్ఎల్‌వీ–డీఎల్, పీఎస్ఎల్‌వీ–క్యూఎల్, పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ అనే పేరుతో పలు రకాల రాకెట్‌లను ప్రయోగిస్తున్నారు. ఇది కూడా కొత్తరకం స్ట్రాపాన్ బూస్టర్ కావడం విశేషం.

ఏపీఐఐసీ స్థలం కబ్జాకు

టీడీపీ నేతల యత్నం

- విశాఖ జిల్లా అగనంపూడిలో రెండెకరాల స్థలంలో దేవతామూర్తుల విగ్రహాల ఏర్పాటు
- అడ్డుకున్న ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు



స్థలాన్ని చదును చేస్తున్న ఆక్రమణదారులు

అగనంపూడి (గాజువాక): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) స్థలాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు చేసిన యత్నాలను ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం అగనంపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 228లోని రెండెకరాల స్థలాన్ని గతంలో ఫార్మా సిటీ నిర్వాసితుల కోసం కేటాయించారు. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్వాసితులకు స్థలాలు ఇవ్వడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదే అదునుగా భావించిన ఆ వార్డుకు చెందిన టీడీపీ నేతలు సదరు స్థలంలో రాత్రికి రాత్రే దేవతామూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. విగ్రహాల పేరుతో సదరు స్థలాన్ని వారి చేతుల్లోకి తీసుకోవాలని కుట్ర పన్నారు. దీంతో స్థానికులు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గాజువాక రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు ఆక్రమిత స్థలాన్ని సందర్శించి సిమెంట్ దిమ్మలను నేలమట్టం చేశారు. అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టారు. ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత హెచ్చరించారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.